


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

పోటు రంగారావుకు ఇచ్చిన నోటీసులను... ఎన్ఐఎ ఉపసంహరించుకోవాలి 03

అవాస్తవిక కథనాలతో అమిత్‌షా 12
న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసే యత్నం

ఎలక్ట్రానిక్స్ తయారీలో 'గ్లోబల్ హబ్'గా తెలంగాణ 12

సంపుటి 09, సంచిక: 132 | ఆదివారం | 12-04-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## బిజెపి అధికారంలోకి వస్తే
# సిఎఎ వేగవంతం

### బెంగాల్ ఎన్నికల ప్రచారంలో మోదీ



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతు చూసి తణమూల్ కాంగ్రెస్ భయాందోళనలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పుకొచ్చారు. శనివారం జరిగిన ఎన్నికల బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ మమతా బెనర్జీ సర్కారు తీరుపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. రాష్ట్రంలో బిజెపికి లభిస్తున్న ఆదరణను చూసి మమతా బెనర్జీ నేతత్వంలోని ప్రభుత్వం భయాందోళనకు గురవుతోందని ప్రధాని అన్నారు. ఓటమి భయంతోనే తృణమూల్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, అర్హులైన దరఖాస్తుదారులందరికీ సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తామని ప్రధాని అన్నారు. దక్షిణ బెంగాల్లోని పలు జిల్లాల్లో విస్తరించి ఉన్న మతువా సమాజాన్ని ఒక ప్రభావవంతమైన ఎన్నికల వర్గంగా పరిగణిస్తున్న, పౌరసత్వ అంశం రాజకీయంగా వివాదాస్పదంగా ఉన్న రాష్ట్రంలో ఈ వ్యాఖ్యలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. బిజెపి అధికారంలోకి వస్తే తరువాయి 2లో



## నా అభ్యర్థిత్వం రద్దుకు
# బిజెపి కుట్ర

### మమత తీవ్ర ఆరోపణ

**కోల్‌కతా:** ఎన్నికల కమిషన్‌తో బిజెపి కుమ్మక్కై భవానీపూర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు ప్రయత్నించినట్టు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. పశ్చిమ మేదినిపూర్ జిల్లాలోని కేషియారిలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ తనపై తప్పుడు కేసులు తరువాయి 2లో

# చర్చలు షురూ...



శాంతి చర్చలకు వచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, ఇరాన్ ప్రతినిధి ఘాలిబాఫ్‌కు స్వాగతం పలుకుతున్న పాకిస్థాన్ ప్రధాని

- ఇస్లామాబాద్‌లో అమెరికా–ఇరాన్ మధ్య ప్రత్యక్ష చర్చలు
- మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ కూడా హాజరు
- లెబనాన్‌లో యుద్ధం విరమణకు ఇరాన్ ప్రతినిధి ఘాలిబాఫ్ డిమాండ్
- షరతులు అంగీకరించకపోతే చర్చలు రద్దు : ఇరాన్
- చర్చలు విఫలమైతే మళ్ళీ దాడులు : ట్రంప్ హెచ్చరిక

**ఇస్లామాబాద్:** ప్రపంచదేశాల భారీ అంచనాలు,ఉత్కంఠ, మార్కెట్ల ఆశలమధ్య పశ్చిమాసియాలో యుద్ధ సమస్య పరిష్కారానికి ఇరాన్–అమెరికా ప్రతినిధుల మధ్య ముఖాముఖీ ప్రత్యక్ష చర్చలు ప్రారంభమయ్యాయి. దీంతో అప్పటివరకూ చక్కెర్లు కొట్టిన ఊహాగానాలు, సందిగ్ధానికి తెరపడింది.సానుకూల వాతావరణం మధ్య చర్చలు మొదలయ్యాయన్న సంకేతాలు వచ్చాయి. మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ ప్రతినిధులు కూడా ఈ ప్రత్యక్ష చర్యల్లో పాల్గొన్నారు. ఇస్లామాబాద్‌లో శనివారం సాయంత్రం 6.30 గంటలకు ఈ త్రైపాక్షిక ప్రత్యక్ష చర్చలు మొదలైనట్లు పాకిస్థాన్ ప్రభుత్వ వర్గాలు రాయిటర్స్, బిబిసి సహా అంతర్జాతీయ వార్తాసంస్థలకు తెలియజేశాయి. ఆ తర్వాత రాత్రి 8.50 గంటల సమయానికి అక్కడ ఉన్న పాకిస్థాన్ అధికారులు సానుకూల సంకేతాలు ప్రకటించారు. రెండు గంటల చర్చల తర్వాత చర్చలకు విరామం వచ్చింది. ఇజ్రాయెల్ అదే పనిగా లెబనాన్‌పై దాడులు చేయడం చర్చలనునిరర్థకం చేస్తాయి అని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ అదేసమయంలో ఎక్స్ వేదికగా తాజా సందేశం పెట్టారు. ఈ లెబనాన్ తరువాయి 2లో

## ఇజ్రాయెల్– లెబనాన్ చర్చలపై సందిగ్ధత

- తొలుత 14న అమెరికాలో చర్చలకు నిర్ణయం
- హెజ్బొల్లా వ్యతిరేకతతో చివరి నిమిషంలో ప్రయాణం వాయిదా వేసుకున్న లెబనాన్ ప్రధాని

**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో యుద్ధం ముగిసేందుకు ప్రధాన షరతుగా మారిన లెబనాన్ సమస్యపై ఈనెల 14వ తేదీ మంగళవారం వాషింగ్టన్‌లో ఇజ్రాయెల్–లెబనాన్ ముఖాముఖీ సంభాషణలకు సిద్ధమయ్యాయి. కానీ చివరి నిమిషంలో లెబనాన్ ప్రధానమంత్రి నవాఫ్ సలామ్ చర్చలకు వెళ్ళకుండా అమెరికా పర్యటన వాయిదా వేకున్నట్లు శనివార రాత్రి పొద్దుపోయాక వార్తలు వెలువడ్డాయి. ఆయన ప్రకటనకు ముందుగా సోషల్ మీడియాలో ఇరాన్ సర్వాధినేత అంతర్జాతీయ వ్యవహారాల సలహాదారు ఒక పోస్టింగ్ పెట్టారు. ఎంతో వీరోచితమైన హెజ్బొల్లా సైనికులను,వారి ప్రాతినిధ్యాన్ని పక్కకునెట్టి, వారి త్యాగాలు,పోరాట పటిమను లెక్కచేయకుండా అమెరికాతో చర్చలకు వెళ్ళడం లెబనాన్‌ను పూర్తిగా భద్రతా సమస్యల్లోకి నెట్టడమే అవుతతుందని హెచ్చరిక జారీ అయ్యింది. అదేవిధంగా తరువాయి 2లో



ఉప్పూ నిప్పులా వ్యవహరించే ప్రధాని నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ శనివారం పార్లమెంట్ ఆవరణలో జ్యోతిబా ఫూలే జయంతి సందర్భంగా ఎదురెదురు పడ్డారు. ఈ సందర్భంగా కొద్దిసేపు వారు మాట్లాడుకున్న దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. 05



మహాత్మ జ్యోతిరావు ఫూలే జయంతి సందర్భంగా ఢిల్లీలోని తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపి మల్లు రవి పాల్గొన్నారు.

# నవసమాజ సృష్టికి రచయితలే చోదక శక్తులు



### సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**(వేల్పుల నారాయణ)**

ముంబై : దోపిడి, పీడన లేని నవసమాజ సృష్టికి రచయితలే చోదక శక్తులని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ముంబైలో మున్షీ ప్రేమ్ చంద్ విచార్ ధార, సెమినార్‌లో అఖిల భారత ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ 90 వార్షికోత్సవాలను ప్రారంభించారు. రెండు రోజుల పాటు సెమినార్ జరుగుతుంది. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ కులం, మతం, అంటరానితనం, దేవుడు పేరున సంకుచిత భావనలతో కూరుకుపోయిన మనసులను మార్చడం ఇప్పుడు తరువాయి 2లో

# రాష్ట్రంలో ఫ్యూడల్ శక్తుల పునరేకీకరణ ప్రయత్నం

### బిసి సబ్ ప్లాన్‌పై ఆలోచిస్తాం

- బహుజనులు ఏకమై ప్రజాప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలి
- ఎన్ని అవాంతరాలు వచ్చినా సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిటారుగా నిలబడుతుంది
- మహాత్మా ఫూలే ద్విశతాబ్ది జయంతి సభలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్**

ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే అమల్లోకి తీసుకువచ్చిందని, బిసి సబ్ ప్లాన్ డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చినందున ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆలోచన చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఫ్యూడల్ శక్తుల పునరేకీకరణ ప్రయత్నం జరుగుతున్నదని, బహుజనులు ఏకమై ప్రజా ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్ని అవాంతరాలు వచ్చినా నిటారుగా నిలబడుతుందని స్పష్టం ఆయన చేశారు. మహాత్మా ఫూలే ద్విశతాబ్ది జయంతి తరువాయి 2లో

# నేడు ఇంటర్ ఫలితాలు


- ఉదయం 11 గంటలకు విడుదల
- మొబైల్ ఫోన్‌లో.. మీసేవ ద్వారా కొత్త విధానాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్**

ఇంటర్ పరీక్షా ఫలితాలు ఆదివారం ఉదయం 11 గంటలకు వెలువడనున్నాయి. ఈ ఫలితాలను ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి, ఇంటర్మీడియెట్ బోర్డు వైస్ ఛైర్‌పర్సన్ యోగితా రాణా విడుదల చేయనున్నారు. అనంతరం ఇంటర్ ఫలితాలు https//tgbie.cgg.gov.in, https//results.cgg.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండనున్నాయని అధికారులు వెల్లడించారు. కాగా ఆదివారం వెలువడే తరువాయి 2లో

## అగ్ని ప్రమాదాలకు
# రెడ్ కార్పెట్

- ఉమ్మడి మద్దూరు, ధూల్మిట్ట మండలాల్లో ఫైర్ సేఫ్టి లేకుండా రైస్ మిల్లుల నిర్వహణ
- చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల డిమాండ్



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట**

అసలే వేసవి కాలం.! రోజురోజుకూ భానుడి ప్రతాపం తీవ్రంగా ఉంది. ఇతర సమయాలతో పోలిస్తే ఎక్కువ శాతం ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో భారీ పరిశ్రమల నుండి చిన్న చిన్న పరిశ్రమల్లోను ఈ వేసవిలో నిత్యం ఎక్కడో ఒక చోట అగ్ని ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. వీటికి ముఖ్య కారణాలు, పరిశ్రమల నిర్వహకుల నిర్లక్ష్యం, అధికారులు తనిఖీలు చేయకుండా అలసత్వాలతో ఉండడం వంటి వాటితో, ప్రజల ప్రాణాలతో పాటుగా అందులో పనిచేసే కార్మికుల జీవితాలు (బుగ్గిపాలు అవుతున్నాయి) బలైపోతున్నాయి. సిద్ధిపేట జిల్లాలోని ఉమ్మడి మద్దూరు, ధూల్మిట్ట మండలాల్లోని పలు రైస్ మిల్లులు కనీస ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా నడుస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా రైస్ మిల్లులలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం తరువాయి 2లో



## హోర్ముజ్ ఆటంకాల తొలగింపు ప్రక్రియ ప్రారంభించాం: ట్రంప్



**వాషింగ్టన్:** హోర్ముజ్ జలసంధిని నౌకల రాకపోకలకు వీలుగా సిద్ధం చేసే ప్రక్రియ ప్రారంభించామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్–అమెరికా చర్చల్లో హోర్ముజ్ జలసంధి కీలకాంశంగా ఉంది. చర్చలు మొదలై రెండు గంటలు సాగిన తర్వాత ట్రంప్ నుండి ఈ ప్రకటన వచ్చిందని సిఎన్ఎన్ పేర్కొంది. ఇరాన్ చిత్తుగా ఓడిపోతుందని, బాగా నష్టపోతుందని ఇస్లామాబాద్‌లో ఇరాన్–అమెరికా ప్రతినిధులమధ్య శనివారం సాయంత్రం ఆరు గంటల తర్వాత సంభాషణలు ప్రారంభం కాగానే ట్రంప్ ఈ మేరకు తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదిక ద్వారా ప్రకటన చేశారు. ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన చేస్తూ, ''ఇరాన్ విజయం సాధిస్తుందని చెప్పడానికి మీడియా సభ్యులు బాగా ఇష్టపడతారు, కానీ వారు ఓడిపోతున్నారని, చిత్తు చిత్తుగా ఓడిపోతున్నారని అందరికీ బాగా తెలుసు'' అని పేర్కొన్నారు. ఇక ట్రంప్ ఇరాన్‌పై గతంలో చేసిన అనేక ఆరోపణలను మరోసారి పునరావృతం చేశారు. ''వారి నౌకాదళం నాశనమైంది, క్షిపణి వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేశాం, అనేక దశాబ్దాలపాటు కోలుకోలేనివిధంగా వారి మిలిటరీని దెబ్బతీశాం, వారి విమాన నిరోధక యంత్రాంగం పనిచేయడంలేదు,రాడార్ యంత్రాంగం పనిచేయడంలేదు, వారి క్షిపణులు, డ్రోన్లు అన్నీ ధ్వంసమయ్యాయి, ఇంతకుముందు ఉన్న వారి నాయకులందరూ మరణించారు.అల్లాకు స్తోత్రం...'' అని తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. ఇరాన్ సముద్రంలో మైన్లు పెడుతోందని వార్తలు వచ్చిన తర్వాత ప్రతిగా ఆయన మాట్లాడుతూ, అమెరికా ఇప్పుడు ప్రపంచానికి మేలు చేసే పనులు ప్రారంభిస్తుందని, హోర్ముజ్ జలసంధిని శుభ్రం చేయడం ప్రారంభిస్తుందని చెప్పారు. అదేవిధంగా అమెరికాలో రైతులకు ఎరువుల సమస్య వస్తుందన్న వార్తలపై కూడా తాను నిశితంగా పరిశీలన చేస్తున్నానన్నారు. ఈ ధరలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నానన్నారు.


## చంద్రయాత్ర వ్యోమగాములు

# సురక్షితంగా భూమికి..

### చంద్రుడిపై శాశ్వత నిర్మాణాలకు బాట వేసిన ఆర్టెమిస్– 2

### తదుపరి లక్ష్యం అంగారకుడే: ట్రంప్

**శాక్రిమెంటో:** చంద్రుడి చుట్టూ తిరిగి చరిత్ర సృష్టించిన నాసా మూన్ మిషన్‌లోని నలుగురు వ్యోమగాములు సురక్షితంగా భూమికి తిరిగి వచ్చారు. ప్రపంచానికి ఆర్టెమిస్–2 ఒక గొప్ప కానుక'' అని నాసా అధికారులు వ్యాఖ్యానించారు. భూగ్రహం మీద ఉన్న మానువుణ్ణి సురక్షితంగా చంద్రుడి ఉపరితంమీదకు తీసుకువెళ్ళి వదిలిపెట్టడం, చంద్రుడిపై శాశ్వత స్థావరాలు నిర్మించుకోవడం అనే రెండు లక్ష్యాలు భవిష్యత్తులో మానవులు చేపట్టే ప్రధాన కార్యక్రమం. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ఆర్టెమిస్–2 నిర్వహించింది. దీంతో ఇక తదుపరి చంద్రుడి మీద నుండి లోతైన విశ్వాంతరాళంలోకి ఉద్ధృత ప్రయోగాలు, రోదసీ అన్వేషణ కార్యక్రమాలు నిర్వహించడానికి అవకాశాలు పెరుగుతాయి. మానవ జాతి రోదసీ విజ్ఞాన విస్తృతికి ఈ ప్రయోగం ఒక మైలురాయి ఘట్టం.ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వారికి అభినందనలు తెలియజేశారు. ఇక తదుపరి లక్ష్యం అంగారకుడేనని ఆయన అన్నారు. అంగారకుడిమీదకు వెళ్ళేందుకు చంద్రుడి మీద నుండి భవిష్యత్‌లో ప్రయోగాలు జరుగుతాయన్నారు. వైట్‌హౌస్‌కు రావాల్సిందిగా వ్యోమగాములకు ఆయన ఆహ్వానం పలికారు. వ్యోమగాములు రీడ్ వైస్‌మాన్ (కమాండర్), పైలట్ విక్టర్ గ్లోవర్, మిషన్ స్పెషలిస్టు క్రిస్టినా కోచ్, కెనడా దేశ వ్యోమగామి జెరెమీ హాన్‌సన్‌లు మొత్తం తొమ్మిదిరోజులపాటు చంద్ర యాత్ర పూర్తిచేసి తిరిగి వచ్చారు. వ్యోమగాములు ప్రయాణిస్తున్న ఓరియన్ అంతరిక్ష నౌక (ఇంటిగ్రిటీ) పసిఫిక్ మహాసముద్రంలో కాలిఫోర్నియా తీరంలో బెలూన్ల సహాయంతో సురక్షితంగా దిగింది. తీవ్రమైన వేడి కారణంగా భూమిపైకి దిగేటప్పుడు ఈ నౌక



ఆరు నిమిషాలసేపు భూతల కేంద్రంతో సంబంధాలను కోల్పోయింది. ఆ తర్వాత ఈ సంబంధాల పునరుద్ధరణ జరిగింది. ''మీరు చెప్పేది మాకు చాలా స్పష్టంగా వినబడుతోంది'' అని ఓరియన్ నౌకలో ఉన్న కమాండర్ రీడ్ వైస్‌మాన్ చెప్పగానే భూతలకేంద్రం హర్షధ్వానాలతో మారుమోగింది. దీంతో ఎరుపు,తెలుపు రంగు ప్యారాఛ్యూట్లు తెరచుకున్నాయి. నౌక వేగాన్ని అదుపుచేస్తూ నౌకను సముద్ర నీటిలోకిదించాయి. దీంతో అత్యంత ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన క్షణాలను దాటుకుని ఓరియన్ నౌక సురక్షితంగా మానవ సమాజంలోకి వచ్చింది. నౌక సముద్రంలో తేలుతూ పడిన తర్వాత సహాయ సిబ్బంది వెంటనే వెళ్ళి అందులోంచి వ్యోమగాములను ఒక్కొక్కరిగా బయటకు తీసుకువచ్చారు. అక్కడి నుండి వారిని యుఎస్ఎస్ జాన్ పి.ముర్తాకు తీసుకువెళ్ళి వైద్య పరీక్షలు చేశారు. వ్యోమగాముల కుటుంబాలు హ్యూస్టర్‌లో ఎదురుచూస్తున్నాయి. ఆదివారంనాడు వారిని హ్యూస్టన్‌కు తీసుకువెళ్ళి వారి కుటుంబీకులతో అనుసంధానం చేస్తారు. వారంతా ఎంతో ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉన్నారని నాసా మిషన్ అధికారులు ప్రకటించారు. అపోలో బృందాలు ఏనాడూ నెరవేర్చని మహా కార్యాలను ఓరియన్ క్యాప్స్యూల్‌లో



వెళ్ళిన వ్యోమగాములు పూర్తిచేశారని నాసా ప్రకటించింది. భూవాతావరణంలోకి ప్రవేశించిన తర్వాత వ్యోమగాముల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులు క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహించారు. వారు ఆరోగ్యంగా ఉన్నారని ధృవీకరించారు. ఆర్టెమిస్–2 ప్రయోగం విజయవంతం కావడం ద్వారా తదుపరి ప్రయోగాలకు ఇది ఒక గొప్ప సవాలు విసిరిందని అధికారులు వ్యాఖ్యానించారు. మానవ చరిత్రలో ఇంతవకూ ఏ వ్యోమగామీ భూమికి ఇంత దూరంగా వెళ్ళలేదు.వెళ్ళడమే కాదు, వారు సురక్షితంగా తిరిగి వచ్చారు. చంద్రుడి వెనుక భాగాన్ని ఇప్పటి వరకూ ఎవరూ చూడలేదు. నలభై నిమిషాలసేపు నలుగురు వ్యోమగాములతో కూడిన ఈ అంతరిక్ష నౌక చంద్రుడిచుట్టూ పరిభ్రమించి రికార్డు సృష్టించింది. ఈ ఓరియన్ అంతరిక్ష నౌక ఏప్రిల్ ఒకటో తేదీన బయలుదేరి వెళ్ళింది. భూమికి ఎగువన ఉన్న వాతావరణంలోకి ఈ నౌక ప్రవేశించేటప్పుడు గంటకు 38,600 కి.మీ (24,000 మైళ్ళు) వేగంతో ఈ నౌక ప్రయాణం చేసింది. ఆ సమయంలో సూర్యుడి వేడిలో ఉన్న సగం వేడి ఈ నౌకను తాకింది. ఆ వేడి ప్రభావాన్ని ఈ నౌక తట్టుకుని నిలబడి ముందుకు సాగింది.

(మొదటి పేజీ తరువాయి)

## చర్చలు షురూ...

సోదరీ సోదరుల చేతిని మేం ఎప్పటికీ వదిలిపెట్టం అని పేర్కొన్నారు. రెండు దేశాల ప్రతినిధుల మధ్య ముఖాముఖీ చర్చలు జరుగుతాయని మొదటి నుండీ వార్తలు వచ్చాయి. కానీ లెబనాన్ సమస్య, ఎవరికి వారే మంకుపట్టు పట్టి ఉండటంతో మధ్యవర్తి దేశం ద్వారా పరోక్ష చర్చలు జరుగుతాయని తర్వాత ప్రచారమైంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ జరగాలన్నది ఇరాన్ ప్రధాన డిమాండ్‌గా ఉంది. దీని చుట్టూ ఇరాన్ తన సంభాషణలు నడిపిస్తుందని ఇప్పటికే స్పష్టంగా అర్థమైంది. కానీ అమెరికా అందుకు మొదటినుండీ తిరస్కరించింది. ప్రతినిధులు ముందు చేసిన ప్రకటనల ప్రకారం, మధ్యవర్తుల ద్వారా దీంతోపాటు స్తంభించిన ఇరాన్ ఆస్తుల అంశం కూడా ముందుగానే చర్చల్లోకి వచ్చే అవకాశం ఉంది. సందిగ్ధ,అగమ్యగోచర పరిస్థితులు ఏర్పడినప్పటికీ, రెండు వైపులా శత్రుదేశాల ప్రతినిధులు నిజాయతీగా చర్చలకు హాజరయ్యారు పాకిస్థాన్ సర్వసైన్యాధిపతి ఆసిఫ్ మునీర్, విదేశీమంత్రి, రక్షణమంత్రి, హోంశాఖామంత్రి తదితరులు ఇస్లామాబాద్ చేరుకున్న ఇరాన్,అమెరికా ప్రతినిధులకు వేరువేరుగా ఘన స్వాగతం పలికారు. ఈ రెండు బృందాలు చర్చలకు ముందుగా పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌ను వేరు వేరుగా కలిసి సంప్రదింపులు చేశాయి. తమ తమ శాంతి ప్రణాళికలను మీడియాతో పంచుకున్నప్పటికీ ప్రత్యేకాంశాలను వారు అధికారికంగా వివరించలేదు. చర్చలు విఫలమైతే మళ్ళీ దాడులు తప్పవని ఇరాన్‌కు ట్రంప్ శనివారం తాజా హెచ్చరిక జారీ చేయగా, ఇరాన్ కూడా మొదట ప్రతిపాదించిన 10 అంశాల ప్రణాళికకు అదనంగా మరో రెండు డిమాండ్లను జతచేర్చి అమెరికా ముందు పెట్టింది. ఎవరి డిమాండ్లతో వారు ఈ చర్చలకు వచ్చారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ యుద్ధానికి కాల్పుల విరమణ అంగీకారం వర్తించదని అమెరికా, ఈ యుద్ధం ఆపాలని ఇరాన్ మంకుపట్టు పట్టాయి.

హోర్ముజ్ జలసంధిని తెరవాలని, ఇరాన్ నిర్బంధంలో ఉన్న అమెరికన్లను విడుదల చేయాలని ట్రంప్ కోరుతుండగా,చర్చలకు మందుగానే లెబనాన్‌లో ఇజ్రాయెల్ యుద్ధం విరమించాలని, ఒప్పందాన్ని గౌరవించాలని, అమెరికా స్తంభింపజేసిన దాదాపు 120 బిలియన్ డాలర్లు (89 బిలియన్ పౌండ్లు) విలువైన తమ ఆస్తులను చర్చల ప్రారంభానికి ముందుగానే విడుదల చేయాలని చర్చల్లో పాల్గొంటున్న ముఖ్యప్రతినిధి, ఇరాన్ పార్లమెంటు స్పీకర్, ఇరాన్ రాజకీయాల్లో ప్రముఖ నాయకుడు,మాజీ మిలిటరీ కమాండర్ ఘాలిబాఫ్ డిమాండ్ చేశారు. హోర్ముజ్ జలసంధి తమ నియంత్రణలోనే ఉంటుందని, ఇక ఎప్పటికీ ఈ జలసంధి పూర్వస్థితికి వెళ్ళదని ఇరాన్ డిమాండ్ చేసింది. ఇరాన్ వద్ద ఎట్టి పరిస్థితుల్లో అణ్వాయుధం ఉండకూడదని, ఈ విషయంలో హ ఈమీ ఇవ్వాలని చర్చల్లో ఒత్తిడి తెస్తామని ట్రంప్ చెబుతుండగా,శాంతియుత ప్రయోజనాలకోసం యురేనియంను శుద్ధిచేసే హక్కును వదులుకోబోమని స్పష్టం చేశారు. ఇప్పుడు ఈ అంశాలే ఎజెండాలో ప్రధాన చర్చగా ఉన్నాయి. ఇరాన్ ప్రతిపాదనలు చర్చలకు ఒక ఆచరణీయమైన ప్రాతిపదిక అని ట్రంప్ తొలుత చెప్పారు.అదేవిధంగా విదేశీ బ్యాంకులలో స్తంభించిన ఇరాన్ ఆస్తులను విడుదల చేసేందుకు ట్రంప్ అంగీకారం తెలియజేసినట్లు ఇరాన్ తరపు ఉన్నతాధికారి ఒకరు రాయిటర్స్ వార్తాసంస్థకు చెప్పారు. ఇది చర్చల్లో ఒక పెద్ద ముందుడుగా భావిస్తున్నారు. ట్రంప్ తీసుకున్న చర్యవల్ల హోర్ముజ్ విషయంలో ఇరాన్ సానుకూలంగా స్పందించే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.కానీ వైట్‌హౌస్ అధికారి ఒకరు ఈ నివేదికను ఖండించారు. మొదటి నుండీ మీడియా ఊహించిన విధంగానే ఇరాన్ తరపున మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్ చర్చలకు ప్రాతినిధ్యం వహించారు. ఆయన వెంట విదేశీవ్యవహారలమంత్రి అబ్బాస్ అరాఘ్చి వచ్చారు. వారిద్దరూ మొదట షెహబాజ్ షరీఫ్‌తో భేటీ అయ్యారు. ముందుకుగా అనుకున్న షెడ్యూలు ప్రకారమే అమెరికా తరపున ఆ దేశ ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ నాయకత్వంలో వైట్‌హౌస్ ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్ ఇస్లాబాద్ చేరుకున్నారు. యుద్ధ పరిష్కారం జరుగుతుందని, చర్చలు సానుకూలంగా ఉంటాయని జె.డి.వాన్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చర్చలకు సంబంధించి తమ అధ్యక్షుడు ట్రంప్ స్పష్టమైన అవగాహనతో అన్ని మార్గదర్శకాలు ఇచ్చి పంపారని, అమెరికాతో ఆటలు ఆడవద్దని ఇరాన్‌ను హెచ్చరించారు. పాకిస్థాన్‌లో అమెరికా దౌత్యకార్యాలయాన్ని సందర్శించిన తర్వాత జె.డి.వాన్స్ సెరెనా హోటల్‌లో బసచేశారు. ఈ పరిస్థితుల్లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంలో ఇస్లామాబాద్‌లో ఉన్న దేశాధ్యక్ష భవనంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఈ చర్చలకు వేలాదిమంది భద్రతా దళాలను రంగంలోకి దించారు. ఈ చర్చలకు పాకిస్థాన్ కేవలం ఒక ఆతిథ్య దేశంగా మాత్రమే ఉంది తప్ప ఇరాన్–అమెరికా ప్రతినిధులమధ్య జరుగుతున్న ముఖాముఖీ చర్చల్లో పాకిస్థాన్ పెత్తనం చేసి ఎవరినీ నియంత్రించే అవకాశం లేదు. కాగా ఇస్లామాబాద్‌లో చర్చలు ప్రారంభమైన తరుణంలో అంతర్జాతీయ మీడియాలో పుంఖాను పుంఖాలుగా వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి. ట్రంప్ ఇరాన్‌ను తప్పుగా అంచనా వేశారని, తక్కువగా అంచనావేశారనేదే ఈ వ్యాఖ్యానాల్లో ప్రధానాంశంగా ఉంది. ఇదిలా ఉండగా, మార్చినెలలో అమెరికా ఫెడరల్ ప్రభుత్వ బడ్జెట్ లోటు నాలుగు బిలియన్ డాలర్లు (రెండూశాతం) అదనంగా పెరిగింది. అంటే ఈ లోటు 164 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

## చోదక శక్తులు (మొదటి పేజీ తరువాయి)

సవాలుగా మారిందని, మానవ మైండ సెట్ ను ప్రగతిశీల రచయితలు మాత్రమే మార్చగలరని అన్నారు. అందుకోసం సాహితీ వ్యవసా యం చేస్తూ నిర్మాణపరంగా బలపడాలని కో రారు. 1936 లో ప్రేంచంద్ లాంటి గొప్ప రచయితలు ప్రగతిశీల రచయితల సంఘం ఏర్పడినప్పుడు ఎలాంటి సామాజిక పరిస్థితులు ఉన్నాయో ఇప్పుడు కూడా అవి ఉన్నాయన్నారు. సమాజమార్పు కోసం బుద్ధుడు, పూలే, అంబేద్కర్ లాంటి మహామహులు, తత్వవేత్త లు ఎంతో కృషిచేశారని అన్నారు. పూలే 200 వ సంవత్సర జయంతిని మనం జరుపుకుంటున్నామని, సామాజిక న్యాయం కోసం, మ హిళా విద్యకోసం, కుల వివక్షలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన తాత్విక దార్శనికుడని, ఆ యన ఆలోచనలను సమాజ మార్పుకోసం అ న్వయించుకోవాలని సూచించారు. అదే విధం గా అంబేద్కర్ ఆజరుపుకుంటున్నామని, మనుషులను మనుషులుగా మలిచేందుకు, వారి మానసిక భావనలు నూతన ఆలోచనలవైపు మళ్లించేందుకు, ఎలాంటి వివక్షలు,అణచివేత లు, పీడనలు లేని కులరహిత,సమసమాజం కోసం, నూతన దేశం కోసం రచయితలు కృషిచేయాలని అన్నారు. సదస్సులో ముఖ్య అతిథి గా పాల్గొన్న నదీర బబ్బర్ రచయితల సదస్సు జయప్రదం కావాలని,రచయితల బాధ్యత గు రించి మాట్లాడారు. పి.డబ్ల్యు.ఎ.జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీ నారాయణ మాట్లాడు తూ ఈనాడు దేశమంటే మనుషులుకాదు, మార్కెటయిందని అన్నారు. ప్రధాన కార్యదర్శి సుఖదేవ్ సింగ్ సిర్సా,వినీత్ తివారి, రాకేశ్ వాంక్డే, తదితరులు మాట్లాడారు. అంతకు ముందు నేషనల్ కమిటీ సమావేశం జరిగిం ది.నిర్మాణ పరమైన విషయాలు చర్చించారు. ఈ సమావేశంలో అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, ఆం.ప్ర.అరసం ప్రధాన వల్లూరి శివప్రసాద్, తెలంగాణ అధ్యక్షులు పల్లేరు వీరస్వామి పాల్గొన్నారు.

## నేడు ఇంటర్ ఫలితాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షా ఫలితాలను విద్యార్థులు మీసేవ వాట్సాప్ సేవల ద్వారా క్షణాల్లో తెలుసుకోవచ్చు. ఈ సర్వీసును శనివారం ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సచివాయంలో మీసేవ కమిషనర్ టి. రవికిరణ్‌తో కలిసి ఆవిష్కరించారు. విద్యార్థులకు సంబంధించిన అన్ని సేవలను మొబైల్ ఫోన్లో అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా సూచించారు. ఇప్పటికే ఇంటర్మీడియట్, టెన్త్ హాల్‌టికెట్లను వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు ఏప్రిల్ 12 నుంచి పరీక్షా ఫలితాలను కూడా నేరుగా వాట్సాప్‌లో అందించనుంది. విద్యార్థులు 8096958096 నంబర్‌కు వాట్సాప్ లో హాయ్ మెసేజ్ పంపి మీ సేవా చాట్‌బోట్ ద్వారా తమ రోల్ నంబర్, ఇయర్, స్ట్రీమ్ వివరాలు నమోదు చేసి ఫలితాలను వెంటనే పొందవచ్చు. ప్రస్తుతం మీసేవ 580 సర్వీసులను వాట్సాప్ ద్వారా అందిస్తోంది.

## బిజెపి కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

బనాయించడం ద్వారా భవనాపూర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందని అన్నారు. అయితే కాషాయమూకల కుట్రలను తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు భగ్నం చేశారని మమత చెప్పారు. భవనాపూర్‌లో మమతా బెనర్జీపై బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పోటీలో ఉన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సమయంలో 90 లక్షల మంది పేర్లను బీజేపీ బలవంతంగా తొలగించిందని మమతా బెనర్జీ ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు గెలవలేక తప్పుడు మార్గాల ద్వారా ఓట్లు రాబట్టుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఆ కారణంగానే లక్షలాది ఓటర్లను వాళ్లు తొలగించారని, ఫలితాలు తమకు అనుకూలంగా ఉండేలా ఈవీఎంల ట్యాంపరింగ్ చేసే ఆలోచనలో ఉన్నారని అన్నారు. 'ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. తొలగించిన 90 లక్షల మంది ఓటర్లలో 60 లక్షల మంది హిందువులు, 30 లక్షల మంది ముస్లింలు ఉన్నారు. బెంగాలీ మాట్లాడినంత మాత్రమే మనం భారతీయులం కాదా. నిరంతరం పౌరసత్వం నిరూపించుకోవాలా అని మమతా బెనర్జీ ప్రశ్నించా రు. అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు చేస్తామంటూ బీజేపీ ఎన్నికల హామీపై స్పందిస్తూ... ఈ చర్యను వెనుకబడిన వర్గాలపై నేరుగా దాడి చేసేందుకు, ప్రజల ప్రజాస్వామ్య హక్కులు కొల్లగొట్టేందుకు జరుపుతున్న దాడిగా ఆమె పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్‌లో యూసీసీ అమలు చేసేది లేదన్నా రు. రాష్ట్రంలో వరుసగా నాలుగోసారి అధికారంలోకి వచ్చి... ఢిల్లీలో బేజేపీకి ఉద్వాసన పలుకుతామని, ఆ వెంటనే యూసీసీ రద్దు చేస్తామని మమత స్పష్టం చేశారు.

## సిఎఎ వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)

మహిళలకు భద్రత కల్పిస్తామని, రాజకీయ హింసలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పూర్బ బర్ధమాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తామని, అలాంటి వారికి మద్దతునిచ్చి, వారు ఇక్కడ స్థిరపడటానికి సహాయపడిన వారిపైనా చర్యలు తీసుకుంటామని మోదీ అన్నారు. అమాయక ప్రజలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతామని, అవినీతి, శాంతిభద్రతలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని ప్రకటించారు. ప్రతి తృణమూల్ గూండా, సిండికేట్, అవినీతిపరుడైన ఎమ్మెల్యే లేదా మంత్రిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని బెదిరింపులకు దిగారు. రాజకీయ హింసపై విచారణ జరిపేందుకు విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతత్వంలో విచారణ కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పుడు అమలవుతున్న పథకాలను బీజేపీ కొనసాగిస్తుందని, తాము అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తామన్నారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ గెలిస్తేనే ఆడ బిడ్డలు సురక్షితంగా ఉంటారని మోదీ చెప్పారు. బీజేపీ తీసుకున్న సంకల్పం కేవలం ఎన్నికల వాగ్దానం మాత్రమే కాదని, ఇది మమత 'జంగిల్ రాజ్', 'సిండికేట్ రాజ్' అంతానికి సంకేతమన్నారు. మహిళలకు నెలకు 3,000 ఆర్థిక సహాయం అందిస్తామని మోదీ హామీ ఇచ్చారు.

## రెడ్ కార్పెట్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నప్పటికీ, అవేవి తమకు అవసరంలేదని నిర్లక్ష్యంగా రైస్ మిల్లుల నిర్వాహకులు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం అధికారుల చేతివాటమేనని ప్రజా సంఘాల నాయకులతో పాటుగా పలు కార్మిక సంఘాల నాయకులు చెబుతున్న మాటలు. రైస్ మిల్లుల్లో వరి పొట్టు (రైస్ డస్ట్), తవుడు, దుమ్ములాంటివి సులభంగా మంటలు అంటుకునే స్వభావం కలిగి ఉంటాయి. వాటితో అగ్ని ప్రమాద ముప్పు ఎక్కువగానే ఉంటుంతి. మిషనరీ మిల్లింగ్ సమయంలో వచ్చేసూక్ష్మ మైన ధాన్యం దుమ్ము గాలిలో కలసి మిషన్ల నుండి వచ్చే చిన్నచిన్న స్పార్క్ పెద్ద అగ్ని ప్రమాదాలకు దారి తీస్తుంది. అవి అగ్నిని వేగంగా వ్యాపింపజేస్తుంది. దీంతో ఆయా మిల్లుల్లో పనిచేసే కార్మికులే కాకుండా వరిదాన్యంను పట్టించుకోవడానికి వచ్చిన ప్రజల ప్రాణాలకు కూడ గాలీలో పెట్టిన దీపంలా మరుతాయని, సిపిఐ, సీపిఎం కార్మిక సంఘాల నాయకులు తందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల పర్యవేక్షణ ఏది?

రైస్ మిల్లులు ప్రారంభిచడానికి ముందే అన్ని రకాలైన ఫ్యాక్టరీ లైసెన్స్‌లు, సివిల్ సప్లైస్ (సిఎస్‌సి) అధికారులతో పాటుగా కాలుష్య నియంత్రణ మండలి అధికారుల ఎన్‌ఓసి మరియు అగ్ని మాపక భద్రత (ఫైర్ సేఫ్టి) కోసం అగ్ని మాపక శాఖ అధికారుల నుండి నో అబ్జెక్షన్ ( ఎన్‌ఓసి) తప్పనిసరి. అవేవి లేకుండా ఇక్కడి నిర్వహకులు వాటిని కాగితాలకే పరిమితం చేస్తూ తమకు ఏమి పట్టనట్లు ఆయా మండలాల నిర్వాహకులు నిర్లక్ష్య సమాదానాలను చెబుతున్నారు. ఇది ముమ్మాటికి అధికారుల పర్యవేక్షణ లోపమేన ని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఫైర్ సే ఫ్టీ ఆడిట్ జరగాలి. అగ్నిమాపక పరికరాలను రైస్ మిల్లుల నిర్వహకులు సి ద్ధంగా ఉంచుకోవాలి, మరియు కార్మికులు వాటిని వాడేలా శిక్షణ ఇవ్వాలి ఇలా వీటిపై అధికారుల పర్యవేక్షణ ఎక్కడ లేకుండా అధికారులు సైతం ప ర్యవేక్షణ నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనిపై కార్మిక సంఘాలనాయకులతో పాటుగా పలు పార్టీల నాయకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ప్రమాదం జరిగినప్పుడు మిల్లులకు ఫైర్‌సేఫ్టీ సర్టిఫికేట్ లేకపోతే, ఇ న్యూరెన్స్ కంపెనీలు క్లెయిమ్‌ను తిరస్కరిస్తాయి. దీనివల్ల రెండు రకాల సమస్యలు ప్రాణ నష్టంతో పాటుగా యజమాన్యంకు భారీ ఆర్థిక నష్టాన్ని ఎ దుర్కోవాల్సి వస్తుంది. ఏది ఏమైనా ఇలాంటి వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల డిమాండ్

జిల్లాలోని ఉమ్మడి మద్దూరు, ధూల్మిట్ట మండలాల్లో పలు రైస్ మిల్లులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహకులు నడపడం జరుగుతున్నాయని, పలుచోట్ల రైస్ మిల్లులు కనీస ఫైర్ సేఫ్టీ (అగ్ని మాపక భద్రత) లేని రైస్ మిల్లుల నిర్వహణతో, కార్మికుల, ప్రజల ప్రాణాలకు, ఆస్థికి అత్యంత ప్రమాదకరం అని సిపిఐ, సిపిఎం పార్టీల జిల్లా నాయకులు అందె అశోక్, ఆలేటి యాదగిరిలు, వివిధ కార్మిక సంఘాల నాయకులు అన్నారు. ఆయా మండలాల తహాశీల్దరులతో పాటుగా జిల్లా అధికారులు నిర్లక్ష్యంతో, రైస్ మిల్లుల నిర్వహకులు ఇష్టారాజ్యంగా నిబంధనలు కాగితాలకే పరిమితం అనుకుంటూ, ఫైర్ సేఫ్టిపై తిలోదకాలు వదులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లుల్లో పనిచేస్తున్న కొందరు కార్మికులకు కనీసం ఫైర్ సేఫ్టిపై అవగాహన కూడలేకుండా పనిలో పెట్టుకోగా, మరికొన్ని చోట్ల కనీస వయస్సు అర్హత లేకుండా రైస్ మిల్లుల యజమానులు బాల కార్మికులను పనిలో పెట్టుకుని పనిచేపిస్తున్నారని ఆరోపించారు. అందులోను కొన్ని రైస్ మిల్లులు అగ్ని ప్రమాదాలకు రెడ్ కార్పెట్ పరుస్తూ, కార్మికుల ప్రాణాలతో చెలగాటం అడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైస్ మిల్లుల యజమానులు ఇలాగే నిర్యక్ష్యం వహిస్తే కార్మిక సంఘాలతో కలసి రైస్ మిల్లుల ఎదుట ఆందళనలు చెపడుతామని, అధికారుల నిర్లక్ష్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే పోరాటం చేస్తామని సిపిఐ, సిపిఎం జిల్లా నాయకులు అందె అశోక్, ఆలేటి యాదగిరిలు హెచ్చరించారు.

### నిబంధనలు పాటించని మిల్లులపై చర్యలు తీసుకుంటాం

ఉమ్మడి మద్దూరు, ధూల్మిట్ట మండలాల్లోని పలుచోట్ల రైస్ మిల్లులకు కనీస ఫైర్ సేఫ్టీ (అగ్ని మాపక భద్రత) లేదని, అలాంటి రైస్ మిల్లుల నిర్వహణతో, కార్మికుల, ప్రజల ప్రాణాలకు, ఆస్థికి అత్యంత ప్రమాదకరం మారాయని వస్తున్న వార్తలపై ప్రజాపక్షం ఉమ్మడి మద్దూరు, ధూల్మిట్ట మండల ప్రతినిధి వివరణ కోరగా ఆయా మండలాల తహాశీల్దార్లు స్పందిస్తూ, మండలాలలో ఉన్న పలు రైస్ మిల్లులు, వాటి నిబంధనలను పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహకులు నడపడం జరిగితే మిల్లులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మద్దూరు తహాశీల్దార్ రహీమ్, ధూల్మిట్ట తహాశీల్ధార్ శ్యామ్‌లు స్పష్టం చేశారు. దీనిపై క్షత్రస్థాయిలో తనికీలు నిర్వహిస్తామని తెలిపారు.

## చర్చలపై సందిగ్ధత (మొదటి పేజీ తరువాయి)

లెబనాన్‌లో కూడా ఆయన పర్యటనపై హెజ్బొల్లా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఆయన జియోనిస్టు జెండాను భుజానికి ఎత్తుకకుటున్నారని నిరసనలు వెల్లువెత్తాయి. వేలమంది హెజ్బొల్లా సైనికులను హతమారుస్తున్న తరుణంలో చర్చలు సమ్మతం కాదన్న విమర్శలు వచ్చాయి. లెబనాన్‌లో మార్చి రెండో తేదీన ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన తర్వాత, వాషింగ్టన్‌లో ఉన్న లెబనాన్–ఇజ్రాయెల్ దౌత్యవేత్తల మధ్య మొదటిసారి టెలిఫోన్ సంభాషణ జరిగింది. రెండు దేశాల ప్రతినిధులు వచ్చే మంగళవారం సమావేశమై లెబనాన్‌లో యుద్ధం ముగించే విషయంపై ముఖాముఖీ చర్చలు జరుపుతారని లెబనాన్ ప్రధానమంత్రి జోసెఫ్ ఔన్స్ సహాయకుడు ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. ఒకవైపు లెబనాన్‌లో ఆగకుండా ఇజ్రాయెల్ గగనతల దాడులు, భూతల సైన్యం దాడులు కొనసాగుతున్న సమయంలో మరోవైపు చర్చలకు రంగం సిద్ధమైంది. లెబనాన్‌లో ఉన్న అమెరికా దౌత్యవేత్త కూడా ఈ చర్చల్లో పాల్గొంటారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ఇరాన్ ముగించాలంటే, అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం సాఫీగా అమలు జరగాలంటే లెబనాన్‌లో ఇజ్రాయెల్ తక్షణం దాడులు అపేయాలన్నది ఇరాన్ ప్రధానమైన షరతు. సరిగ్గా ఇదే షరతును అమెరికాలో ఉన్న ఇజ్రాయెల్ దౌత్యవేత్త నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. హెజ్బొల్లా సైనికులను పూర్తిగా నిర్మూలించేవరకూ, వారిని నిరాయుధులను చేసేవరకూ లెబనాన్‌లో ప్రారంభించిన యుద్ధం ఆగేదిలేదని ఆయన స్పష్టం చేశారు. మొదటినుండీ ఇజ్రాయెల్ ఇదే వాదనతో ఉంది. చర్చలకు ముందే ఇజ్రాయెల్ ఖరాఖండీగా తెగేసి చెప్పిన తర్వాత కూడా ఆశాభావంతో ఈ చర్చలు కొనసాగుతున్నాయి. లెబనాన్‌తో తక్షణం ముఖాముఖీ చర్చలు ప్రారంభించాలని, హె జ్బొల్లా నిరాయుధీకరణ ప్రధాన ఎజెండాగా చర్చలు జరపాలని శుక్రవారం సాయంత్రం ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ తన మంత్రివర్గానికి ఆదేశించారు. వాస్తవానికి పశ్చిమాసియాలో ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో లెబనాన్‌కు ఎలాంటి సం బంధం లేదని,పాకిస్థాన్ ద్వారా ఇరాన్ ప్రతిపాదించిన 10 పాయింట్ల ప్రణాళికను గడచిన బుధవారం (ఏప్రిల్ 8) అంగీకరించి కాల్పుల విరమణకు ఒప్పుకున్న తర్వాత ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని ట్రంప్–బెంజిమన్ నెతన్యాహూ వాదన ప్రారంభించారు. ఈ ఒప్పందం లెబనాన్‌కు కూడా వర్తిస్తుందని పాకిస్థాన్ ఖరాఖండీగా ప్రకటించింది. దీనిని వ్యతిరేకిస్తూ అదేరోజు ఇజ్రాయెల్ దక్షిణ లెబనాన్‌లో గడచిన 35 రోజుల్లో ఎన్నడూలేని రీతిలో భయంకరమైన దాడులు చేసి సామాన్య ప్రజలతోసహా వందలమందిని హతమార్చింది. ఇజ్రాయెల్ చర్యలను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెరెస్,భారత్, యూరప్ సహా ప్రపంచదేశాలన్నీ ఖండించినప్పటికీ నెతన్యాహూ తన వైఖరి మార్చుకోకుండా మరిన్ని దాడులను కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ చర్యతో ఏప్రిల్ 8వ తేదీ ఉదయం హోర్ముజ్ జలసంధి ద్వారా దాదాపు తొమ్మిది నౌకలను స్వేచ్ఛగా పంపించిన ఇరాన్ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని ఆగ్రహించి వెంటనే జలసంధిని మూసేసింది. ఐతే గడచిన ఇరవైనాలుగ్గంటల్లో నాలుగు నౌకలు హోర్ముజ్‌ను దాటి వెళ్ళాయని ఐఆర్ఐబి ప్రకటించింది.ఇరాన్ పెంచి పోషిస్తున్న హెజ్బొల్లా, హౌతీ,హమాస్ ఉగ్రవాదులవల్ల, అపరిమితస్థాయిలో ఇరాన్ పెంపొందించుకుంటున్న రక్షణ,అణు,క్షిపణి,డ్రోన్ సామర్థ్యంవల్ల పశ్చిమాసియాలో తమ మనుగడకు, ఉనికికి తీవ్ర ప్రమాదం పొంచిఉందని ఇజ్రాయెల్ మొదటి నుండీ వాదిస్తోంది. రెండు సంవత్సరాలపాటు చేసిన యుద్ధంలో హమాస్‌ను నిర్మూలించిన విధంగానే లెబనాన్‌పై యుద్ధం ద్వారా హెజ్బొల్లాను కూడా నిర్మూలించాలని, ఉత్తర ఇజ్రాయెల్ ప్రాంతంవైపు తన సరిహద్దుల్లో బఫర్ జోన్‌ను అనూహ్యంగా విస్తరించాలని ఐ.డి.ఎఫ్ ప్రణాళిక వేసింది.

(మొదటి పేజీ తరువాయి)

## పునరేకీకరణ ప్రయత్నం

వేడుకలను శనివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ వి.హనుమంతరావు, వైస్ చైర్మన్ విక్రమ్ గౌడ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ సిఎం మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజనలో కుల గణనను పరిగణలోకి తీసుకోకపోతే యావత్ భారత దేశంలోని బలహీనవర్గాలకు నష్టం జరుగుతుందని, మనకోసం మనం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. అంతరాలు లేని సమాజం కోసం జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలని, జనాభా దామాషా ప్రకారం నిధులు ఖర్చు చేసినప్పుడే సకల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో 56 శాతం మంది బిసిలు ఉన్నారని తమ ప్రభుత్వం లెక్క కట్టి చెప్పిందని, వంద సంవత్సరాల క్రితం బ్రిటిష్ వారు కుల సర్వే చేశారని, ఆ తర్వాత దేశంలో కుల సర్వే చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కుల గణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ లెక్కలు పరిగణలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. దక్షిణాది రాష్ట్రాలు పెద్ద ఎత్తున సామాజిక మార్పునకు నాంది పలుకుతున్నాయని, కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయని, ద్రవిడ రాష్ట్రాలను బలహీన పరిచేందుకు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలో భారీగా తగ్గింపులు చేశారని వివరించారు. తెలంగాణ నుంచి పన్నుల రూపేనా ఒక రూపాయి కేంద్రానికి వెళితే తిరిగి రాష్ట్రానికి 37 పైసలు మాత్రమే వస్తుందని, అదే ఉత్తరాది రాష్ట్రాలైన బీహార్ నుంచి కేంద్రానికి రూపాయి వెళితే తిరిగి కేంద్రం నుంచి ఆ రాష్ట్రానికి 6.53 రూపాయలు వెళుతున్నాయని డిప్యూటీ సిఎం వివరించారు. అంతరాలు లేని సమాజం నిర్మాణానికి చిన్ననాటి నుంచే పునాదులు వేయాలని లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, ఓసి అన్ని వర్గాల పిల్లలు 12వ తరగతి వరకు ఒకే చోట చదువుకునేలా అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే 20 లక్షల మంది విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం పథకం ప్రారంభిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో రూ.15 కోట్లతో సకల సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని డిప్యూటీ సిఎం ప్రకటించారు. ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించామని తెలిపారు. మార్పు కోసం మనమంతా నడుం బిగించి అవకాశం దొరికిన ప్రతి సందర్భాన్ని వినియోగించుకోవాలన్నారు. కుల వివక్ష, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కుంగిపోకుండా తట్టుకొని నిలబడాలని, ఆచరించి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలబడ్డారు కాబట్టే మహాత్మా పూలే మహానుభావుడు అయ్యారని భట్టి విక్రమార్క తెలిపారు. మిత్రుడి పెళ్లికి వెళితే మైల పడిందని శుద్ధి చేసి పంపితే ఆ అవమానం భరించలేక సమాజ మార్పు కోసం మహాత్మా పూలే మొదలుపెట్టిన అడుగుల శబ్దం ఇప్పటికీ వినపడుతుందన్నారు. అంతరాలు లేని సమాజం విద్య ద్వారానే సాధ్యమని, మహిళల కోసం పాఠశాల లేకపోతే తన సతీమణిని హెడ్‌మాస్టర్‌గా మార్చి పాఠశాల నిర్మాణం చేసి, సమాజ మార్పుతో పాటు లింగ వివక్షపై కూడా మహాత్మా పూలే యుద్ధం చేశారని వివరించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ 200 సంవత్సరాల క్రితమే బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలేను ప్రస్తుతం ఆదర్శంగా తీసుకోవడం గొప్ప విషయమన్నారు. చదువు ఒక్కటే మన తల రాతలను మార్చగలదని పూలే విశ్వసించారని గుర్తు చేశారు. పూలే తీసుకువచ్చిన సంస్కరణలే నేడు విద్యావ్యాప్తికి దోహదపడుతున్నాయన్నారు. మహనీయుల జీవితాలను తెలుసుకుంటేనే భవిష్యత్తులో ఎలా ఉన్నతంగా జీవించాలో తెలుస్తుందని మంత్రి వివరించారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్‌తో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, బిసి సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోటు రంగారావుకు ఇచ్చిన నోటీసులను...
# ఎన్ఐఏ ఉపసంహరించుకోవాలి

### వామపక్ష పార్టీల నేతలు డిమాండ్

**ప్రజాపక్షం /హైదరాబాద్:** సిపిఐ (ఎంఎల్) 'మాస్‌లైన్' రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుకు ఇచ్చిన ఎన్ఐఏ నోటీసును తక్షణమే ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోటు రంగారావు విద్యార్థి దశ నుండే ఉద్యమాలు నిర్వహిస్తూ, నేడు అట్టడుగు ప్రజల విముక్తి కోసం పోరాడుతూ సిపిఐ(ఎంఎల్) 'మాస్‌లైన్' రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారని, అలాంటి వ్యక్తిపై జారీ చేసిన నోటీసులను ఉపసంహరించాలని, లేనట్లయితే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమానికి సిద్ధమని వారు స్పష్టం చేశారు. ఈ మేరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ(ఎంఎల్) 'మాస్‌లైన్' రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.రమ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఎస్‌యుసిఐ (సి) రాష్ట్ర కార్యదర్శి మురహరి, ఆర్ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎ.జానకి రాములు, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా ఒక సంయుక్త ప్రకటనను శనివారం విడుదల చేశారు. రంగారావుకు ఇచ్చిన కేసు నంబర్‌ను పరిశీలించగా అది గాదె ఇన్నయ్యకు సంబంధించినదని స్పష్టమైందని, ఈ కేసుతో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీకి గానీ, రంగారావుకుగానీ ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు. గాదె ఇన్నయ్య అరెస్టు విషయంలో పోలీసులు, రాజ్యం, చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా ముందస్తు నోటీసులు, సమాచారం ఇవ్వాలని, ఎలాంటి సమాచారం లేకుండా ఇష్టానుసారంగా పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. పోటు రంగారావుకు ఏలాంటి సంబంధం లేని ఈ కేసులో ఆయనను విచారించడం అవసరంలేదని భావిస్తున్నామని వారు పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రజలపై, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూ 'ఆపరేషన్ కగార్' పేరుతో వందలాది మంది ఆదివాసులను, మావోయిస్టులను హత్య చేసిందని, దీనిపై వామపక్ష పార్టీలుగా ఉద్యమిస్తూ అణచివేతను ప్రశ్నిస్తున్నవారిపై అర్బన్ నక్సలైట్లు అని ముద్ర వేసి మార్చి 31 తర్వాత వీరి ఏరివేత ఉంటుందని ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు చట్ట విరుద్ధంగా బాహాటంగానే ప్రకటించారన్నారు. అందులో భాగంగానే ఈ నోటీసు అని భావిస్తున్నామని వామపక్ష నాయకులు పేర్కొన్నారు.

## మహిళలు భాగస్వాములే కాదు.. నాయకత్వ స్థానానికి ఎదగాలి

### తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళలు నాయకత్వ స్థానాల్లోకి రావడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, మహిళలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములుగానే కాకుండా నాయకత్వ స్థానాల్లోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. 'హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్' మేనేజ్‌మెంట్ గురించి హైదరాబాద్‌లో అన్ని రంగాల వ్యక్తులకు, విద్యార్థులకు అలాగే కార్పొరేట్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వారి సామర్థ్యాన్ని పెంచేందుకు రకరకాల ప్రోగ్రామ్స్ నిర్వహిస్తోంది. ముఖ్యంగా 2025–26 సంవత్సరానికి 'మేనేజ్‌మెంట్ ఇన్ ఏఐ ఎరా' అనే థీమ్‌తో పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఎ) ఆధ్వర్యంలో ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎఐఎంఎ) అనుసంధానంతో నారీ శక్తి గురించి 'ఎమర్జ్' పేరిట హైదరాబాద్ బేగంపేట్‌లోని హోటల్ టూరిజం ప్లాజాలో శనివారం భారీ సదస్సు నిర్వహించారు. 'వుమెన్ డెవలప్‌మెంట్ నుంచి వుమెన్ లీడ్ డెవలప్‌మెంట్' అనే థీమ్‌తో నిర్వహించారు. ఈ సదస్సులో కృత్రిమ మేథస్సు (ఎఐ), విధానాలు (పాలసీ), పారిశ్రామిక రంగం (ఎంట్రప్రెన్యూర్‌షిప్), నాయకత్వం (లీడర్‌షిప్), ఆరోగ్యం (వెల్‌నెస్) వంటి అంశాలపై నిపుణులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన వక్తలు సదస్సులో పాల్గొని తమ ఆలోచనలు పంచుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. 'వుమెన్ డెవలప్‌మెంట్' అంటే మహిళల భాగస్వామ్యం మాత్రమే కాదు.. మహిళలు కార్యక్రమాల్లో పాల్గొనేవారుగానే కాకుండా, లీడర్‌షిప్ పొజిషన్లలోకి వచ్చి కార్పొరేట్ వ్యవస్థలో గానీ, వ్యాపార రంగంలో గానీ ముందుకు రావాలని తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. ఫ్యూచరిస్టిక్ సిటీ డైరెక్టర్ కరుణ గోపాల్ మాట్లాడుతూ ఎంట్రప్రెన్యూర్‌షిప్ వైపు మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గూగుల్ హెడ్ చిత్ర సూద్ మాట్లాడుతూ సదస్సులో టెక్నాలజీ, కృత్రిమ మేథస్సు (ఎఐ), పాలసీ, కార్పొరేట్ ప్రపంచంలో అడ్డంకుల అధిగమనం, ఆరోగ్యం, వెల్‌నెస్ వంటి అంశాలపై మహిళలు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎ అసోసియేషన్ అధ్యక్షుడు అల్వాల దేవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శరత్ చంద్ర మారోజు, కార్యదర్శి వాసుదేవన్ జి, ఖజాంచీ రమేష్ లక్ష్మణన్, జాయింట్ సెక్రటరీ వందనా సంబ, కన్వీనర్ చేతనా జైన్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాధార ఆరోపణలు చేస్తే లీగల్ చర్యలు తప్పవు : మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా కార్యవర్గ సమావేశం పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో శనివారం ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రి సీతక్క బిఆర్ఎస్ తప్పుడు ప్రచారానికి ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల కొనుగోలుపై స్కాం అంటూ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు. కేంద్రం నిర్దేశించిన స్పెసిఫికేషన్స్, ధరల ప్రకారం ఓపెన్ టెండర్ ద్వారా జిఇఎం పోర్టల్‌లోనే కొనుగోలు చేశామని తెలిపారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన ఫోన్లను ఎక్కువ ధరగా చూపిస్తూ ఊహాజనిత కథనాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. తనపై వ్యక్తిగతంగా దాడులు చేస్తున్నారని, నిరాధార ఆరోపణలు చేస్తే లీగల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి బిఆర్ఎస్ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారని, కాంగ్రెస్ శ్రేణులు ఒకపై తప్పుడు ప్రచారాన్ని ధీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

## కాళేశ్వరం కేసులో సిబిఐ దర్యాప్తు ప్రారంభం?



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతి, అవకతవకల ఆరోపణలపై సిబిఐ దర్యాప్తు దిశగా కసరత్తు వేగవంతమైంది. దర్యాప్తు ప్రారంభానికి ముందు అవసరమైన సాంకేతిక, ఆర్థిక అంశాలపై సిబిఐ ఉన్నతాధికారులు సమగ్రంగా చర్చించినట్లు సమాచారం.రాష్ట్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్‌లో సిబిఐ దర్యాప్తు కోరుతూ లేఖ రాసిన విషయం తెలిసిందే. ఆ విజ్ఞప్తిపై ఆలస్యమవుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే సమయంలో సిబిఐ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన పత్రాలను విశ్లేషించి, కొన్ని అంశాలపై మరింత వివరణ కోరగా, రాష్ట్ర అధికారుల బృందం ఢిల్లీ వెళ్లి క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ వివరణలపై సిబిఐ సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇప్పటికే పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలోని కమిషన్ ప్రాజెక్టుపై విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ప్రాజెక్టులో నిధుల మళ్లింపు, డిజైన్ లోపాలు, కాంట్రాక్టర్లకు చెల్లింపుల్లో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ నివేదిక ఆధారంగా రాష్ట్ర అసెంబ్లీలో చర్చించి సిబిఐ దర్యాప్తు కోరుతూ తీర్మానం ఆమోదించారు. అయితే ఈ కేసులో చర్యలు నిలిపివేయాలంటూ కె.చంద్రశేఖర్‌రావు,టి.హరీష్‌రావు తదితరులు హైకోర్టును ఆశ్రయించగా, ప్రస్తుతం వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని కోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది.త్వరలో సిబిఐ దర్యాప్తు ప్రారంభమైతే కెసిఆర్, హరీశ్ రావు సహా ప్రాజెక్టుకు సంబంధిత ఐఎఎస్ అధికారులు, ఇంజనీర్లను మళ్లీ విచారించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒకవైపు హైకోర్టులో కేసు విచారణ కొనసాగుతుండగా, మరోవైపు సిబిఐ దర్యాప్తు ఎలా ముందుకు సాగుతుందనేది కీలకంగా మారింది. రాజకీయంగా ఈ అంశం వేడెక్కుతున్న నేపథ్యంలో, సిబిఐ నుంచి అధికారిక ప్రకటన ఎప్పుడు వెలువడుతుందనేది ఆసక్తిగా మారింది.

## బిఆర్ఎస్ వలలో జీవన్ రెడ్డి చిక్కుకున్నారు

### మళ్లీ కెసిఆర్ ఎందుకు రావాలో జీవన్ రెడ్డి చెప్పాలి

### ఢిల్లీలో మీడియాతో కాంగ్రెస్ ఎంపి మల్లు రవి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ వలలో జీవన్ రెడ్డి చిక్కుకున్నారని నాగర్ కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లు రవి వ్యాఖ్యానించారు. మళ్లీ కెసిఆర్ ఎందుకు రావాలో జీవన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ప్రభుత్వంపై కెటిఆర్, హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శనివారం మీడియాతో మల్లు రవి మాట్లాడారు. రాజకీయాల్లో పార్టీ మారడం అత్యంత సహజమైన విషయమని, కెసిఆర్ ఎంపిగా పోటీ చేసినప్పుడు ఆయనకు ప్రత్యర్థిగా కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డిని బరిలో నిలిపిందని, కేవలం 10 వేల ఓట్ల తేడాతోనే జీవన్ రెడ్డి ఓడిపోయారని, ఆ విషయాన్ని ఆయన మర్చిపోయారు కానీ కరీంనగర్ ప్రజలు అసలే మర్చిపోలేదన్నారు. కాంగ్రెస్ విధానం కూడా సెక్యులరిజం, సోషలిజం, ఇంక్లూజివ్ గ్రోత్, సోషల్ జస్టిస్ కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతమని, ఈ మూల సిద్ధాంతాలకు అనుకూలంగా ఒక వ్యక్తిగా పెరిగి ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా నిబద్ధతతో పనిచేసి కాంగ్రెస్ పార్టీకి, ఆయనకు ఒక గుర్తింపును తీసుకువచ్చారని, అటువంటి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని విడిచి రాజకీయ శత్రువైన బిఆర్ఎస్‌లోకి వెళ్లడం బాధగా ఉందన్నారు. ఇవన్నీ గమనించి జీవన్ రెడ్డి ఎక్కడున్నా ఆయన వ్యక్తిత్వాన్ని, యన సిద్ధాంతాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఇప్పటివరకు జీవన్ రెడ్డి ప్రజల మనిషి అని, ప్రజల కోసం పోరాటం చేసిన నాయకుడని మేమందరం భావించామని, కానీ నియంతృత్వ పార్టీలోకి వెళ్లే జీవన్ రెడ్డి కరీంనగర్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, కార్మికులు, రైతులు, సామాన్య ప్రజలకు ఏమి సందేశం ఇస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం పోయి బిఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు రావాలో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## మహాత్మా జ్యోతిబా పూలే దార్శనిక సంఘ సంస్కర్త


### సిపిఐ తెలంగాణ రాష్ట్రసహాయ కార్యదర్శి ఇటి.నరసింహ్మా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో అనాదిగా నాటుకుపోయిన కుల వ్యవస్థను సవాల్ చేస్తూ, మహిళలకు, అణగారినవర్గాలకు విద్య, సమానత్వం లక్ష్యంగా సాగిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహాత్మా జ్యోతిబా పూలే ఒక దార్శనిక సంఘ సంస్కర్త అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ కొనియాడారు. ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతిని పురస్కరించుకుని శనివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఆయన చిత్రపటానికి ఇ.టి.నరసింహ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ గ్రంథాల ప్రామాణికతను మహాత్మా జ్యోతిబా పూలే తిరస్కరించి, సామాజిక న్యాయం, సాధికారత కోసం ఆయన చేసిన అవిశ్రాంత పోరాటాలు భారత సమాజంపై చెరగని ముద్ర వేశాయన్నారు. ప్రజలను శక్తివంతం చేయడానికి, సామాజిక అణచివేత సంకెళ్లను తెంచడానికి విద్యే కీలకమని విశ్వసించిన ఆయన దేశంలో మొదటి బాలికల పాఠశాలను, అణగారిన వర్గాల కోసం ఒక పాఠశాలను స్థాపించి వారి సాధికారత కోసం అలుపెరుగని కృషి చేశారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన పూలే వారసత్వం దేశంలోని సామాజిక న్యాయ ఉద్యమాలకు నేటికీ స్ఫూర్తినిస్తూనే ఉందని నరసింహ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఎం.ప్రవీణ్ గౌడ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రి శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆబ్కారీశాఖ డిసిని దూషించిన కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

### తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ రాజశేఖర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిజామాబాద్ డివిజన్ ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ (డిసి) వి.సోమిరెడ్డిని ఆ శాఖ కమిషనర్ అకారణంగా దూషించడాన్ని తెలంగాణ ఉద్యోగుల జెఎసి తీవ్రంగా ఖండించింది. తోటి ఉన్నతాధికారి అని కూడా చూడకుండా పరుష పదజాలంతో అవమానించడంపై జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వి.రాజశేఖర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యుడైన కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక సమావేశంలో తోటి అధికారులు, సిబ్బంది ముందే డిసి సోమిరెడ్డిని కమిషనర్ 'వెధవ, ఇడియట్' అంటూ అనుచిత పదజాలంతో దూషించినట్లు వారు ఆరోపించారు. 30 ఏళ్లుగా శాఖకు నిష్కళంకమైన సేవలు అందిస్తున్న ఉత్తమ అధికారిని ఇలా బహిరంగంగా అవమానించడం అన్యాయమన్నారు. కమిషనర్ ప్రవర్తనతో తీవ్ర మనస్తాపానికి, మానసిక ఒత్తిడికి గురైన సోమిరెడ్డి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వారు తెలిపారు. ఉద్యోగుల ఆత్మగౌరవంతో ఆడుకునే హక్కు ఏ అధికారికి లేదన్నారు. నిజామాబాద్ ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు ప్రభుత్వం వెంటనే ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. విచారణ పారదర్శకంగా సాగాలంటే ప్రస్తుత కమిషనర్‌ను వెంటనే ఆ బాధ్యతల నుంచి తప్పించాలన్నారు. కింది స్థాయి సిబ్బంది తప్పు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి కానీ, నోరు పారేసుకోవడం సరికాదని వారు హితవు పలికారు. ఈ అంశంపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిలను కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు లచ్చిరెడ్డి, రాజశేఖర్ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు వారు చెప్పారు.

## జ్యోతిబా పూలే ఆశయాలు మార్గదర్శకం

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా సాధికారత, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని ధారబోసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు (కెటిఆర్) కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించిన కెటిఆర్, సమాజంలో విద్యావేత్తగా, సంఘ సంస్కర్తగా పూలే చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. సమాజంలో వేళ్లూనుకున్న అసమానతలను రూపుమాపడానికి పూలే చేసిన కృషి అద్వితీయమని కెటిఆర్ అన్నారు. భావితరాలకు ఆయన గొప్పతనాన్ని, పోరాట పటిమను చాటి చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జ్యోతిబా పూలే ఆశయ సాధనలో భాగంగానే గత కెసిఆర్ ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని కెటిఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. మహాత్మా పూలే కన్న కలలను నిజం చేసే దిశగా నిరంతరం శ్రమిస్తామని కెటిఆర్ అన్నారు.

## బావిలో ఈతకు వెళ్లి ఇద్దరు బాలికలు మృతి



**ప్రజాపక్షం/గూడూరు:** గూడూరు మండలంలోని మట్టెవాడ శివారు నెలవంచ గ్రామంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఈతకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు ప్రమాదశాత్తు మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది గ్రామానికి చెందిన కత్తుల శ్రీజ (తండ్రి అశోక్) పెనుక చైత్ర (తండ్రి రవి) అనే బాలికలు ప్రభుత్వ పాథమిక పాఠశాలలో 4 వ తరగతి చదువుతున్నారు. శుక్రవారం పాఠశాల ముగిసిన అనంతరం ఊరు చెరువుకు ఈతకు వెళ్లినట్టు సమాచారం. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు గ్రామస్తులతో కలిసి బాలికల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.ఈక్రమంలో ఊరు చెరువు బావిలో వెతకగా ఇద్దరి బాలికల మృతదేహాలు అభ్యమయ్యాయి. ఈఘటన గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నారులు మృతితో కుటుంబ సభ్యులు ఆవేదనలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాపు కొనసాగిస్తున్నారు.

### మహిళా బిల్లులో బిసి ఉపకోటా కోసం..
## కేంద్రం వెన్నులో వణుకు పుట్టిస్తాం: కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం, బిసి మహిళల రాజకీయ హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా శనివారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లులో బిసి మహిళలకు ఉపకోటా లేకపోవడం పాలకుల అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. 'పూలే మళ్లీ పుట్టారా అన్నట్లుగా, కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమిస్తాం. ఈ నెల 16, 17, 18 తేదీల్లో పార్లమెంట్‌లో బిల్లుపై చర్చ జరగనుంది. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి అన్ని రాజకీయ పార్టీల నేతలను కలిసి మద్దతు కోరతాం. అధికారం ఉందని, ఎంపిల బలం ఉందని బిసిలను విస్మరిస్తే ఊరుకునేది లేదు,' అని కవిత హెచ్చరించారు. మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రస్తుత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కవిత మండిపడ్డారు. పూలే జయంతి నాటికి విగ్రహాన్ని పూర్తి చేయాలని తాము ఒత్తిడి తెచ్చినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. కనీసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి నాటికైనా ట్యాంక్ బండ్ వద్ద పూలే విగ్రహాన్ని సిద్ధం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పూలే చూపిన సామాజిక న్యాయం కోసం అహర్నిశలు పనిచేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో ఆందోళన చేస్తున్న ఆర్టిజన్‌లపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆమె ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టిజన్‌ల జీతాలు పెంచడంలో తెలంగాణ జాగృతి కీలక పాత్ర పోషించిందని తెలిపారు. నేడు వారికి వస్తున్న 40 వేల రూపాయల జీతంలో తమ కృషి ఉందని తెలిపారు. కొత్తగూడెంలో జరుగుతున్న వారి పోరాటానికి జాగృతి నాయకులు ప్రత్యక్షంగా మద్దతు తెలుపుతారన్నారు. సమాజంలో మార్పు తేవాలంటే ముందు అది మన నుంచే మొదలు కావాలని, పూలే ఎదుర్కొన్న అవమానాల కంటే మన కష్టాలు పెద్దవి కావని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. దేశంలో మహిళా బిల్లు చర్చ రావడానికి తెలంగాణ జాగృతి చేసిన ఉద్యమమే కారణమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు, పలువురు బిసి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పూలే చిత్రపటానికి ఎఐటియుసి, ఎఐవైఎఫ్ నేతల నివాళి




**ప్రజాపక్షం /హైదరాబాద్ :** బ్రాహ్మణ ఆధిపత్యాన్ని సవాల్ చేసి, కుల అడ్డంకులను బద్దలుకొట్టి, 'నిస్సహాయుల గళం'గా మరి మహిళల హక్కులు, అణగారిన వర్గాల విద్య సామాజిక సమానత్వం కోసం ఉద్యమాలకు నాయకత్వం వహించి, వారికీ సాధికారత కల్పించిన గొప్ప మార్గదర్శక భారతీయ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతి రావు పూలే అని ఎఐటియూసి తెలంగాణ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ కొనియాడారు. హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద ఎఐటియూసి, ఎఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మహాత్మా జ్యోతి రావు పూలే 199 వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా . ఎఐటియుసి, ఎఐవైఎఫ్ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరసింహ్మా మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం , న్యాయం కోసం అనేక పోరాటాలు చేసిన మహాత్మా జ్యోతి రావు భారతదేశ భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలిచిన గొప్ప సామాజిక విప్లవ పితామహుడు అని అయన కొనియాడారు. ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ జ్యోతి రావు పూలే ను బి.ఆర్. అంబేద్కర్ తన గురువుగా గుర్తించి అయన భావజాలం, సూత్రాల నుండి గణనీయమైన స్ఫూర్తిని పొందారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియూసి రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేశం, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా ఆర్. బాలకృష్ణ, ఎఐటియుసి నేతలు చెట్టుకింది శ్రీనివాస్, రమేష్, జంగయ్య, మల్లేష్, కాశాయ్య, ఐలయ్య, వెంకటేష్, మురళి, ఎఐవైఎఫ్ నేతలు కాంపల్లి కళ్యాణ్, భాను, సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

## పూలే దంపతులు వేసిన పునాదులే..నేటి ప్రగతికి మూలం


### కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశంలో మహిళా విద్యకు, సామాజిక సమానత్వానికి పూలే దంపతులు వేసిన పునాదులే నేటి ప్రగతికి మూలమని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను పురస్కరించుకుని శనివారం అంబర్‌పేట్‌లోని అలీ కేఫ్ జంక్షన్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలేలు అడ్డంకులను అధిగమించి మహిళలకు విద్యను అందించడం వల్లే నేడు వారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగానే ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం లోక్‌సభ, అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. వెనుకబడిన తరగతుల (ఓబిసి) సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు.

**పూలే ఆశయాలకు ప్రతిరూపం ప్రధాని మోదీ పాలన బిజెపి రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్**

సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబా పూలే కన్న కలలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అక్షరాలా నిజం చేస్తోందని బిజెపి రాజ్యసభ సభ్యులు, ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ 1848లోనే బాలికల కోసం పాఠశాల స్థాపించిన పూలే ఆశయాల బాటలో, నేడు సైనిక్ స్కూల్స్‌లో బాలికలకు ప్రవేశాలు కల్పించడం, నూతన విద్యా విధానం ద్వారా మాతృభాషలో విద్యను అందించడం నవ భారత్ నిర్మాణానికి బలమైన పునాదులని ఆయన అభివర్ణించారు.



**విద్యా విప్లవకారుడు పూలే: వి.హనుమంతరావు**

సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉండాలని విద్యా విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆకాంక్షించారని, ఆయన ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకమని కాంగ్రెస్ మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వి.హనుమంతరావు వారికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం విహెచ్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే భారతదేశంలో సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడనీ కొనియాడారు. ఆయన తన జీవితాన్ని విద్యాభివృద్ధికి అంకితం చేశారని, ముఖ్యంగా మహిళల విద్యకు ప్రాధాన్యతనిస్తూ, తన సతీమణి సావిత్రి బాయి పూలేతో కలిసి తొలి బాలికల పాఠశాలను ప్రారంభించడం గొప్ప విప్లవాత్మక అడుగు అని కొనియాడారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పూలే ఆశయాలను ముందుకు తీసుకుపోతుందని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రగతి భవన్‌ను మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా నామకరణం చేసుకున్నామని పేర్కొన్నారు. వారి ఆలోచన విధానాలు ఆశయాలను భవిష్యత్ తరాలు కొనసాగించడానికి ట్యాంక్ బండ్ పై పూలే విగ్రహం ఏర్పాటుకు పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

## ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన దారుణం

### మేనమామ చేత బాలికపై ఏడేళ్లుగా లైంగిక దాడి - పోక్సో కేసు నమోదు

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ఓదారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులకు దూరంగా మేనమామ వద్ద ఉండి చదువుకుంటున్న ఓబాలికపై అతడే లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు వెలుగుచూశాయి.వివరాల ప్రకారం,బాధిత బాలిక చిన్ననాటి నుంచే తన మేనమామ వద్ద ఉంటూ చదువుకుంటోంది. ఆమె సంరక్షణ బాధ్యతలు చూసుకుంటున్న మేనమామ నమ్మకాన్ని దుర్వినియోగం చేసుకుని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది.ఈదాడులు సుమారు ఏడేళ్లుగా కొనసాగుతున్నట్లు సమాచారం.నిందితుడి వేధింపులను భరించలేక చివరకు బాధితురాలు ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించింది.బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ ఘటనపై ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, బాలికపై లైంగిక దాడి చేసిన నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నామని చెప్పారు.ఈ ఘటన స్థానికంగా కలకలం రేపగా, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు,మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బాధితురాలికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.బాధితురాలికి కౌన్సెలింగ్ ఏర్పాటు చేసి, ఆమెకు అన్ని విధాలుగా సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.నిందితుడిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలంటూ అఖిలపక్షం, రైతుసంఘాలు ధర్నా



**ప్రజాపక్షం/కోదాడ:** కొనుగోలు కేంద్రంలో రైతులు పండించిన పంటను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు, రైతు సంఘాల నాయకులు, రైతులు శనివారం తమ్మర వద్ద కోదాడ ఖమ్మం రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోతలు కోసి రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకవచ్చి చాల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరేత్తినట్లు దాన్యం కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. మిల్లర్లు రైతుల దగ్గర తక్కువ ధరకు అడ్డగోలుగా కొనుగోలు చేస్తున్నారని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరి నశించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రహదారిపై ధర్నా చేయడంతో ప్రయాణికులు ఎండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్‌మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి కనగాల నారాయణ, దొడ్డా వెంకటయ్య, రైతులు కమతం రాజేశ్వరరావు, వీరేపల్లి కృష్ణమూర్తి, బొమ్మకంటి వీరబాబు, బైరబోయిన వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## లారీని ఢీకొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు



**ప్రజాపక్షం/కోదాడ:** ముందు వెళ్లుతున్న లారీని వెనుక నుండి వచ్చి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వేగంగా ఢీ కొట్టిన సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ శివారులోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ సంఘటనలో బస్సు ముందు భాగం నుజ్జు,నుజు కాగ 16 మంది ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం లేకపోవడంతో ప్రయాణీకులు ఊపిరిపీల్చుకున్నారు. హైద్రాబాద్ నుండి విజయవాడ వైపు వెళ్లుతున్న ప్రైవేటు బస్సులో 46 మంది ప్రయాణికలు ఉన్నారు. తెల్లవారుజామున నిద్ర మత్తులో ముందు లారీని గమనించక పోవడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గాయాలైన వారిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణం డ్రైవర్ అజాగ్రత, అతివేగం, నిద్రమత్తు కారణమని బాదితులు తెలిపారు. ప్రమాదంతో విజయవాడ, హైద్రాబాద్ మార్గంలో రాకపోకలకు కొంత సమయం నిలిచిపోయింది. పైనుండి వచ్చు వాహనాలను సర్వీసు రోడ్డు ద్వారా విజయవాడకు మళ్లించారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరా.....

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ శివారు జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం సోషల్ మిడియా ద్వారా తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాఫోటోగ్రఫీశాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రమాద వివరాలను సేకరించారు. క్షతగాత్రులకు తక్షణమే వైద్య సదుపాయాలు అందించాలని అధికారులకు ఆదేశించారు. రోడ్డు ప్రమాదంపై సమగ్ర విచారణతో నివేదిక అందించాలని స్థానిక అధికారులను ఫోను ద్వారా ఆదేశించారు. ప్రమాదానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## అంతర్రాష్ట్ర డీజిల్ దొంగల ముఠా అరెస్ట్

### 10వేల లీటర్ల డీజిల్ స్వాధీనం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** హైవేలపై ఆగి ఉన్న లారీలు, ట్రక్కుల నుంచి డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు 1000 లీటర్ల డీజిల్, రెండు డీసీఎం వాహనాలు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.అదనపు ఎస్పిజి. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి ఆధ్వర్యంలో సిసిఎస్ ఇన్స్పెక్టర్ జితేందర్ రెడ్డి, చిట్యాల సిఐ నాగరాజు పర్యవేక్షణలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి,హైవేలు అనుమానాస్పద ప్రాంతాల్లో గస్తీ పెంచడం జరిగిందన్నారు.అనుమానాస్పదంగా నిలిపిన వాహనాన్ని తనిఖీ చేయగా డీజిల్ క్యాన్లు బయటపడ్డాయి. అక్కడ 400 లీటర్ల డీజిల్ లభించింది.అందులో ఉన్న డ్రైవర్ బాలకృష్ణ ఇతరులను అదుపులోకి తీసుకొని విచారణ జరపగా హైవేపై ఆగి ఉన్న గుర్తు తెలియని లారీల నుండి డీజిల్ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని పేర్కొన్నారు.అతని సమాచారంతో మరో డీసీఎం వాహనాన్ని గుర్తించి, ముఠాలోని మిగతా సభ్యులను కూడా పట్టుకున్నారు. మొత్తం 6 మంది ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎస్పి ప్రత్యేకంగా అభినందించి రివార్డులను ప్రకటించారు.



# కుల వివక్ష నిర్మూలనకు ఫూలే స్ఫూర్తి అవసరం

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ:** సమాజంలో కుల వివక్ష,అంటరానితనం నిర్మూలన కోసం మహాత్మ జ్యోతిరావు పూలే చూపిన మార్గం నేటికీ ప్రాసంగికమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, మూఢనమ్మకాల వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన యోధుడిగా పూలే నిలిచారని పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ వద్ద నిర్వహించిన మహాత్మ జ్యోతిబా పూలే ద్వి శతాబ్ది ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈసందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ పూలే జీవితంలో జరిగిన ఒక సంఘటన ఆయనను పూర్తిగా మార్చు దిశగా నడిపించిందని తెలిపారు. తెలంగాణలో జరిగిన సాయుధ రైతాంగ పోరాటం సహా అనేక ప్రజా ఉద్యమాలపై పూలే ఆలోచనల ప్రభావం ఉందని పేర్కొన్నారు.పాఠ్యాంశాలలో శాస్త్రీయ సిద్ధాంతాలను తొలగించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల వారి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, ప్రత్యేకించి విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ లతోపాటు, నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. విద్యాభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున 200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నదని, ఇందులో ఒకేసారి 2,600 పిల్లలు చదువుకోవచ్చని అన్నారు.అలాగే నియోజకవర్గానికి ఒక తెలంగాణ మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు వెల్లడించారు. క్లాక్ టవర్ చౌరస్తానుండి నో డ్రగ్స్ క్యాంపెయిన్ కింద ర్యాలీ నిర్వహించినట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి,జిల్లా బీసీ సంక్షేమ అధికారి సంజీవ,విశ్రాంత ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్,వున్న కైలాస్ నేత,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,మరగొనినవీన్ గౌడ్,అడిషనల్ ఎస్పి రమేష్, జెడ్‌పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి,బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు మాట్లాడారు.

# పంటల మద్దతు ధర గ్యారెంటీ చట్టం

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్ డిమాండ్




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పంటల మద్దతు ధర గ్యారెంటీ చట్టం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆల్ ఇండియా కిసాన్ సభ 90వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక అనుమాల లింగయ్య భవన్ వద్ద సిపిఐ సీనియర్ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1936లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఏప్రిల్ 11న ఆవిర్భవించి నేటికి 90 సంవత్సరాలు పూర్తి చేస్తుందని వారన్నారు. నాటి నుండి నేటి వరకు అఖిల భారత కిసాన్ సభ అనేక రైతాంగ సమరశీల పోరాటాలు చేసిన విషయం వారు గుర్తు చేశారు. అఖిల భారత కిసాన్ సభ మొదటి మహాసభకు అధ్యక్షులుగా స్వామి సహాజనంద సరస్వతి, కార్యదర్శి ఎన్‌జి రంగా ఎంపికైన విషయం తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో పంటల ధరల గ్యారెంటీ చట్టాన్ని తీసుకరావడం ద్వారానే రైతుల మనగడ కొనసాగిస్తారని అన్నారు. స్వామినాధన్ కమిషన్ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమెరికా భారత్ ద్వైపాక్షిక ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు బిల్లుతో పాటే 500 రూపాయల బోనస్ రైతులకు చెల్లించాలన్నారు. రైతు బంధు తక్షణమే రైతు ఖాతాల్లో జమచేయాలన్నారు. కౌలు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలలో కౌలు రైతులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, రైతు సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల రమేష్, మామిడి నర్సయ్య, మండల కార్యదర్శి పొనుపాటి వాసుదేవరావు, ఎల్లావుల రమేష్, మామిడి వెంకయ్య, జడ వెంకన్న, మామిడి వెంకయ్య, గుండా రమేష్‌బాబు, బత్తిని ప్రసాద్, తెల్లబోయిన వీరయ్య, పుల్లయ్య, జక్కుల రమణ పాల్గొన్నారు.

# గంజాయి ముఠా గుట్టురట్టు : నలుగురు అరెస్టు



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మేళ్లచెరువు గ్రామ పరిసరాలలో గంజాయిని విక్రయిస్తున్న ముఠాను పట్టుకోవడంలో మేళ్లచెరువు పోలీసులు చాక్యచక్యంగా ప్రదర్శించారు. మేళ్లచెరువు పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ పరమేష్ కేసు వివరాలను వెల్లడించారు. శనివారం ఉదయం ఏడు గంటలకు విశ్వసనీయ సమాచారం మేరకు మేళ్లచెరువు గ్రామ శివారులోని వెంకటరామాపురం జంక్షన్ వద్ద గంజాయి అమ్ముతున్నారని సమాచారంతో వెంటన్ ఎస్ఐ పరమేష్ తన సిబ్బంది నాగులమీరా, రామారావు, పోలీస్‌స్టేషన్ వీడియోగ్రాఫర్ జి.మధుకర్‌రెడ్డి, రైటర్ రామకృష్ణచారి, డ్రైవర్ హనుమంతరావు, ఇద్దరు పంచనామదారులు డిజిటల్ మిషన్ కలిగిన చిన్నపంకు సైదులు లో కలిసి సంయుక్తంగా వెంకటరామాపురం జంక్షన్ వద్ద ఉదయం ఏడు గంటల 15 నిమిషాల సమయంలో నలుగురు వ్యక్తులు అక్కడకు వచ్చారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారు భయంతో ఇందులో గంజాయి ఉందని సమాదానం చెప్పారు. వారి వద్ద నుండి గంజాయి లభించింది. అదుపులోకి తీసుకున్న వారిలో గుండ్రోత్ వెంకట శ్రీహర్ష, పందిరి నర్సింహరావు, తుపాకుల ఉపేందర్, కామళ్ల శ్రీనివాస్ లను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న గంజాయిని తూకం వేసి జిప్ లాక్ చేశామని చెప్పారు. వారి వద్ద ఉన్న నుండి బజాజ్ సిటి 100 బైకును సీజ్ చేసి మాదకద్రవ్యాల చట్ట ప్రకారం కేసు నమోదు చేశామని, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ పరమేష్ చెప్పారు.

### మత్తు పదార్థాల బారిన పడిన వారిని

## ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మత్తు పదార్థాల బారిన పడిన వారికి మెరుగైన చికిత్స అందించి ఆరోగ్యవంతులుగా తీర్చి దిద్దాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి లోని మత్తు విముక్తి విభాగాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లాలో మత్తు పదార్థాల బారిన పడిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు ఏర్పాటు చేసిన మత్తు విముక్తి కేంద్రం ఇంచార్జ్ డాక్టర్‌తో మాట్లాడి, రోగులకు అందిస్తున్న సౌకర్యాలు, చికిత్స విధానం, కౌన్సెలింగ్,మందుల పంపిణీ వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఇంచార్జ్ డాక్టర్ అనిల్ సమాధానమిస్తూ, రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, కౌన్సెలింగ్‌తో పాటు, మెడికల్ చికిత్స అందిస్తూ వారిని శ్రద్ధగా చూసుకుంటున్నామని తెలిపారు. తదుపరి కలెక్టర్ అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. జిల్లాలో త్వరలోనే ప్రత్యేక డీఅడిక్షన్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఏఎస్‌పి రమేష్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్,జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ సంపత్, డి.ఎస్.పి శివరాం రెడ్డి,జిజి హెచ్ సూపరింటెండెంట్ నేత నరసింహారావు,ఇంచార్జ్ డాక్టర్ జ్యోష్ణ, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ప్రజా ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం



**ప్రజాపక్షం/అర్వపల్లి:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వంలోనే రైతు సంక్షేమం కొనసాగుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శనివారం మండల పరిధిలోని కుంచమర్తి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులనుద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీకాంత్, ఎవో గణేష్, ఎపిఎం రాంబాబు, ఆర్ఐ వెంకటరెడ్డి, సిసి గిరి, ఎఈవో సత్యం, సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, దేవాలయ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.




## నక్కలగండి సొరంగ మార్గాన్ని త్వరగా పూర్తి చేయాలి : సిపిఐ

**ప్రజాపక్షం/చందంపేట:** ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా సిపిఐ చందంపేట మండల పార్టీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమంతో గడపగడపకు వెళ్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ పార్టీ బలోపేతానికి విరాళాలు అడుగుతూ భవిష్యత్తు పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్ని వెంటనే అమలు చేయాలని, పెన్షన్లు పెంచుతామని ఇంత వరకు పెంచలేదని, వెంటనే ఎన్నికల హామీలను అమలు చేయాలని అన్నారు. నక్కలగండి సొరంగ మార్గంకు పూర్తి స్థాయిలో బడ్జెట్ కేటాయించి వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి వెంగళయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మహేష్, శేఖర్‌రెడ్డి, కిష్టయ్య, గోవిందు, శ్రీనివాసులు, గిరిజన సమాఖ్య మండల నాయకులు శంకర్‌నాయక్, లాలయ్య, హనుమంతు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చివరి గింజ వరకూ కొంటాం

### ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలని ప్రభుత్వం ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన శనివారం మోటకొండూర్ మండలంలోని కాటేపల్లిలో సర్పంచ్ పచ్చిమట్ల జయమ్మ మదర్ గౌడ్‌లతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోస పోవద్దన్నారు. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు విక్రయించాలన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఎ గ్రేడ్ క్వింటాలుకు రూ.2,389, బి గ్రేడ్ క్వింటాలుకు రూ.2,369 ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాని అన్నారు. ముందుగా రైతులు బీర్ల అయిలయ్యకు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలోఎంపీడీవో ఇందిర, సబ్ రిజిస్టర్ తాసిల్దార్ రాజేంద్రప్ర సాద్, ఆర్ఐ రామా రావు, ఏవో మాధవి లత, డిసిఎస్ఓ రోజారాణి, మాజీ డిసిసి అధ్యక్షులు అండెం సంజీవ రెడ్డి, సర్పంచ్‌లు భూమండ్ల జయమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బొమ్మగాని వెంకటయ్య ఆశయాలను సాధిద్దాం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తెలంగాణ సాయుధ పోరాటం యోధులు, స్వతంత్ర్య సమరయోధులు సీనియర్ కమ్యూనిస్టు నాయకులు, సూర్యాపేట జిల్లాలో గీత పనివారల సంఘం బలోపేతం కోసం పనిచేసిన నాయకులు, సూర్యాపేట పట్టణ సిపిఐని పటిష్టం చేసిన నాయకులు కామ్రేడ్ బొమ్మగాని వెంకటయ్య అని గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని కామ్రేడ్ ధర్మబిక్షం భవన్‌లో కామ్రేడ్ బొమ్మగాని వెంకటయ్య మూడవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సూర్యాపేట గీత కార్మిక భవనం నిర్మాణం చేయడంలోనూ, ధర్మభిక్షం భవనం నిర్మాణం చేయడంలోనూ ఆయన కీలకపాత్ర పోషించారని అన్నారు. వెంకటయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు ఎండి పాషా, ఐతరాజు లింగయ్య, కుక్కడపు శౌరి, సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, ఎల్ఐసి వెంకటరెడ్డి పాల్గొన్నారు.




## మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో నేడు ఔషద నియంత్రణ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణ, నిబంధనల బలోపేత దినోత్సవ ర్యాలీని అంబేద్కర్ విగ్రహం నుండి ఖమ్మం క్రాస్‌రోడ్డు నుండి జిల్లా వైద్య అరోగ్యశాఖ అధికారి పెండెం వెంకటరమణ ప్రారంభించి స్థానిక పద్మశాలి భవన్ వరకు నిర్వహించారు. అనంతరం పద్మశాలి భవన్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఏప్రిల్ 6వ తేదీ నుండి 11వ తేదీ వరకు ఆరోగ్య వారంలో ఆరోగ్య అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి ఆరోగ్య విద్యాప్రేరణ పెంపోందించామని ఆయన అన్నారు. నేడు మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడానికి అవగాహన పెంచడానికి, నివారణచర్యలను బలపర్చడానికి అన్ని ప్రభుత్వ శాఖలు, సమాజం తమవంతు కృషి చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు నేటి యువత బానిసలై తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిజిఎమ్ సూపరిండెంట్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ తమ పిల్లల అభ్యున్నతికి ఎన్నో ఆశలతో ఉన్నత చదువుల కోసం పట్టణ ప్రాంతాలకు పంపినప్పుడు వారు ఇటువంటి దూరలవాట్లకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారిస్తే ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ మాట్లాడుతూ వైద్యుని ప్రిస్క్రిప్షన్ లేకుండా ఏ మెడికల్ షాపు మందులు ఇవ్వరాదని, యాంటి బయోటిక్స్ రావడం ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం శిక్షార్హులని అన్నారు. ఈగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డ్రగ్స్ టెస్టులో 200 పాజిటివ్ వచ్చాయని, మానసిక కుటుంబ సమస్యల వల్ల కొకైన తంబాకు, గుట్కా డ్రగ్స్ వారికి బానిసలవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి సైకియాటిస్ట్ డా. వివాసవన్, పట్టణ సిఐ వెంకటయ్య, వికాస్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్, డెమో సంజీవరెడ్డి, జిల్లాకెమిస్టి డ్రగిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు యమ ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు పెండెం విజయ్, ముషమ్, హరి, కృష్ణమూర్తి, ఉపేందర్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## ప్రతీ పనికీ డబ్బుల డిమాండ్

### శాలిగౌరారం ఎంపిడిఒపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/నల్లగొండ :** శాలిగౌరారం మండల ఎంపీడీవో ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేస్తూ మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని మండల పంచాయతీ కార్యదర్శులు అంత కలసి జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. డిమాండ్లు నెరవేర్చకపోతే మెమోలు జారీ చేస్తానని,జీతాలు నిలిపివేస్తానని,సస్పెండ్ చేస్తానని బెదిరిస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యదర్శులను ఒక్కొక్కరిని లక్ష్యంగా చేసుకుని వివిధ పనుల పేరు తో డబ్బులు అడుగుతున్నారని తెలిపారు.గతంలో ఒత్తిడి తెచ్చి కార్యాలయానికి కూలర్ కొనిపించుకున్నట్లు ఆరోపించారు.సర్పంచ్ ఎన్నికల సమయంలో ప్రభుత్వం గ్రామాల కార్యదర్శులకు విడుదల చేసిన గ్రాంట్‌లో కొంత మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని ప్రతి సమావేశంలో డిమాండ్ చేస్తున్నారని, ఇవ్వకపోతే తాను డీడీవోగా జీతాలు ఆపేస్తానని హెచ్చరిస్తున్నట్లు వివరించారు.పంచాయతీ కార్యదర్శులకు ఇంక్రిమెంట్ ఇవ్వాలంటే ల్యాప్‌టాప్ కొనివ్వాలని ఒత్తిడి చేస్తున్నారని, డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న కార్యదర్శులు డ్యూటీ సర్టిఫికెట్ కోరితే డీజిల్ ఖర్చుల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు.అదేవిధంగా,స్పెషల్ ఆఫీసర్ కాలం లో కార్యదర్శులు చేసిన ఖర్చులను చెల్లించవద్దని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు సూచిస్తూ తమను భయాందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ ఉత్తర్వులు లేకుండానే కొన్ని గ్రామాల్లో స్పెషల్ అధికారిగా నకిలీ ఉత్తర్వులతో వ్యవహరించిన ఘటనలు కూడా జరిగాయని కార్యదర్శులు ఆరోపించారు. ప్రతి విషయంలో డబ్బులు డిమాండ్ చేస్తూ వేధింపులకు గురి చే స్తున్న ఎంపీడీవోపై తక్షణం కఠిన చర్యలు తీసుకుని తమను రక్షించి న్యా యం చేయాలని జిల్లా కలెక్టర్‌ను మండల పంచాయతీ కార్యదర్శులు కోరారు.

## తగ్గిన ఎల్‌పిజి వినియోగం

# అమాంతం పెరిగిన పెట్రోల్, డీజిల్ విక్రయాలు



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన సరఫరా గొలుసును అతలాకుతలం చేస్తున్న వేళ... భారత ఇంధన రంగంలో విరుద్ధమైన ధోరణులు కనిపిస్తున్నాయి. ఒకవైపు యుద్ధ భయాలతో రవాణా ఇంధనాలైన పెట్రోల్, డీజిల్‌కు విపరీతమైన గిరాకీ పెరగ్గా, మరోవైపు వంట గ్యాస్ వినియోగం గత 21 నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ (పీపీఏసీ) విడుదల చేసిన తాత్కాలిక గణాంకాలు ఈ ఆసక్తికర అంశాలను వెల్లడించాయి. మార్చి 2026లో దేశీయ ఎల్‌పిజి వినియోగం గణనీయంగా తగ్గింది. గత నెలతో పోలిస్తే 16 శాతం, గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే 13 శాతం క్షీణత నమోదైంది. మార్చిలో మొత్తం వినియోగం 2.38 మిలియన్ టన్నుల వద్ద నిలిచింది. జూన్ 2024 తర్వాత ఎల్‌పిజివినియోగంలో ఇంతటి భారీ పతనం నమోదు కావడం ఇదే తొలిసారి. భారతదేశం తన ఎల్‌పిజిఅవసరాల్లో 60 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందులో సుమారు 90 శాతం దిగుమతులు హోర్ముజ్ జలసంధి గుండానే సాగుతుంటాయి. పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ సంక్షోభం ఈ జలసంధి ద్వారా రవాణాను ప్రభావితం చేయడంతో ఫిబ్రవరిలో రెండు మిలియన్ టన్నులుగా ఉన్న దిగుమతులు... మార్చి నాటికి 1.1 మిలియన్ టన్నులకు పడిపోయాయి. సరఫరాలో అంతరాయాలు కలగవచ్చనే భయంతో వినియోగదారులు ముందు జాగ్రత్తగా ఇంధన కేంద్రాలకు క్యూ కట్టడం వల్ల రవాణా ఇంధనాల వినియోగం ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరింది. మార్చి నెలలో ఎల్‌పిజివినియోగంలో క్షీణత కనిపించినప్పటికీ 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం వినియోగం మాత్రం ఆశాజనకంగానే ఉంది. గతేడాది కంటే 6 శాతం వృద్ధి చెంది 33.21 మిలియన్ టన్నులకు చేరుకుంది. ఇది 2019 ఆర్థిక సంవత్సరం తర్వాత నమోదైన అత్యధిక వార్షిక వృద్ధి కావడం విశేషం. ప్రస్తుత అస్థిరతపై కేంద్ర ప్రభుత్వం స్పందిస్తూ దేశంలో ఇంధన నిల్వలు తగినంతగా ఉన్నాయని, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. దేశీయ ఎల్‌పిజివినియోగంలో 90 శాతంపైగా ఉన్న గృహ అవసరాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎల్‌పీజీపై భారం తగ్గించేందుకు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జి) కనెక్షన్లను ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. మార్చిలోనే 3 లక్షల కొత్త కనెక్షన్లు ఇవ్వగా ఏప్రిల్ చివరి నాటికి మరో 6 నుంచి 7 లక్షల మంది కొత్త వినియోగదారులను చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## భారత్‌కు మరో ఎల్‌పిజి ట్యాంకర్




**న్యూఢిల్లీ:** గల్ఫ్ నుంచి భారీ ఎల్‌పిజి లోడ్‌తో భారత్‌కు బయల్దేరిన మరో నౌక 'జగ్ విక్రమ్' హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత జలసంధిని దాటిన ఈ నౌక శనివారం మధ్యాహ్నానికి గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోకి ప్రవేశించింది. కొద్ది రోజుల్లో ఇది భారత్‌కు చేరుకోనుంది. అమెరికాఇరాన్ కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత హోర్ముజ్‌ను దాటిన మొదటి నౌక ఇదే. ఈ గ్యాస్ ట్యాంకర్ 20,000 టన్నుల ఎల్పీజీ తీసుకురానుంది. జలసంధిని దాటడానికి అనుమతి కోసం జగ్ విక్రమ్ వారం రోజులకు పైగా గల్ఫ్ జలాల్లో ఎదురుచూసినట్లు షిప్పింగ్ డేటా నివేదికలు వెల్లడించాయి. ఈ ట్యాంకర్ ముంబైలోని గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ కంపెనీ యాజమాన్యానికి చెందినదిగా తెలుస్తోంది. మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయని, త్వరలో అవి కూడా ఇదే మార్గం గుండా భారత్‌కు చేరుకునే అవకాశం ఉందని నివేదికలు పేర్కొన్నాయి. వాటిలో ఒక ఎల్పీజీ గ్యాస్ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఎల్ఎన్‌జీ ట్యాంకర్, రసాయన ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటైనర్ నౌకలు, రెండు బల్క్ క్యారియర్లు, మూడు ఇతర నౌకలు ఉన్నట్లు తెలుస్తోంది.

# డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రస్థానం

### యుపిఐ ప్రస్థానానికి పదేళ్లు పూర్తి




**న్యూఢిల్లీ:** భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) శనివారంతో పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కీలక వివరాలను వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న రియల్‌టైమ్ చెల్లింపుల లావాదేవీల్లో ఏకంగా 49 శాతం వాటాతో భారత్ అగ్రస్థానంలో నిలిచిందని తెలిపింది. కేవలం 2026 జనవరిలోనే యుపిఐ ద్వారా 21.70 బిలియన్ల లావాదేవీలు జరిగాయి. వీటి విలువ రూ.28.33 లక్షల కోట్లు. దేశంలోని మొత్తం రిటైల్ డిజిటల్ లావాదేవీల్లో 81 శాతం యుపిఐ ద్వారానే జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ప్రారంభమైన నాటి నుంచి లావాదేవీల పరిమాణంలో 12 వేల రెట్లు, విలువలో నాలుగువేల రెట్లకు పైగా వృద్ధిని యుపిఐ నమోదు చేసింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ సైతం యుపిఐని ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ చెల్లింపుల వ్యవస్థగా అభివర్ణించింది. కేవలం లావాదేవీల సంఖ్యకే పరిమితం కాకుండా యుపిఐ సామాన్యుడి జీవితంలో కూడా భాగమైంది. ఆటోరిక్షా డ్రైవర్ల నుంచి వీధి వ్యాపారులు, గ్రామీణ మార్కెట్ల వరకు యుపిఐ సేవలు విస్తరించాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య, అధికారిక, అనధికారిక ఆర్థిక వ్యవస్థల మధ్య అంతరాన్ని తగ్గించి, ఆర్థిక సమ్మిళితత్వానికి మార్గం వేసిందని ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొంది. భారత యుపిఐ వ్యవస్థ పనితీరు, భద్రత, వేగాన్ని ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ లాంటి అంతర్జాతీయ సంస్థలు ప్రశంసించాయి. ప్రస్తుతం యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్ సహా ఎనిమిది దేశాల్లో యుపిఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యుపిఐ లైట్, యుపిఐ ఆటోపే, క్రెడిట్ ఆన్ యుపిఐ వంటి కొత్త సేవలను కూడా అందుబాటులోకి తెచ్చారు. దశాబ్ద కాలంలోనే దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ, నేడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది.

## బెంగాల్‌లో వేడెక్కిన రాజకీయం

# మోదీ, మమత, అమిత్ షా ప్రచార హోరు

### భారీగా జన సమీకరణ





**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ ఎన్నికల సంగ్రామం అత్యంత ఆసక్తికరమైన మలుపులు తిరుగుతోంది. ఈ శనివారం 'మెగా శనివారం'గా మారింది. బెంగాల్ రాజకీయ ముఖచిత్రంపై ఒక మహా ఘట్టంగా నిలిచిపోయింది. ఒకే రోజు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, తృణమూల్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ సుడిగాలి పర్యటనలు చేయడంతో రాష్ట్రంలో రాజకీయ వేడి అమాంతం పెరిగిపోయింది. ఈ నలుగురు అగ్రనేతల రాకతో బెంగాల్ ఎన్నికల వాతావరణం దద్దరిల్లుతోంది. తూర్పు బర్ధమాన్ జిల్లాలోని కల్నా సమీపంలోని సిమ్లాన్ వద్ద ఏర్పాటు చేసిన 'విజయ్ సంకల్ప్' సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఇందుకోసం కల్నాబర్ధమాన్ రాష్ట్ర రహదారి పక్కన గల వ్యవసాయ భూమిలో భారీ వేదిక ఏర్పాటు చేశారు. భద్రత కోసం వేదిక పరిసరాలను సీసీటీవీ నిఘాలోకి తీసుకొచ్చారు. ఈ సభకు 18 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు హాజరయ్యారు. మరోవైపు బంకురా జిల్లా ఒకేసారి రెండు ప్రధాన పార్టీల బలప్రదర్శనకు వేదిక అయింది. బర్జోరా కాలేజ్ గ్రౌండ్స్‌లో మమతా బెనర్జీ భారీ ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. ఇదే జిల్లాలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒండాలోని రామ్‌సాగర్, ఛత్నాలోని ఝూటిపహాడీ వద్ద రెండు వేర్వేరు సభల్లో ప్రసంగించారు. బీర్భూమ్ జిల్లాలోనూ రాజకీయ వాతావరణం తారస్థాయికి చేరింది. తృణమూల్ యువ నేత అభిషేక్ బెనర్జీ సైంథియాలోని జాలీబగాన్ సమీపంలో జరిగిన సభలో ప్రసంగించారు. సైంథియా నియోజకవర్గం నుంచే 50 నుంచి 60 వేల మందిని సమీకరించారు.

## రోడ్లు దిగ్బంధించిన అన్నదాతలు

**అంబాల:** హర్యానా రైతులు ఆందోళనకు దిగారు. గోధుమల సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఆన్‌లైన్ పోర్టల్ వ్యవస్థలోని సమస్యలపై రైతులు రోడ్డెక్కారు. భారతీయ కిసాన్ యూనియన్(తికైత్) నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులు శనివారం రోడ్లు దిగ్బంధం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆన్‌లైన్ వ్యవస్థలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని, తమ ఉత్పత్తుల అమ్మకాలు, చెల్లింపులలో జాప్యం జరుగుతోందని, దీనికి ప్రధాన కారణం తమ ఉత్పత్తుల అమ్మకాలు, చెల్లింపుల సమస్యలు ఎదుర్కొంటున్నామని రైతులు పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అనాజ్ మండీ వద్ద పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. నారాయణ్‌గఢ్‌లో ఇటీవల జరిగిన మహాపంచాయత్ సందర్భంగా బీకేయూ నేత రాకేశ్ తికైత్ పిలుపు మేరకు రైతులు ఆందోళనకు దిగినట్లు యూనియన్ నాయకుడు సింగర సింగ్ చెప్పారు. భూ యాజమాన్య హక్కు, సంక్లిష్ట నిబంధనకు సంబంధించిన సమస్యలతో రైతులు అల్లాడుతున్నారని ఆయన చెప్పారు. ఏళ్ల తరబడి తమ డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, వీటిని పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# మోదీ -రాహుల్ ఆసక్తికర సంభాషణ



**న్యూఢిల్లీ:** పార్లమెంటు ఆవరణలో శనివారం ఉదయం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ముఖాముఖి ఎదురుపడ్డారు. కొద్దిసేపు ఇద్దరూ ముచ్చటించుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అయింది. సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలు దేశవ్యాప్తంగా జరిగాయి. పార్లమెంటు ఆవరణలో ప్రేరణ్ స్థల్ వద్ద మోదీ, రాహుల్ గాంధీ నివాళులర్పించి ప్రసంగించారు. అంతకుముందు పార్లమెంటు ప్రాంగణానికి చేరుకున్నాక మోదీ అక్కడే వేచి ఉన్న రాహుల్ గాంధీకి, ఇతరులకు నమస్కరించారు. అనంతరం ఇద్దరూ కాసేపు మాట్లాడుకున్నారు. మోదీ మాట్లాడుతుండగా రాహుల్ గాంధీ తల ఊపుతూ, వేళ్లు కదిలిస్తూ సమాధానం ఇస్తున్నట్లుగా వీడియోలో కనిపించింది. ఈ ఇద్దరి మధ్య ఏం సంభాషణ జరిగిందనే కుతూహలం నెలకొంది. రాహుల్‌ను ప్రధాని మోదీ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. అనంతరం మోదీ మాట్లాడుతూ జ్యోతిరావ్ పూలే సమాజానికి వెలుగునిచ్చిన మహానుభావుడని, ఆయన ఆలోచనలు సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం మార్గదర్శకంగా ఉన్నాయన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల కోసం ఆయన చేసిన పోరాటం మనందరికీ ప్రేరణ అని, ఆయన చూపిన మార్గం నేటి భారతదేశానికి అవసరమని వ్యాఖ్యానించారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ నివాళి వేదికపై ఇద్దరు నేతలు పరస్పరం మాట్లాడుకోవడం, స్నేహపూర్వకంగా పలకరించుకోవడం అక్కడి వాతావరణాన్ని మరింత ప్రత్యేకంగా మార్చింది.

## మహారాష్ట్రలో భూకంపం

**ముంబయి:** మహారాష్ట్రలోని హింగోలి జిల్లా మరత్వాడా ప్రాంతంలో శనివారం ఉదయం భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.7గా నమోదైంది. హింగోలి జిల్లాలో కొన్ని ప్రాంతాలతోపాటు, పొరుగున ఉన్న నాందేడ్, పర్భణి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో కూడా భూప్రకంపనలు సంభవించాయని అధికారులు తెలిపారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ నష్టానికి సంబంధించిన సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై హింగోలి కలెక్టర్ రాహుల్ గుప్తా మీడియాతో మాట్లాడుతూ... 'పాంగ్రా షిండే గ్రామంలో కొన్ని ఇళ్లకు, కమ్యూనిటి హాల్స్‌కు భూప్రకంపనల వల్ల పగుళ్లు ఏర్పడ్డాయి. ఉదయం 8.45 గంటలకు సంభవించిన భూకంప తీవ్రత 4.7గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (ఎన్‌సిఎస్) వెల్లడించిందని నాందేడ్ అధికారులు తెలిపారు. అలాగే హింగోలి జిల్లాలోని వాస్మత్ తాలుకాలో షిర్లి గ్రామంలో భూకంప కేంద్రం భూమికి పది కిలోమీటర్ల లోతులో ఉందని అధికారులు పేర్కొన్నారు. హింగేలి పొరుగున ఉన్న నాందేడ్ నగరం, గ్రామీణ ప్రాంతాలు, అర్ధాపూర్, హద్గావ్, హిమాయత్‌నగర్ తాలూకాలు, పర్భణి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కూడా ప్రకంపనలు సంభవించాయని అధికారులు తెలిపారు.

# నదిలోకి 11 వేల లీటర్ల పాలు

### పర్యావరణవేత్తల ఆందోళన



**భోపాల్:** ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా నర్మదా నదిలోకి ఏకంగా 11 వేల లీటర్ల పాలను పోశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం సీహోర్ జిల్లా లోని భైరుందా గ్రామం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే దీనిపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. స్థానిక ప్రజలతో పాటు జలచరాలకు ఈ చర్య ప్రమాదకరమని హెచ్చరించారు. భైరుందా గ్రామంలో ఇటీవల 21 రోజులపాటు ఓ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నదిలోకి 11 వేల లీటర్ల పాలను వదిలారు. అయితే నదిలోని నీటి స్వచ్ఛత కోసం ప్రార్థనలు చేసి, ఆ తర్వాత ట్యాంకర్లతో తెచ్చిన పాలను నర్మదకు సమర్పించడం ద్వారా ఆ నీటిని కలుషితం చేశారు. దీనిపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేశారు. నదిలో కలిసిన పాలు సేంద్రియ కాలుష్య కారకంగా మారి నీటిలో ఆక్సిజన్ క్షీణిస్తుందని తెలిపారు. దాంతో నర్మద నీటిపై ఆధారపడిన స్థానికులతోపాటు, ఆ నీటిలోని జలచరాలు ఇబ్బందిపడే ప్రమాదముందని పర్యావరణవేత్త అజయ్ దూబే చెప్పారు.

# పోలీసులకు చిక్కిన డ్రగ్ క్వీన్



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని దిల్లీలో మాదకద్రవ్యాల నెట్‌వర్క్ నడుపుతూ 'డ్రగ్ క్వీన్'గా పేరుపొందిన కుసుమ్ అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న ఆమె ఆచూకీ కోసం పోలీసులు రెండు నెలల క్రితం సీక్రెట్ ఆపరేషన్ చేపట్టారు. వారాల తరబడి 200 సీసీటీవీ కెమెరాలు, 100 ఫోన్‌లను ట్రాక్ చేశారు. తాజాగా దిల్లీలోని షాదారా ప్రాంతంలో గల ఓ ఇంట్లో కుసుమ్ ఉన్నట్లు గుర్తించారు. సీక్రెట్‌గా ఆ ఇంట్లోకి వెళ్లి కుసుమ్‌ను అరెస్ట్ చేశారు. నిందితురాలిపై 11 కేసులు, రూ.50 వేల రివార్డు ఉన్నట్లు తెలిపారు. గతంలో కుసుమ్ దిల్లీలోని సుల్తాన్‌పురిలో డ్రగ్స్ విక్రయిస్తూ గ్యాంగ్‌స్టర్లతో కలిసి పనిచేసేది. క్రమంగా సొంత డ్రగ్ సిండికేట్‌ను ఏర్పాటు చేసుకొంది. దిల్లీలో హత్యలు, దోపిడీ, మాదకద్రవ్యాల దందాను చురుగ్గా నడిపిస్తోంది. అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించింది. వివిధ రాష్ట్రాలలోని మాదకద్రవ్యాల ముఠాలు ఆమె నేతృత్వంలోనే నడుస్తున్నాయి. ఆమె ఇద్దరు కుమార్తెలు, సోదరుడు కూడా ఇదే సిండికేట్‌లో పని చేస్తున్నారు. కుసుమ్ ఎక్కడా తనకు వ్యతిరేకంగా ఆధారాలు లేకుండా జాగ్రత్త పడేది. ఆమెపై అనుమానం ఉన్నప్పటికీ... అదుపులోకి తీసుకోవడం పోలీసులకు సాధ్యం కాలేదు. 2003 నుంచి పోలీసులు ఆమె కోసం గాలిస్తున్నారు. వారు దాడులు చేపట్టిన ప్రతిసారీ కుసుమ్ మాయమైపోయేది. ఫోన్‌ను ఉపయోగించకుండా కొత్త ప్రదేశాల్లో తలదాచుకుంటూ ఉండేది.

## న్యాయవాదిని కాల్చి చంపిన దుండగులు

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఒక న్యాయవాదిని కాల్చి చంపారు. ఆ తర్వాత బైక్‌పై పారిపోయేందుకు ప్రయత్నించారు. అయితే ఆ బైక్ కొంతసేపు మొరాయించింది. స్థానికులు సమీపిస్తుండటంతో ఆ హంతకులు ఆందోళన చెందారు. చివరకు బైక్ స్టార్ట్ కావడంతో వారిద్దరూ పారిపోయారు. ఇద్దరు వ్యక్తులు శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో బైక్‌పై వచ్చారు. బైక్ దిగిన ఒక వ్యక్తి మార్నింగ్ వాక్ చేస్తున్న సీనియర్ న్యాయవాది రాజీవ్ సింగ్ (45) వద్దకు వెళ్లాడు. నాటు తుపాకీతో కాల్పులు జరిపాడు. కాగా, న్యాయవాది రాజీవ్ సింగ్‌ను కాల్చి చంపిన తర్వాత ఇద్దరు హంతకులు బైక్‌పై పారిపోయేందుకు ప్రయత్నించారు.

# రోడ్లపైనే పరీక్షలు... విద్యార్థుల అవస్థలు



**పాట్నా:** బిహార్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ ప్రగల్బాలు పలికిన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నీరుగార్చుతుంది. ప్రభుత్వ బడులను నిర్లక్ష్యం చేయడంతో ప్రయివేటు విద్యా సంస్థలు ప్రేటేగి పోతున్నాయి. సివాల్ జిల్లాలోని ఓ ప్రయివేటు విద్యా సంస్థ విద్యార్థుల పట్ల దారుణంగా వ్యవహరించడం అందుకు నిదర్శనం. పరీక్షల సమయంలో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో విద్యార్థులు రోడ్లపై నిలబడి పరీక్షలు రాస్తున్నారు. అందుకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. దీనిపై నెటిజన్లు మండిపడుతున్నారు. ప్రతి ఏటా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ కనీసం పరీక్షల సమయంలో విద్యార్థులు కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడం అన్యాయమని, ఈ తరహా ప్రయివేటు విద్యాసంస్థలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

## 200కు పైగా సీట్లు గెలుస్తాం

# మహిళల భద్రత, సాధికారతకు పెద్దపీట

- సంతృప్తినిచ్చిన చిన్నారులకు పౌష్టికాహారం
- 'పిటిఐ' ఇంటర్వ్యూలో సిఎం స్టాలిన్ ధీమా



**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకే సారథ్యంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ (ఎస్‌పిఎ) 200కు పైగా సీట్లు గెలుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా వ్యక్తంచేశారు. అన్నాడీఎంకే ఎలాంటి సిద్ధాంతాలు లేకుండా దిల్లీలోని బిజెపికి మరబొమ్మలా మారిందని ఆరోపించారు. తమ ఐదేళ్ల ద్రవిడియన్ తరహా పాలనలో లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేశామని, కలైంజ్ఞర్ మహిళా సాధికారతా పథకం కింద నెలకు రూ.1000 ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పాఠశాల పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, రెండు లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. స్టాలిన్ శనివారం పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలను ప్రస్తావించారు. 'ప్రజలకు మా పార్టీ పట్ల అపారమైన ప్రేమ, నమ్మకం ఉన్నాయి. లౌకిక ప్రగతిశీల కూటమి 200కు పైగా సీట్లలో గెలిచి ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని స్టాలిన్ స్పష్టంచేశారు. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాల వ్యవహారంలో ఈసారి సంక్లిష్టంగా మారడంపై ప్రశ్నించగా... సీట్ల కేటాయింపు విషయంలో అలాంటివి మామూలేనని, అయితే చర్చలు సుహృద్భావ వాతావరణంలో ముగిశాయని చెప్పారు. కూటమిలోని నేతలు, కార్యకర్తలు సమష్టిగా అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారన్నారు. 2019 నుంచి తమ కూటమి మరింత బలపడిందని, మరిన్ని పార్టీలు వచ్చి చేరాయని చెప్పారు. తమిళనాడులోనే కాకుండా పుదుచ్చేరిలోనూ తమ కూటమి గెలుపు సాధిస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి కుటుంబం పవర్ సెంటర్‌లా వ్యవహరిస్తోందంటూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి చేసిన ఆరోపణలను స్టాలిన్ కొట్టిపడేశారు. పళనిస్వామి కట్టుకథలపై తాను స్పందించాల్సిన అవసరం లేదన్నారు. మహిళలపై నేరాలకు సంబంధించి పళనిస్వామి చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ... పొల్లాచ్చి లైంగిక దాడుల ఘటన పళనిస్వామి సారథ్యంలోని అన్నాడీఎంకే అవకతవకల పాలనకు నిదర్శనమని, అప్పటి మహిళా ఐపీఎస్ పైనా లైంగిక వేధింపులు జరిగాయని చెప్పారు. మహిళల భద్రతపై కానీ, శాంతిభద్రతలపై కానీ పళనిస్వామికి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. తమిళనాడును గుట్కా గిడ్డంగిగా ఆయన మార్చారని, తాము అధికారంలోకి వచ్చాక కఠిన చర్యలు తీసుకుని గుట్కా సహా మాదకద్రవ్యాలను తుడిచిపెట్టామని, కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉద్యోగాలు చేసే మహిళల భద్రతకు హాస్టళ్లు ఏర్పాటు చేశామని, మహిళలపై నేరాలకు కఠిన చర్యలు అమలయ్యేలా సంబంధిత చట్టాలలో మార్పులు చేశామని స్టాలిన్ చెప్పారు. తమిళనాడులో వర్కింగ్ ఉమెన్స్ ఎక్కువనీ, వారి భద్రతకు తాము భరోసాగా ఉన్నామని తెలిపారు. మహిళల భద్రత విషయంలో దేశంలోనే తమిళనాడు ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు.

**PUBLIC NOTICE**

The general public hereby informed that **BHANDARI RAMADEVI W/O. BHANDARI PRABHAKAR**,aged about 41 years,Occu: Housewife,R/o.H.No.2-1,PatimatlaVillage, Mothkur Mandal, Yadadri Bhuvanagiri District, has approached the Shriram Finance Ltd., Maredpally Branch, Hyderabad by put his documents by way of mortgage in respect of Schedule of Property to secure the future Liability towards Loan amount. If any person or person's having any objections. Right, claim, title, interest over the Schedule of Property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned to **BHANDARI RAMADEVI W/O. BHANDARI PRABHAKAR**, and no claim or no objection of any kind thereafter will be entertained.


**SCHEDULE OF THE PROPERTY**

All that the Open Plot No.1 Part & Plot No.18 Part, in. Sy. No. 70 E & 94 EE, admeasuring an 160 Sq.Yds., Open Plot No.2 Part & Open Plot No.17 Part, admeasuring 320 Sq.Yds., total admeasuring an area of 480 Sq.Yds., Situated at "Sun Shine Group Property Developers", Patimatla Village, Mothkur Mandal, Yadadri Bhuvanagiri District.,and bounded by: **NORTH:** Valigonda to Thorror road(100 feet's Road0, **SOUTH :** 33' Feet's Road, **EAST**: Plot No.17 Part & Plot no.2 Part, **WEST:** Plot No.18 Part & Plot No.1 Part.

**R.Venkateshwar Rao.,**
**Advocate & Panal Advocate of**
**Shriram Finance Ltd.,**
**5-3-29, Ramalayam Temple,**
**Kukatpally, Hyderabad-72,**
**Cell:8519985749, 9391093566**




## అత్యంత ఖరీదైన నైపుణ్యాలు ఏవీ?




ప్రపంచంలో అత్యంత ఖరీదైన నైపుణ్యాలు ఏమి అన్నప్పుడు చాలామందికి డిగ్రీలు, కోర్సులు, సర్టిఫికెట్లు గుర్తుకు వస్తాయి. కానీ నిజానికి జీవితాన్ని మలుపు తిప్పే, సంపదకు బాటలు వేసే నైపుణ్యాలు చాలా వరకు ఉచితంగానే లభిస్తాయి. వాటిని నేర్చుకోవడానికి డబ్బు అవసరం లేదు, కానీ సాధన, అవగాహన, ఆత్మనియంత్రణ అవసరం. అలాంటి నైపుణ్యాల్లో మొదటిగా భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడాన్ని ప్రస్తావించాలి. మన కోపం, బాధ, ఆనందం వంటి భావోద్వేగాలు నియంత్రణలో లేకపోతే నిర్ణయాలు కూడా తప్పుదారి పడతాయి. వ్యాపారంలో నూ, ఉద్యోగంలోనూ ఆవేశంలో తీసుకున్న నిర్ణయాల వల్ల నష్టపోయినవారు ఎంతోమంది. విజయవంతమైనవారిని గమనిస్తే, వాళ్ల పరిస్థితులు ఎంత ఒత్తిడిగా ఉన్నా ప్రశాంతంగా ఆలోచించగలుగుతారు. భావోద్వేగాలను జయించినవాడే తన డబ్బుని, తన భవిష్యత్తుని సరిగ్గా నియంత్రించగలడు.ఇక రెండవది 24 గంటల నియమం. తాత్కాలిక కోపం లేదా అతిగా వచ్చిన ఆనందం మనల్ని శాశ్వత తప్పు నిర్ణయాల వైపు నడిపిస్తుంది. పెద్ద నిర్ణయం తీసుకునే ముందు ఒక రోజు ఆగడం చాలా సాధారణంగా అనిపించవచ్చు, కానీ ఇది అద్భుతమైన రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఒక రోజు తర్వాత కూడా అదే నిర్ణయం సరైనదిగా అనిపిస్తే, అప్పుడు దాన్ని అమలు చేయడం మంచిది. ఈ అలవాటు చాలా మందిని ఆర్థిక నష్టాల నుంచి కాపాడింది. మూడవ నైపుణ్యంగా సమయానికి తగ్గట్టు మౌనంగా ఉండడాన్ని పేర్కోవాలి. మౌనం బలహీనత కాదు, అది బలమైన ఆయుధం. బేరసారాల్లో, ఒప్పందాల్లో, గొడవల సమయంలో మౌనం మనకు పైచేయి ఇస్తుంది. ఎదుటివారు ఎక్కువగా మాట్లాడేలా చేస్తుంది, వారి ఉద్దేశాలు బయటపడతాయి. తక్కువ మాట్లాడే వారు ఎక్కువగా గెలుస్తారు అన్నది అనుభవంతో తెలిసిన సత్యం. నాలుగో నైపుణ్యం మన గురించి మనం తెలుసుకోవడం. స్వీయ అవగాహన లేకుండా ఎదగడం అసాధ్యం. మనకు కోపం ఎప్పుడు వస్తుంది, మన బలహీనతలు ఏవి, మన బలాలు ఏవి అనే విషయం మనకే తెలియకపోతే, మార్పు ఎలా వస్తుంది? మనకు కనిపించని సమస్యను సరిదిద్దలేం. ఈ నైపుణ్యం మిగతా అన్నిటికీ పునాది. ఐదవది ఓపిక, అంటే కోరికలను వా యిదా వేసుకోవడం. వెంటనే సుఖం కోరుకునే అలవాటు మన భవిష్యత్తును దెబ్బతీస్తుంది. ధనవంతులు తాత్కాలిక ఆనందాన్ని త్యాగం చేసి దీర్ఘకాల లాభాల కోసం ఎదురు చూస్తారు. అవసరం లేని వస్తువుల్ని వెంటనే కొనడం కన్నా, పెట్టుబడి పెట్టడం నేర్చుకుంటే సంపద పెరుగుతుంది. ఆరవ నైపుణ్యం శ్రద్ధగా వినడం. చాలా మంది మాట్లాడటానికే ఎదురు చూస్తారు, కానీ విజేతలు వినడానికి ప్రాధాన్యం ఇస్తారు. ఎదుటివారి మాటలు నిజంగా వినగలిగితే, వారి అవసరాలు, సమస్యలు అర్థమవుతాయి. అక్కడినుంచే నమ్మకం పుడుతుంది. సమాచారమే శక్తి, ఆ సమాచారం విన డం ద్వారానే వస్తుంది. చివరిది 'వద్దు' అని చెప్పడం. ముఖ్యం కాని పనులకు 'సరే' అన్న ప్రతిసారీ, నిజంగా ముఖ్యమైన పనులకు మనం 'వద్దు' అంటున్నట్లే. విజయవంతమైనవారు తమ సమయం, శక్తిని విలువైన పనులకే ఖర్చు చేస్తారు. చెడ్డ అవకాశాలకు, సమయం వృధా చేసే విషయాలకు 'వద్దు' అనడం నేర్చుకున్నప్పుడు మాత్ర మే నిజమైన పురోగతి సాధ్యమవుతుంది. ఈ ఏడూ నైపుణ్యాలు ఉచితమే, కానీ వాటి విలువ అమూల్యం. వీటిని అలవాటు చేసుకున్నవారికి సంపద కేవలం డబ్బుగా కాదు, జీవన నాణ్యతగా కూడా పెరుగుతుంది.

## క్షణాల్లో గణన!



కంప్యూటింగ్ రంగంలో ఇటీవల నమోదైన ఒక కీలక ప్రయోగ ఫలితం ప్రపంచవ్యాప్తంగా దృష్టిని ఆకర్షిస్తోంది. శాస్త్రవేత్తల ప్రకారం, ఒక క్వాంటమ్ కంప్యూటర్ సాధారణ సూపర్‌కంప్యూటర్‌కు సుమారు 2.6 బిలియన్ సంవత్సరాలు పట్టే గణనను కేవలం నాలుగు నిమిషాల్లోనే పూర్తి చేసింది. ఇది క్వాంటమ్ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని చూపించే ఒక ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. సాంప్రదాయ కంప్యూటర్లు బైనరీ విధానంలో, అంటే 0 లేదా 1 అనే రెండు స్థితులపై మాత్రమే ఆధారపడి పని చేస్తాయి. దీనికి భిన్నంగా, క్వాంటమ్ కంప్యూటర్లు క్యూబిట్స్ అనే మూలకాలను ఉపయోగిస్తాయి. క్యూబిట్స్ ఒకేసారి అనేక స్థితుల్లో ఉండగల సామర్థ్యం కలిగి ఉంటాయి. ఈ లక్షణం వల్ల క్వాంటమ్ కంప్యూటర్లు అనేక గణనలను సమాంతరంగా నిర్వహించగలుగుతాయి. అదే ఈ అపూర్వమైన వేగానికి ప్రధాన కారణం. ఈ ప్రయోగం సాంప్రదాయ కంప్యూటింగ్ పరిమితులను సవాలు చేస్తోంది. ఇప్పటివరకు అసాధ్యమని భావించిన లేదా అమితమైన సమయం పడుతుందని అనుకున్న అనేకానేక గణిత పరమైన సమస్యలను ఇప్పుడు చాలా తక్కువ సమయంలో పరిష్కరించే అవకాశం కనిపిస్తోంది. వాతావరణ మార్పుల అంచనాలు, కొత్త ఔషధాల రూపకల్పన, క్లిష్టమైన రసాయన అణు పరస్పర చర్యల అధ్యయనం, క్రిప్టోగ్రఫీ, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో ఈ సాంకేతికత విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదని నిపుణులు భావిస్తున్నారు. అయితే, క్వాంటమ్ కంప్యూటింగ్ ఇంకా ప్రయోగాత్మక దశలోనే ఉంది. ఇది సాధించిన ఫలితాలు ప్రత్యేక సమస్యల పరిష్కారానికి పరిమితమై ఉన్నాయి. విస్తృత స్థాయిలో, రోజువారీ వినియోగానికి అనువైన క్వాంటమ్ కంప్యూటర్లు రావడానికి ఇంకా సాంకేతిక సవాళ్లు ఉన్నాయి. అయినప్పటికీ, ఈ విజయం భవిష్యత్తు దిశను స్పష్టంగా సూచిస్తోంది. మొత్తంగా చూస్తే, ఈ మైలురాయి క్వాంటమ్ భౌతికశాస్త్రంపై ఆధారపడిన కొత్త తరహా కంప్యూటింగ్ యుగానికి సూచనగా నిలుస్తోంది. అత్యంత క్లిష్టమైన సమస్యలు నిమిషాల్లోనే పరిష్కరించబడే అవకాశం ఉన్న భవిష్యత్తు ఇప్పుడు కేవలం ఊహ కాదు, శాస్త్రీయంగా సాధ్యమవుతున్న దిశగా అడుగులు పడుతున్న వాస్తవం.

## అమెరికాలో 'సూపర్ ఫ్లూ' కలకలం



యుకెను భయపెట్టిన 'సూపర్ ఫ్లూ' కేసులు ఇప్పుడు అమెరికాలో కలకరం రేపుతున్నాయి. హెచ్3 ఎన్2 ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌ను 'సూపర్ ఫ్లూ'గా పేర్కొంటారు. అమెరికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా ఫ్లూతో ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్య 14.3 శాతం పెరిగింది. ప్రస్తుతం 9,900 మందికిపైగా ఫ్లూ కారణంగా ఆ సుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇది పూర్తిగా కొత్త వైరస్ ఏమీ కాదు. కానీ, హెచ్3 ఎన్2 వేరియంట్‌లో కొన్ని మ్యూటేషన్లు (మార్పులు) చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నది. గతం కంటే ఇప్పుడు ఈ వ్యాధి చాలా వేగంగా వ్యాపిస్తున్నది. సాధారణ సీజనల్ ఫ్లూ కంటే త్వరగా కేసులు పెరిగేలా చేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) కూడా ఈ వైరస్ ప్రస్తుతం అనేక దేశాల్లో నమోదవుతున్న ఇన్‌ఫ్లుయెంజా కేసుల్లో పెద్ద శాతానికి కారణమవుతోందని తెలిపింది. ఒక నివేదిక ప్రకారం, ఈ సూపర్ ఫ్లూ అమెరికాలో కనీసం 30 రాష్ట్రాల్లో వ్యాప్తి చెందుతోంది. సూపర్ ఫ్లూ లక్షణాలు సాధారణ ఫ్లూలానే ఉన్నా, తీవ్రత ఎక్కువగా ఉండే అ వకాశం ఉంది. ముఖ్యంగా, అధిక జ్వరం, జలుబు, ముక్కు కారడం, గొంతు నొప్పి, దగ్గు, తలనొప్పి, తీవ్రమైన అలసట, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంత మందిలో, ప్రత్యేకించి పిల్లల్లో వాంతులు లేదా విరేచనాలు సమస్య కూడా ఉం టుంది. వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి దీని వల్ల ఎక్కువ సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి, గుంపులుగా ఉండే ప్రదేశాల్లో మాస్క్ వాడటం మంచిది. చేతులు తరచూ కడుక్కోవాలి, జ్వరం, దగ్గు ఉన్నప్పుడు ఇతరుల నుంచి దూరంగా ఉండాలి. నిపుణుల ప్రకారం, వైరస్ వేగంగా వ్యాపిస్తున్నందున, నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం.

# మహిళా రిజర్వేషన్ : మూడు అంశాలు

చట్టసభల్లో మహిళలకు మూడవ వంతు రిజర్వేషన్‌లు కల్పించే అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ రాసిన వ్యాసం దేశవ్యాప్తంగా గత గురువారం పలు పత్రికల్లో ప్రచురితమైంది. దీంతో ఈ అంశంపై మరోసారి రాజకీయ వేడిరాజుకుంది. రెండవ విడత పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ముగింపు సందర్భంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారపక్షం వెల్లడించింది. ఏప్రిల్ 16 న ప్రత్యేక పార్లమెంటు సమావేశం ఏర్పాటు చేసి నారీ శక్తి వందన్ అదినయం (మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ) బిల్లును ప్రవేశపట్టే అంశం ప్రధాని వ్యాసంలో వ్యక్తమైంది. దేశంలో ఐదు శాసనసభలకు ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో అకస్మాత్తుగా ఈ బిల్లును పెట్టే ఆంతర్యమేమిటో పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదు. ఇప్పటికే పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతం, కేరళ, అస్సోం రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు పూర్తయ్యాయి. తమిళనాడులో ఏప్రిల్ 23న, పశ్చిమ బెంగాల్‌లో రెండు దశలుగా ఏప్రిల్ 23, 29వ తేదీలలో పోలింగ్ జరగనుంది. మధ్యలో ఏప్రిల్ 16న మహిళా రిజర్వేషన్ చట్టాన్ని గతంలో 2034లో కాకుండా 2029 లోక్‌సభ ఎన్నికల నాటికే అమలయ్యే విధంగా సవరించనున్నారు. ఎన్నికల మధ్యలో చట్ట సవరణ తీసుకురావడం, దానికి పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబీన్ పార్టీ శ్రేణులను నిర్దేశించడం వెనుక ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఉద్దేశ్యం స్పష్టమైంది. దీనిపై ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ బిల్లును ఎన్నికల మధ్యలో పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టడం ముమ్మాటికీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించటమేనని కాంగ్రెస్ అత్యున్నత విధాన నిర్ణాయక సమితి సిడబ్ల్యుసి ఆరోపణ చేసింది. రాజ్యాంగానికి 106వ సవరణ తీసుకువస్తూ మహిళా రిజర్వేషన్ బిల్లును మొదటిసారిగా సెప్టెంబర్ 2023లో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టారు. ఇది సెప్టెంబర్ 19న లోక్సభలో, సెప్టెంబర్ 21న రాజ్యసభలో ఆమోదం పొందం పొందింది. తాజాగా ఈ నెల 16వ తేదీ నుంచి జరిగే పార్లమెంటు సమావేశాల్లో 2029 నుంచే మహిళా రిజర్వేషన్ అమలు బిల్లు సహా, నియోకవర్గాల పునర్విభజన బిల్లును కూడా ప్రవేశపెడుతున్నారు. ఇందులో ఒక మెలిక ఉంది. ప్రతీ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న స్థానాలకు 50 శాతం అదనంగా పెంచుతారు. ఆ అదనంగా వచ్చే స్థానాలే మహిళలకు కేటాయించే మూడవ వంతు స్థానాలతో సమానం అవుతుంది. అంటే పెరిగే లోక్‌సభ స్థానాల సంఖ్య ప్రస్తుత 543 ఉంటే, అందులో సగం 272ను అదనంగా పెంచితే, పెరిగే స్థానాల సంఖ్య 815 అవుతుంది. వాటిలో మూడవ వంతు మహిళలకు అంటే 272 స్థానాలే అవుతాయి. ఈ మెలిక కొత్త సమస్యలు తీసుకురానుంది. ఇప్పటికే సిడబ్ల్యుసి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఈ రూపంలో బిల్లు తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందనే హెచ్చరిక వ్యక్తం చేశారు. సిపిఐ, సిపిఐ(ఎం) వంటి వామపక్షాలు సైతం బిల్లుపై ముందస్తు విస్తృత చర్చ అవసరమని పేర్కొన్నాయి.

మహిళా చట్టసవరణ, డీలిమిటేషన్ బిల్లు ద్వారా మూడు అంశాలు తెరపైకి వస్తున్నాయి. ఒకటి మహిళల కోటాలో ఒబిసిలకు రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్ (ఎస్‌సి, ఎస్‌టిలకు సబ్ కోటా ఉంటుంది). అలాగే డీలిమిటేషన్‌తో పాటు లోక్‌సభ స్థానాలను పెంచుతున్నందున చట్టసభల్లో ఓబిసి రిజర్వేషన్‌లు కల్పించాలనేది డిమాండ్ మరోసారి బలంగా ముందుకు వస్తోంది. దీనికి అదనంగా కొత్తగా 50 శాతం సీట్ల పెంపుతో 'ఉత్తరాది – దక్షిణాది' అనే కొత్త లంపటం రానుంది. ఈ తిరకాసు పెట్టి ప్రతిపక్షాలను అందులో నిమగ్నం చేసి, మహిళా రిజర్వేషన్‌లకు వారు వ్యతిరేకులని ప్రచారం చేయడం ద్వారా మహిళా ఓటర్లను తమ ఓటు బ్యాంకుగా మార్చుకోవాలనే ఎత్తుగడ బిజెపిది.

సామాజిక న్యాయం నినాదాన్ని గత ఎన్నికల్లో ఎత్తుకున్న కాంగ్రెస్ 'జిత్నే హిస్సేదారీ ఉత్నా బాగీదారి' (జనాభా ప్రకారం వాటా) అనే వాదాన్ని బలంగా జనాల్లోకి తీసుకెళ్ళింది. తద్వారా ఒబిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్ అంశానికి మద్దతునిస్తుంది. ఒబిసి రిజర్వేషన్‌లపై మొదటి నుంచి ఉత్తరాదికి చెందిన సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జెడి వంటి బిసి అస్థితత్వ పార్టీలు శక్తివంతంగా పోరాడుతున్నాయి. బిసి సబ్ కోటా కోసం పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న చరిత్ర కూడా ఉంది. న్యాయం కోసం తాను సోక్రటీస్ కోసం విషం తాగుతానే తప్ప బిసిల ప్రస్తావన లేని మహిళా బిల్లును అడ్డుకుంటామని గతంలో జెడి (యు) పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్న శరద్‌యాదవ్ తన గళాన్ని వినిపించడం విదితమే. ఎంఐఎం సైతం ఉపకోటాను డిమాండ్ చేస్తోంది. ఇక లోక్‌సభ స్థానాల పెంపులో 50 శాతం అదనంగా పెంచే ప్రతిపాదన దక్షిణాదికి అన్యాయం చేస్తుందనే వాదన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కూడా వినిపిస్తున్నాడు. కాబట్టి తాజా బిల్లులపై విస్తృత చర్చ లేకుండా హడావిడిగా మందబలంతో ఆమోదింపజేసుకుంటామని అధికార బిజెపి భావిస్తే అది ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చెప్పడం కష్టమే. ఇది రాజకీయ ప్రయోజనం కింద కాకుండా దేశ విశాల ప్రయోజనాలకు సంబంధించిన అంశంగా చూడాలి. ఒకవైపు జనగణన, దానితో పాటు కుల గణన జరుగుతుండగా, వాటితో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్, లోక్‌సభ స్థానాల పెంపు బిల్లులు తీసుకువావాలని చూడటం సబబు కాదు. వీటిపై పార్లమెంటు కంటే ముందు జనబాహుళ్యంలో నిర్ణీత కాలంలో విస్తృత చర్చ జరగాలి. ఆ తరువాతే పరిపుష్ఠమైన బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టాలి. అదే దేశానికి, సమాఖ్య స్ఫూర్తికి, సామాజిక, లింగ న్యాయాలకు శ్రేయస్కరం. ●

# షెడ్యూల్ కులాల వారు మత మార్పిడి చేస్తే ఆ హోదా కోల్పోతారు



ఎస్.బాబు
అధ్యక్షుడు
టిజిఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాకు చెందిన చింతాడ ఆనంద్ జన్మతహా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు. ఆయన హిందూ మతంలో ఉండి షెడ్యూల్ కులాలకు సంబంధించిన రిజర్వేషన్లు, సౌకర్యాలు పొందుతున్నారు. ఆ తరువాత కాలంలో ఆయన హిందూ మతం నుండి క్రిస్టియన్ మతంలోకి మారారు. గత 10 సంవత్సరాలుగా చర్చిలో పాస్టర్‌గా, ఆదివారం ప్రార్థనలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంలో తనను కులం పేరుతో నిందిస్తూ భయభ్రాంతులను చేస్తున్నారని దోమా కోటిరెడ్డి మరియు తన అనుచరులు ఇలాంటి ప్రార్థనలు చేయవద్దని తనను భౌతికంగా హిసించారని,వారిపై ఎస్‌సి, ఎస్‌టి ఎట్రాసిటీ యాక్ట్ ప్రకారం వారిని శిక్షించాలని కేసు ఫైల్ చేశారు. నిందితులు ఈ విషయంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేసు వేస్తూ తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. హైకోర్టు ఆ కేసులోని పూర్వాపరాలన్నీ లోతుగా పరిశీలించి చింతాడ ఆనంద్ అనే వ్యక్తి హిందూ మతంలో నుండి క్రిస్టియన్ మతంలోకి మారడం వాస్తవమని, గత 10 సంవత్సరాలుగా అతను చర్చిలో పాస్టర్‌గా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడని కోర్టు తేల్చింది. ఈ విధంగా మతం మార్చుకున్న వ్యక్తికి ఎస్‌సి, ఎస్‌టి ట్రాసిటీ యాక్ట్ వర్తించదని తీర్పు ఇవ్వడం జరిగింది. ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లు 1950 సంవత్సరం నుండి హిందువులకు అమలయినాయి. 1956లో సిక్కు మతస్తులకు, 1990లో బౌద్ధ మతస్తులకు ఈ రిజర్వేషన్లు అమలయినాయి. ఆ లెక్కన ఈ మతాల వారికి మాత్రమే షెడ్యూల్ క్యాస్ట్ హోదా ఉంది. క్రైస్తవం, ఇస్లాం మతస్తులకు షెడ్యూల్ క్యాస్ట్ రిజర్వేషన్ కాని, హోదా కాని లేదు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో తనకు అన్యాయం జరిగిందని, న్యాయం కోసం చింతాడ ఆనంద్ అనే వ్యక్తి సుప్రీం కోర్టులో కేసు వేశాడు. ఈ కేసు సుప్రీం కోర్టు పి.కె.మిశ్రా, ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కేసు విచారిస్తున్న సమయంలో వారు ఎస్‌సి,ఎస్‌టి ఎట్రాసిటీ యాక్ట్ గురించి చెప్తూనే, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341, 342, 366 లోని క్లాజ్ 24, 25 లను ఉటంకించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341లో (క్లాజ్1)లో షెడ్యూల్ కులాల గురించి ఈ వివరణ ఉంది. "ఒక రాష్ట్రం లేక కేంద్ర పాలిత ప్రాంతంలో గల ఎటువంటి కులాలు, తెగలు, జాతులు, ఆయా కులాలు, జాతులు, తెగలలో గల గ్రూపులు ఈ రాజ్యాంగం పరిధిలో ఆ రాష్ట్రానికి సంబంధించి షెడ్యూల్ కులాలుగా పరిగణించబడతాయో రాష్ట్రపతి నిర్ధారించి అధికారికంగా నోటిఫై చేస్తారు" (అయితే రాష్ట్రాల పరిధిలోని తెగలు, కులాలు, జాతుల విషయంలో ముందుగా ఆ రాష్ట్ర గవర్నర్‌ను సంప్రదించాలి). క్లాజ్2 (1) క్రింద జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఉదహరించిన షెడ్యూల్ కులాల జాబితాలో అదనంగా ఏవైనా కులాలను, తెగలను లేక జాతులను పార్లమెంట్ శాసనం ద్వారా చేర్చవచ్చు. అదే విధంగా ఆ నోటిఫికేషన్‌లో ఉదహరించిన జాబితా నుండి ఏవైనా కులాలను, తెగలను లేక జాతులను తొలగించవచ్చు. అంతే తప్ప ఒకసారి క్లాజ్1 కింద నోటిఫికేషన్ జారీ అయిన తరువాత ఆ నోటిఫికేషన్‌కు భిన్నంగా మరొక నోటిఫికేషన్ జారీ చేయరాదు. ఇదే విషయాన్ని ఆర్టికల్ 342 క్లాజ్1 (2) లలో షెడ్యూల్ ట్రైబ్స్‌కు కూడా చెప్పబడింది. ఆర్టికల్ 366 లో క్లాజ్ 24లో షెడ్యూల్ కులాలు రాజ్యాంగంలోని 341వ ఆర్టికల్ కింద షెడ్యూల్ కులాలుగా గుర్తించబడిన కులాలు లేదా జాతులు లేక తెగలు లేక ఆయా కులాలు, జాతులు, తెగలలోని విభాగం లేక గ్రూపులు. క్లాజ్ 25 షెడ్యూల్ తెగలకు రాజ్యాంగంలోని 342వ ఆర్టికల్ కింద షెడ్యూల్ తెగలుగా గుర్తించిన తెగలు, ట్రైబల్ కమ్యూనిటీలు లేక ఆయా తెగలు, కమ్యూనిటీలలోని విభాగం లేక గ్రూపులు.



సుప్రీంకోర్టు 24–03–2026న షెడ్యూల్ కులాల రిజర్వేషన్లు, మతమార్పిడికి సంబంధించి ఒక చారిత్రాత్మకమైన తీర్పును వెలువరించింది. హిందూ, సిక్కు, బౌద్ధమతాల వారు ఆమతాల నుండి ఇతర మతాలలోకి మారితే వెంటనే షెడ్యూల్ క్యాస్ట్ హోదాను కోల్పోతారు అని పి.కె. మిశ్రా, ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం క్రిమినల్ అప్పీల్ నెం.1580 ఆఫ్ 2026లో తీర్పును వెలువరించింది.

క్రైస్తవ మతాన్ని స్వీకరించిన అనేకమంది తమ మత మార్పిడి గురించి ప్రభుత్వాలకు తెలియపరచకుండా దళిత కోటా కింద ప్రమోషన్లు, రిక్రూట్మెం ట్ సౌకర్యాలు పొందుతున్నారు. వారి పిల్లల ఉద్యోగాలు, ప్రమోషన్ల మీద కూడా ఎస్‌సి రిజర్వేషన్లు పొందుతున్నారు. క్రిస్టియానిటీలోకి మారి కూడా హిందూ మత ప్రకారం వస్తున్నటువంటి ఎస్‌సి రిజర్వేషన్లు పొందటం అనైతికం. సుప్రీంకోర్టు ఈ జడ్జిమెంట్ ఇచ్చిన తరువాత ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఉన్న దళిత సామాజిక వర్గానికి చెందిన హిందువులు, క్రైస్తవులుగా మారిన వారి పరిస్థితి కుడితిలో పడ్డ ఎలకలాగా మారింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341, 342 మరియు 366 లోని క్లాజ్24, 25 ప్రకారం హిందువులు, సిక్కులు, బౌద్ధులకు ఎస్‌సి హోదాపై ఉన్న పరిమితి సంపూర్ణమైంది. క్రైస్తవం లేదా ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తులు తమ షెడ్యూల్ క్యాస్ట్ హోదాను సహజంగానే కోల్పోతారు. దీనివల్ల వారు విద్యాసంస్థల్లో మరియు ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లకు అనర్హులవుతారు. మతం మారిన వ్యక్తులు షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అత్యాచార నివారణ చట్టం కింద రక్షణ పొందలేరు. మతం మారిన వ్యక్తికి పాత ఎస్సీ సర్టిఫికెట్ ఉన్నంత మాత్రాన ప్రయోజనాలకు అర్హత లభించదని సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది. మతం మార్చుకున్న వ్యక్తి లేక వ్యక్తులు తిరిగి తమ పూర్వపు మతాలలోకి మారితే ఆ సమాజం వారిని గుర్తించినపుడు మాత్రమే వారికి షెడ్యూల్ క్యాస్ట్ హో దాను పునరుద్ధరించవచ్చని సుప్రీం కోర్టు పేర్కొన్నది. షెడ్యూల్ క్యాస్ట్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి క్రిస్టియన్ మతంలోకి మారడం చూశాం. ఇలాంటివారు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ సౌకర్యం పొందలేరు. అలాగే బిసి కులాల వారు, ఎస్‌టి కులాల వారు కూడా ఇతర మతాలలోకి మారినవారు అనేకమంది ఉన్నారు.

చాలామంది క్రిస్టియన్ మతస్థులుగా మారినట్లు బహిరంగ పరచుకోవడం లేదు. ఎందుకంటే వారి పిల్లలకు రిజర్వేషన్ సౌకర్యాలు పోతాయని. హిందూ మతం నుండి క్రిస్టియానిటీకి మారినవారు చాలామంది పాస్టర్లు, ఆ పైన బిషప్పులు అయిన వారు కూడా ఉన్నారు. అటువంటి వారు నిజాయితీగా తమ రిజర్వేషన్ సౌకర్యం వదులుకోవాలి. అప్పుడే అట్టడుగున ఉన్నటువంటి ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు న్యాయం జరుగుతుంది. క్రిస్టియన్ మతంలో కులాల కుమ్ములాటలు లేవు. అందులో ఉన్నది రెండే వర్గాలు. 1. రోమ న్ క్యాథలిక్స్ అయితే, మరొకటి ప్రొటెస్టెంట్లు. కాని మన దేశం లో క్రిస్టియన్ మతంలో కులాలు ఉండటం విశే షం. హిందూ మతం నుండి క్రిస్టియన్ మతంలోకి మారిన బ్రాహ్మణ, కమ్మ, రెడ్డి, కాపుతో పాటు ఇతర సామాజిక వర్గాలవారు క్రిస్టియన్‌లుగా మారినా అవే కులాలతో కొనసాగుతున్నా రు. అంటే భారతదేశంలో ఉన్న క్రిస్టియానిటీలో కు లాలు ఉన్నాయనే అర్థం వస్తోంది. అట్టడుగున ఉన్న అణగారిన నిమ్న కులాలు అభివృద్ధి చెందాలంటే వారికి రిజర్వేషన్ల అవసరం తప్పనిసరి అని బిఆర్ అంబేద్కర్ భావించారు. ఈ రిజర్వేషన్లు ఎల్లకాలం ఉండకూడదని కూడా ఆయన చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలలో కొన్ని సామాజిక వర్గాల వారు రిజర్వేషన్ సౌకర్యం పొంది సామాజిక, ఆర్థికాభివృద్ధి చెందారు. వీరు ఇంకా రిజర్వేషన్ ఆశించటం న్యాయం కాదు. అదే సామాజిక వర్గంలో రిజర్వేషన్ ఫలాలు అందని ఎంతో మంది ఉన్నారు. వీరు స్వచ్ఛందంగా రిజర్వేషన్ సౌకర్యం వదులుకోవటం వల్ల ఆ సామాజిక వర్గంలోని ఇతర కులాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని అంబేద్కర్ అభిప్రాయం. నేను కూడా ఆ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను. అసలు మత మార్పిడులు ఎందుకు జరుగుతున్నాయని ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, మేధావులు, మతాధికారులు, పీఠాధిపతులు ఎందుకు దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు? 7వ శతాబ్దంలో ఈ దేశంలోకి ఇస్లాం మతస్థులు ప్రవేశించిన తరువాత బ్రాహ్మణులతో పాటు అనేక కులాల వారు ఇస్లాంలోకి మారారు. 16వ శతాబ్దంలో బ్రిటిష్ వారు ఈస్ట్ ఇండియా కంపెనీ పేరుతో భారత దేశంలోకి ప్రవేశించిన తరువాత హిందూమతంలో ఉన్నటువంటి అణగారిన వర్గాలు, నిమ్న కులస్తులు, సామాజిక అసమానతలు ఎదుర్కొంటున్నవారు, బడులు, గుడులలోకి ప్రవేశం లభించని వారు క్రిస్టియన్ మతంలోకి మారారు. హిందూ మతం అస్పృశ్యులుగా చూసినవారిని, అనేక రుగ్మతల బారిన పడిన వారిని, చదువు సంస్కారాలు లేనివారిని బ్రిటిష్ వారు వారి మిషనరీ స్కూల్స్‌లో చదువు చెప్పడం, దైవారాధన కోసం వారి చర్చిలలోకి అనుమతించడం, వారి హాస్పిటల్స్‌లో వారి రుగ్మతలకు వైద్య సౌకర్యం కల్పించటం వల్ల వారు మత మార్పిడి చేసుకున్నారని అభిప్రాయం. భగవద్గీతలోని గీతాచార్యుడు చెప్పిన చాతుర్వర్ణ వ్యవస్థలో కులం అనేది వారి గుణ, కర్మల బట్టి ఉంటుందన్నారు. ఇదే విషయంపై బుద్ధుడు కూడా కుల మతాలను కూడా వ్యతిరేకించారు. మాండవ్య మహర్షి, రుష్యశృంగుడు, మాతంగ మహర్షి, వాల్మీకి మహర్షి వీరెవరూ కూడా బ్రాహ్మణులు కారు. అ యినా వారి గుణాలను బట్టి, కర్మలను బట్టి, వారి మేధో సంపత్తిని బట్టి వారు బ్రాహ్మణులుగానే చలామణీ అయ్యారు. అలాగే పుట్టుకతో కాకుండా గుణకర్మలను బట్టి కులవిభజన జరిగి ఉంటే సామాజిక పరిస్థితులు వేరుగా ఉండేవి. భారతదేశ ప్రసిద్ధ గాయకులలో ఒకరైన కె.జె.ఏసుదాసును కేరళ లోని గురువాయూరు ఆలయంలోకి ప్రవేశింపనీయలేదు. కారణం ఆయన క్రిస్టియన్ కావడమే. మహాకవి గుర్రం జాషువాను కూడా ఈ సమాజం అస్పృశ్యునిగానే చూసింది. అంబేద్కర్ కూడా అదే సామాజిక పరిస్థితులను ఎదుర్కొన్నారు. గుణకర్మలను బట్టి వర్ణ వ్యవస్థ ఉంటే వీరు కూడా ఉన్నత వర్గాలే అని నా అభిప్రాయం. నా అభిప్రాయంతో కొందరు ఏకీభవించవచ్చు, ఏకీభవించని వారు కూడా ఉండవచ్చు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులో రిజర్వేషన్ల గురించి చర్చించిందే కాని సాంఘిక అసమానతలు కాని, అ స్పృశ్యత జోలికి కాని వెళ్ళకపోవడం విచారకరం. ఈ అస్పృశ్యత, వివక్ష, సాంఘిక అసమానతలు భ రించలేకనే డా.బి.ఆర్.అంబేద్కర్ హిందూ మతాన్ని వదిలి కొన్ని లక్షల మందితో బౌద్ధమతాన్ని స్వీకరించాల్సి వచ్చిందంటే ఈ దేశంలో సామాన్యుల, నిమ్నజాతుల పరిస్థితి ఏమిటో అర్థం అవుతుంది. ఇక్కడ మనం ఒకసారి డా.బి.ఆర్.అంబేద్కర్ అన్న వాక్యా న్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. "ఒకవేళ హిందువులు ప్రపంచంలోని ఇతర ప్రాంతాల లోకి వలస వెళితే భారత దేశంలోని కుల వ్యవస్థ ప్రపంచానికి ఒక పెద్ద సమస్య అవుతుంది". అంటే ప్రపంచ దేశాల్లో కూడా కులాల కుంపట్లు దినదిన ప్రవర్ధమానమవుతాయని ఆయన అప్పుడే హెచ్చరించారు.

# శ్రమదోపిడికి నిరసనగా కదంతొక్కిన 'ఆర్టిజన్‌లు'

సమాజానికి వెలుగులు పంచేందుకు ప్రాణాలను సైతం పణంగా పెట్టి, విధి నిర్వహణే ఆరాధ్య దైవంగా భావిస్తూ, రాత్రింబవళ్ళు నిరంతరం శ్రమించే కరెంటోళ్లు తమ సమస్యల పరిష్కారానికై కదంతొక్కారు. శ్రమ దోపిడి నుండి విముక్తి కల్పిస్తూ, సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా ప్రభుత్వాన్ని నిలదీసేందుకు పోరుబాట పట్టారు. తెలంగాణలోని విద్యుత్ సంస్థలైన జెన్‌కో,ట్రాన్స్‌కో, ఎస్పిడిసిఎల్, ఎన్‌పిడిసిఎల్ సంస్థల్లో పనిచేస్తున్న ఆ ర్టిజన్ కార్మికులు తమ హక్కుల సాధన సమ్మె తప్ప ఇతర మార్గం లేదంటూ 9సంఘాలు ఏకతాటిపైకి వచ్చి, జెఎసిగా ఏర్పడి ఉమ్మడి పోరుకు దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం సుమారుగా 19061ఆర్టిజన్లుగా సేవలను అందిస్తుండగా, అందులో ట్రాన్స్ కోలో సుమారుగా 3769, జెన్ కోలో 3583, ఎస్‌పిడిసిఎల్‌లో 8244, ఎన్పిడిసిఎల్‌లో 3465 మంది ఉన్నారు.

### అరకొర వేతనం,అందని సహకారం

విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులందరికీ ఒకే




రకమైన సర్వీస్ నిబంధనలు వ ర్తింపజేస్తూ ఆర్టిజన్, అన్ మ్యాన్డ్‌స్పాట్ బిల్ల ర్ల సమస్యలు పరిష్కరించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆర్టిజన్ల కన్వర్షన్లపై ఆయా విద్యుత్ కార్మిక సంఘాలు గత 8ఏళ్లుగా నిరంతరంగా అలుపెరుగని పోరాటాలు చేస్తున్న ప్రభుత్వాలు వారి అభ్యర్థనను తోసిపుచ్చుతూనే ఉన్నాయి. అలాగే అన్ మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి, ఎపిఎస్ఇబి నిబంధనలు వర్తింపజేస్తూ, గృహ జ్యోతి పథకం ద్వారా బిల్లింగ్ కార్మికులను ఆ దుకోవాలి. పీస్ రేట్ కార్మికులకు జిఒ నెం. 11ప్రకారం కనీస వేతనాలు అమలు చేస్తూ 30 రోజుల పని కల్పించాలి. ఆర్టిజన్లను విద్యార్హత ఆధారంగా ఉద్యోగ భద్రత కల్పి స్తూ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులందరికీ పనికి తగిన వేతనం అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



### ఇచ్చిన హామీని అమలు చేయాలి

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్,అన్ మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్,బిల్ కలెక్టర్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. ప్రస్తుత విద్యుత్ శాఖ మంత్రి, నాటి సిఎల్‌పినేత మల్లు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుండి ప్రారంభించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేస్తామని,అన్ మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి, వివిధ రకాల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామిని అమలు చేస్తూ,వేలాది విద్యుత్ కార్మిక కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపాలి.

ఈదునూరి మహేష్
సెల్: 9949134467

## గోపాలరావు మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

జమ్ముల జితేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/కారేపల్లి: మాదారం గ్రామానికి చెందిన సిపిఐ నాయకుడు పాపినేని గోపాలరావు మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని, ఒక యువ కమ్యూనిస్టును కోల్పోవడం అత్యంత బాధాకరమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గోపాలరావు శనివారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన భౌతిక కాయాన్ని సందర్శించిన జమ్ముల జితేందర్‌రెడ్డి పార్టీ అరుణ పతాకాన్ని కప్పి, పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ తరపున పూర్తి స్థాయిలో అండగా ఉంటామని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. మూడు తరాలుగా ఎర్రజెండాను వదలకుండా పార్టీకి సేవలు అందించడం యావత్ పార్టీ శ్రేణులకు ఆదర్శమని అన్నారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన పార్టీ శతవసంతాల ముగింపు సభకు పార్టీ శ్రేణులను సమీకరించడంలో గోపాలరావు చేసిన కృషి మరువలేనిదని ఆయన గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ వైరా నియోజకవర్గ బాధ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్రబాబు, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, కారేపల్లి మండల నిర్మాణ బాధ్యులు రావి శివరామకృష్ణ, మండల కార్యదర్శి పాపినేని సత్యనారాయణ, సహాయ కార్యదర్శి చెన్నంశెట్టి భూషయ్య, మాదారం గ్రామ శాఖ నాయకులు బట్టు సంగయ్య, పోతన, రవి లక్ష్మీ నారాయణ, అమీర్ జానీ, రాయల రామారావు, గోవింద్, అజ్మీర్ బాలాజీ, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మేయర్ పునుకొల్లు నీరజ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రాబోయే కార్పోరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా నూతనంగా ఏర్పడిన ఖమ్మం నగర కమిటీ పనిచేయాలని మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని ఐదవ డివిజన్‌లో ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని మాట్లాడుతూ పూర్తి స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం నగర కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డివిజన్లలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు త్వరలో జరగనున్న కార్పోరేషన్ ఎన్నికల్లో కూడా అన్ని డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. నగర కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ టిపిసిసి ఆదేశాను సారం ఖమ్మం నగర కమిటీని 43 మందితో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఐదవ డివిజన్ నుంచి ఖమ్మం నగర అధికార ప్రతినిధిగా నియామకమైన ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ నగర అధికార ప్రతినిధిగా తనకు అవకాశం కల్పించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం నగరంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా నూతన కమిటీ పని చేస్తుందని ఆయన తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లెబోయిన భారతి చంద్రం, నగర ప్రధాన కార్యదర్శి బడేసాహెబ్, కార్యదర్శులు కోనేటి నారాయణరావు, ఉపేందర్, నాగేశ్వరరావు, బందు వెంకటేశ్వర్లు, వీరయ్య గౌడ్, సరిత, కొత్తా శ్రీనివాసరావు, నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వెనకబడిన వర్గాలకు ప్రభుత్వం కృషి

పూలే జయంతి కార్యక్రమంలో మంత్రి పొంగులేటి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం శ్రీశ్రీ సర్కిల్ వద్ద వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహత్మ జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పాల్గొని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మహనీయుడు జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నేడు ఆయన్ను స్మరించుకోవడం గొప్ప గౌరవమన్నారు. సమానత్వ సమాజ నిర్మాణంలో పూలే కీలక పాత్ర పోషించారన్నారు. ఆ కాలంలో కుల, మత బేధాలు ఉన్న పరిస్థితుల్లో సామాజిక సంస్కరణలకు పూలే శ్రీకారం చుట్టారన్నారు. మొదటగా తన భార్య సావిత్రిబాయి పూలేకు విద్యాబోధన చేసి ఆమె ద్వారా బాలికల విద్యకు మార్గం సుగమం చేసిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. కుల వివక్ష కారణంగా అనేక వర్గాల ప్రజలను దేవాలయాలు, పాఠశాలల్లోకి అనుమతించని పరిస్థితులను పూలే ధైర్యంగా ఎదిరించి సమాజంలో మార్పు తీసుకు వచ్చారని తెలిపారు.మహిళ విద్య కోసం పూలే చేసిన కృషి అపారమన్నారు. పూలే చూపిన మార్గంలో మనం పయనించాలన్నారు. జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి. జ్యోతి, డిసిహెచ్‌ఎస్ డా॥ రాజశేఖర్, జిల్లా అధికారులు, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, అధికారులు, సాంస్కృతిక సారధి కళాకారులు పాల్గొన్నారు.

## వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స సేవలు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : మత్తు పదార్థాల వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స సేవలు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అడిక్షన్ కౌన్సిలింగ్ సెంటర్, అడిక్షన్ ట్రీట్మెట్ ఫెసిలిటీ కేంద్రాలను ఆయన శనవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. వ్యవస బాధితులకు ప్రత్యేక వైద్య చికిత్స, పునరావాస సేవల, నితరంతర కౌన్సిలింగ్ అందిస్తారని తెలిపారు.ఈ సందర్భంగా చికిత్స కోసం వచ్చిన రోగులతో ఆయన మాట్లాడారు. బాధితులు పూర్తిగా కోలుకునేలా సమగ్ర వైద్య సేవలు అందించాలని సూచించారు. వ్యవస నిర్మూలనలో అన్ని శాఖలు స్వచ్ఛందంగా పనిచేయాలని, కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలని తెలిపారు.

# రాజకీయాలకు తావులేదు...

మున్సిపాలిటీకి రూ.58.95కోట్లు

రూరల్‌కు రూ.64.92కోట్ల నిధులు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఎన్నికల వరకే రాజకీయాలని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం అభివృద్ధి, సంక్షేమమే పమావధిగా పని చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ఖమ్మంరూరల్ మండలంలో ముమ్మరంగా పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని 30వ వార్డులో రూ.4 కోట్ల50లక్షలతో ఆటోనగర్ టూ మద్దులపల్లి మార్కెట్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 227మంది లబ్దిదారులకు మంజూరైన రూ.70.42లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. అలాగే మంగళగూడెంలో రూ.2.50కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మున్సిపాలిటీలోని 32 వార్డులలో సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.58.95కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఖమ్మంరూరల్ మండల అభివృద్ధికి రూ. 64.92కోట్లు నిధులు వెచ్చించినట్లు వెల్లడించారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో పేదల ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రజాపాలన మొదటి ఏడాదిలోనే ప్రతి నియోజకవర్గానికి రూ.3వేల 500వందల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, త్వరలోనే రెండో విడత ప్రక్రియ ప్రారంభిస్తామని ప్రకటించారు. రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశామని, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదోడికి అండగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, కౌన్సిలర్లు దండి రంగారావు, దండి శ్రీజా, తమ్మినేని మంగతాయి, వెంకట్‌రెడ్డి, వెంపటి ఉమా, దివ్య, ప్రసాద్, బుర్ర మహేష్, కడవ నవీన్, భాస్కర్, మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు, ఖమ్మంరూరల్ మండల కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, కొప్పుల చంద్రశేఖర్, అప్పారావు, పల్లెర్ల పాండయ్య, చింతమళ్ల రవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ భవనాలు.. బేస్మెంట్ స్థాయికి చేరుకోవాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ప్రజాపక్షం/వైరా: ఏప్రిల్ చివరి నాటికి సీనియర్ హాస్టల్ భవనాలు బేస్మెంట్ స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురివెట్టి తెలిపారు.శనివారం వైరాలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటగ్రేటెడ్ గురుకుల భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వైరా సాంఘిక సంక్షేమ గురుకులంలో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. పనులు మంచి వేగంతో కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రణాలిక ప్రకారం 4జూనియర్, 9 సీనియర్ హాస్టల్ బ్లాకులు నిర్మిస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుతం జూనియర్ హాస్టల్ బ్లాకుల రాప్ట్ ఫౌండేషన్ పనులు జరుగుతున్నాయని, సీనియర్ హాస్టల్ బ్లాకు ఫౌండేషన్ పనులు ప్రారంభించి, పాత భవనాలను తొలగించి, ఏప్రిల్ నెలాఖరు నాటికి బేస్మెంట్ స్థాయికి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

## సామాజిక సమానత్వానికి మార్గదర్శి పూలే



ప్రజాపక్షం/భద్రాచలం : సామాజిక సమానత్వానికి మార్గదర్శి జ్యోతిరావు పూలే అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. పూలే జయంతి సందర్భంగా ఐడిఓసిలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సమానత్వం, విద్యా వ్యాప్తి, మహిళా విద్య కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం అక్రమ రవాణాపై చర్యలు

450 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు




ప్రజాపక్షం/ కొత్తగూడెం : రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామ ని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సమన్వయదాడుల్లో మొత్తం 450 క్వింటాళ్ల రేషన్ బి య్యాన్ని స్వాదీనం చేసుకున్నట్లు ఆయన తెలిపా రు. శనివారం తెల్లవారు ఝామున సివిల్ సప్లై అధికారులు, పోలీసులు కలిసి నిర్వహించిన దాడుల్లో ఇల్లెందు మండలం రేపల్లెవాడలోని కోటమైసమ్మ గుడి సమీపంలో అక్రమంగా వాహనంలోనికి ఎక్కిస్తున్న 200 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకుని స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒక లారీతో పాటు బొలేరో వాహనాన్ని స్వాదీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. మండలంలో 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించే ప్రయత్నంలో ఉన్న లారీని అడ్డుకుని స్వాదీనంచేసుకున్నారు. ఆ బియ్యం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నిందితులపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని దారి మళ్లించడం చాలా తప్పని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి అక్రమ కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంర తనిఖీలు, దాడులు కొనసాగుతాయని చెప్పారు. ఈ దాడుల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, సివిల్ సప్లై అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

# నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

-భారీ ఎత్తున పోలీసు బలగాల మోహరింపు

-కొత్తగూడెం, పాల్వంచ పోలీసులచే అక్రమ అరెస్టులు




ప్రజాపక్షం/పాల్వంచ : దమ్మపేట సెంటర్, అంబేద్కర్ సెంటర్, సి కాలనీ గేటు, బొల్లోరు గూడెం, కేటిపిఎస్ అంబేద్కర్ సెంటర్ తదితర ప్రాంతాలలో పోలీసులు తమ బలగాలను పెద్ద ఎత్తున మోహరించారు. పాల్వంచ పట్టణాన్ని తమ అదుపులోకి తీసుకొన్నారు. అనుమానం వచ్చిన వారిని స్టేషన్‌కు తరలించారు. సమ్మెకు దిగిన ఆర్టిజన్ కార్మికులకు నైతిక బలాన్ని ఇచ్చి తమ సంఘీభావం తెలిపేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి పాల్వంచకు చేరుకొన్న కార్మికులను ఎక్కడికక్కడెనే అడ్డుకొన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసి బలవంతంగా పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. విద్యుత్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 4వ, తేదీన కేటిపిఎస్ అంబేద్కర్ సెంటర్‌లో ఆందోళన అనంతరం ఏడవ తేదీన వరంగల్ పట్టణంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం పట్టించుకోక పోవటంతో 8వ, తేదీ నుండి కేటిపిఎస్ అంబేద్కర్ సెంటర్ సమీపంలో శాంతియుత నిరవధిక సమ్మెకు దిగారు. కేటిపిఎస్‌లోని 2300 మంది ఆర్టిజన్‌లకు గాను సుమారు 1800 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. యాజమాన్యం విధుల్లో చేరాలని చరవాణిల ద్వారా ఆర్టిజన్‌లకు సమాచారం అందించారు. సమ్మెలో ఉన్నామని ప్రభుత్వం నుండి ఎలాంటి హామీ రాలేదని దీనితో విధుల్లోకి చేరేది లేదని సమ్మె కొనసాగించారు.అనంతరం విధుల్లోంచి తొలగిస్తున్నట్లు యాజమాన్యం నోటీసులను జారీ చేసింది. హఠాత్పరిణామానికి ఖంగుతిన్న కార్మిక లోకం ఆగ్రహించినది. పట్టు విడవకుండా సమ్మెను కొనసాగిస్తున్నారు. సమ్మెకు తమ సంఘీభావాన్ని తెలిపేందుకు వస్తున్న వివిధ జిల్లాలకు చెందిన ఆర్టిజన్ కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. అక్రమంగా అరెస్ట్ చేశారు. సిద్దపేటకు చెందిన వారిని లక్ష్మీదేవిపల్లి, వరంగల్, సూర్యాపేట, హైదరాబాద్‌కు చెందిన కార్మికులను పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్భంధించారు.

## కీచక అధికారిపై చర్యలుండేనా...?

వేధింపులు ఆరోపణలతో కలకలం




ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : పాలేరునియోజకవర్గంలోని ఓ విభాగంలో పని చేస్తున్న ఓ అధికారి మహిళా ఉద్యోగినులపై వ్యవహరిస్తున్న వేధింపులుపై ప్రచురితమైన ప్రజాపక్షం కథనం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఆ కీచక అధికారి ఎవరు అనే విషయంపై పలువురు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అయితే జరిగిన ఆరాలో సదరు అధికారి ఎవరో ఇప్పటికే గుర్తించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ప్రజాపక్షం అక్షర రూపం అందించి ప్రచురించిన కథనం అక్షర సత్యమే అంటూ పలువురు ప్రతినిధితో మాట్లాడం విశేషం. కథనంపై నిఘా వర్గాలు సైతం ఎవరా? అధికారి అనే విషయంపై ఆరా తీసినట్లు తెలిసింది. సదరు అధికారి పని చేస్తున్న కార్యాలయం వద్ద రహస్యంగా వివరాలు సేకరించినట్లు సమాచారం. సదరు అధికారి వ్యవహార తీరుపై తోటి అధికారులు, సిబ్బంది నోట తీవ్ర చర్చ జరిగినట్లు తెలిసింది. వాస్తవానికి ఆ అధికారి అటువంటి వ్యవహారాలకు పాల్పడే స్వభావం కలిగిన వ్యక్తిగా కొందరు పేర్కొంటున్నారు. శ్రీరంగనీతులు అన్నట్లుగా ఆయన వ్యవహారశైలిపై వ్యాఖ్యానిస్తున్నట్లు సమాచారం. ప్రజాపక్షంలో ప్రచురితమైన కథనం ప్రకారం, సదరు అధికారి తన విధులు నిర్వహణలో కూడా పారదర్శకతకు తిలోదకాలిస్తున్నాడనే అంశాన్ని లేవనెత్తినట్లు తెలిసింది.

## శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలి

జిల్లా సైన్స్ మ్యూజియంను ప్రారంభించిన తుమ్మల

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఇటువంటి సైన్స్ మ్యూజియంలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సైన్స్ మ్యూజియం, సైన్స్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. విద్యార్థుల్లో, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడానికి సైన్స్ మ్యూజియం ఒక వేదికగా నిలవాలన్నారు. ఈ మ్యూజియం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం పెంపొందించాలని మంత్రి సూచించారు.

# ప్రజలపక్షాన నిలిచేదే కమ్యూనిస్టు పార్టీ

జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషా



ప్రజాపక్షం/పాల్వంచ : ప్రజల పక్షాన నిలిచే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, సిపిఐ నిర్వహిస్తున్న పోరాటాలకు ఆకర్షితులై ప్రజలు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. పాల్వంచ పట్టణ పరిధి 6వ, డివిజన్ ఇందిరా కాలనీలో వి. రామక్రిష్ణ (టెంట్ హౌజ్ ) సయ్యద్ యాకూబ్ (అమీర్) నేతృత్వంలో 80 కుటుంబాలకు చెందిన వారు సిపిఐ, ప్రజా సంఘాలలో శనివారం చేరారు. వారికి ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాటాలు ఉద్యాల ఫలితంగానే సిపిఐ జనాదరణ పొందుతుందని అన్నారు. ప్రజల పక్షాన నిభద్ధతతో పోరాడే సిపిఐని మరింత బలోపేతం చేసుకోవాలని అన్నారు. పాల్వంచ బస్తీల అభివృద్ధి సిపిఐతోనే సాధ్యమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వాలపై పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరుతున్న వారు పార్టీ, ప్రజా సంఘాలలో బాధ్యతలను తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అవసరమైతే పోరాటాలు నిర్వహించాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కార్పోరేషన్ మె యర్ మూడ్ గణేష సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పోరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, జిల్లా సమితి సభ్యులు ఎండి. నజీర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకరావు, నాయకులు క్రిష్ణ, వెంకన్న, రాములు, అల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధంతో జీవన ప్రమాణాలు ఛిన్నాభిన్నం

ప్రపంచాన్ని గుప్పెటకు ట్రంప్ ఎత్తుగడలు

ప్రధాని మోడీ తీరు సరైంది కాదు

ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. ప్రభాకర్ రావు




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పశ్చిమాసియా దేశాల యుద్ధ వాతావరణం కారణంగా మానవ జీవన ప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయని ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే ప్రభాకర్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పాల్వంచలోని సాయితేజ ఫంక్షన్ హాల్లో ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో ఆపరేషన్ ఫ్రెడ్షిప్ (ఇస్కఫ్) (భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం) జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్యాతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యుద్ధాలు అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అస్థిరత వల్ల సాధారణ ప్రజల జీవన స్థితిగతులపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. దీని కారణంగా అశాంతి వాతావరణ పరిస్థితులు అలుముకుంటున్నాయని, ఇంధన ధరలు పెరిగాయని,నిత్యవసరాల కొరత, ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పడుతున్నాయని చెప్పారు. పశ్చిమాసియా ఘర్షణలతో ప్రపంచ వాణిజ్య మార్గాలు, ప్రధానంగా ఇంధన సరఫరా మార్గాలు దెబ్బతిన్నాయని, దీని ప్రభావం భారత దేశంపై స్పష్టంగా పడుతోందన్నారు. ప్రపంచాన్ని గుప్పెట్లో పెట్టుకునేందుకు అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ఎత్తుగడలు వేస్తున్నారని, అమెరికా స్వార్థ పూరిత వైఖరి ప్రపంచ శాంతికి ముప్పుగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెనుజుల అధ్యక్షులు, ఆయన సతీమణిని ట్రంప్ బందించడం ఎంతవరకు సరైందని అన్నారు. టెహ్రాన్‌లో ఇజ్రాయేల్, అమెరికా సంయుక్తగా వైమానిక దాడిచేసి ఖామేనిని హతమార్చారని, అనేక మంది చిన్నారులు కూడా బలై పోయారని చెప్పారు. దేశ ప్రధాని మోడి యుద్ధంపై నోరు మెదపక పోవడం సరైంది కాదని, ఆయన తీరు ప్రజల్లో తీవ్ర ఆందోళనను కలిగిస్తోందన్నారు. దేశప్రధానిగా మోడి శాంతి ధౌత్యానికి ప్రధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం సరైన ప్రకటనలు చేసి శాంతి చర్చలకు కృషి చేస్తూ దేశ ప్రజలకు కూడా భరోసా కల్పించాలని తెలిపారు. కానీ భారత తొలి ప్రధాని నెహ్రూ ప్రపంచ శాంతికి పాటుపడ్డారని, అంతర్జాతీయ శాంతికి కృషి చేశారని చెప్పారు. యుద్ధం కారణంగా దేశంలో అలుముకుంటున్న పరిస్థితులు, దేశ ప్రయోజనాలు, ప్రజల జీవన ప్రమాణాలు పరిరక్షణ ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం అన్నారు. ప్రపంచ శాంతి, మానవతా విలువల పరిరక్షణ కోసం అన్ని దేశాలు యుద్ధ రాజకీయాలకు స్వస్తి చెప్పి సంభాషణల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని ఇస్కాఫ్ కోరుతుందని తెలిపారు. శాంతియుత వాతవరణ పరిరక్షణకు భిన్న సంస్కృతుల సమ్మేళమైన భారత దేశంలోని ప్రజలను శాంతియుత స్థితిగతుల వైపుకు నడిపించేందుకు ఇస్కాఫ్ పనిచేస్తుందని, దీనిని మరింత బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్లేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ శాంతిచర్చల ద్వారా ఏ సమస్య అయినా పరిష్కారమవుతుందని, దేశ ప్రధాని ఆయా దేశాల మధ్య శాంతి చర్చలు జరిగేలా కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. గుర్రం వెంకటేశ్వర్లు, గౌతమి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డా. సూర్యదేవర రామ్మోహన్ రావు, తాండ్ర రమణా రావు, కేఎల్ఆర్ అధినేత నాగమణి, కాలువ దేవదాసు, వేము కొండలరావుతో పాటు కార్పొరేటర్లు,వైద్యులు,లాయర్లు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును కలిసిన కాళేశ్వరం దేవస్థాన పాలకవర్గం



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** మండలంలోని కాళేశ్వరం గ్రామంలోని కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ చైర్మెన్ మోహన్ శర్మ ఆధ్వర్యంలో నూతన పాలక వర్గం హైదరాబాద్‌లో శనివారం రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాద పూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబును శాలువాతో సత్కరించి సన్మానించి తమను నియమించడం పట్ల ఆనంద వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని తగిన విధంగా దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు.ఈ సందర్భంగా పాలక వర్గానికి రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు శుభాకాంఓలు తెలిపి చ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మంచినీళ్ల దుర్గయ్య,కుంబం పద్మ,దొడ్ల అశోక్,సీతయ్య,గందెసిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



**ప్రజాపక్షం/కేసముద్రం:** కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్ సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్నల కొనుగోలు, కాంటాలు, బస్తాలను తరలించే విధానాలను పరిశీలించారు. మొక్కజొన్నల అమ్మకానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, వెంట వెంటనే తేమ శాతం పరిశీలించడం, కాంటాలు వేయడం, లారీలల్లో ఎగుమతులు అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడం, వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండడంతో ఎక్కువ సిబ్బందిని నియమించి మొక్కజొన్నల కొనుగోళ్లలో వేగం పెంచాలన్నారు. మార్కెట్‌కు వస్తున్న ధాన్యం దృష్ట్యా సిబ్బందిని ఎందుకు పెంచడం లేదని, అలాగే గన్నీ సంచులలో కూడా చాలా వరకు రంధ్రాలు పడి ఉన్నాయని, రైతులకు ఎలాంటి రంధ్రాలు లేని గన్నీ సంచులను అందజేయాలని కొనుగోలు కేంద్రం నిర్వహకులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ వెంట మార్కెట్ చైర్మన్ గంట సంజీవ రెడ్డి, డిఏఓ సరిత, ఎడిఏ శ్రీనివాసరావు, తహశీల్ధార్ వివేక్, ఎంపిడిఓ క్రాంతి, మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి అమరలింగేశ్వర రావు, మండల వ్యవసాయాధికారి వెంకన్న, పిఏసిఎస్ ధన్నసరి సిఈఓ గోపాల మల్లారెడ్డి, మార్కెట్ డైరెక్టర్‌లు, రైతు సంఘం నాయకులు, రైతులు, మార్క్‌ఫెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాలుగవ రోజుకు చేరిన విద్యుత్ కార్మికుల నిరవధిక సమ్మె



**ప్రజాపక్షం/తొర్రూరు :** విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి నాల్గొవ రోజుకు చేరింది. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీవీఈఏ జేఏసీ ఆధ్వర్యంలో తొర్రూరు విద్యుత్ డీఈ కార్యాలయం ముందు ఆర్టిజెన్, ఆన్ మ్యాన్డ్, ఎస్‌పీఎం, స్పాట్ బిల్లర్లు, పీస్ రేట్ వర్కర్లు నిరవధిక సమ్మెను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యర్హతల ఆధారంగా ఉద్యోగులకు కన్వర్షన్ చేయాలని, ఆర్టిజెన్‌లకు ఏపీఎస్‌బీ సర్వీస్ రూల్స్, టీజీ ఎన్‌పీడీసీఎల్, టీజీఎస్‌పీడీసీఎల్‌లో ఆన్ మ్యాన్డ్ వర్కర్లకు ఆర్టిజెన్‌లుగా విలీనం చేయాలని కోరారు. విద్యుత్ సంస్థలు 2016 కంటే ముందు ఉన్న వారి అర్హత ప్రకారం పని చేస్తూ ఇప్పటికీ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులుగా కొనసాగుతున్న వారిని ఆర్టిజెన్‌లుగా గుర్తించాలన్నారు. విద్యుత్ సంస్థలో పని చేస్తున్న పీసీరేట్ కార్మికులకు జీవో 11 ప్రకారం కనీస వేతనం చెల్లించాలని, 2026 పీఆర్‌సీ వేతన సవరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బంధారపు శ్రీను, సునీల్, పుల్లయ్య, ఖాజాబీ, కుమార్, వెంకన్న, జ్యోతి, సురేశ్, శ్రీధర్‌బాబు, రవీందర్, రాజు, రాఘవయ్య, యాకన్న, శుభాష్, వేణు, రామకృష్ణ, ఆర్టిజెన్, అన్ మ్యాన్డ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంజిఎం హాస్పిటల్‌లో డీ-అడిక్షన్ సెంటర్ పరిశీలన



**ప్రజాపక్షం/ వరంగల్ :** ప్రగతి ప్రణాళిక లో భాగంగా శనివారం వరంగల్‌లోని ఎంజిఎం హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన డీఅడిక్షన్ సెంటర్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్పాయ్‌లు సంయుక్తంగా ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, పునరావాస కార్యక్రమాలు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యసనాల నుంచి బయటపడేందుకు రోగులకు అవసరమైన మానసిక బలం అందించేందుకు కౌన్సెలింగ్ నిర్వహించి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని సిపి సూచించారు. అలాగే డీఅడిక్షన్ సెంటర్ సేవలను మరింత మెరుగుపరచాలని, బాధితులకు సమగ్ర సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. నర్సింగ్ స్టాఫ్ కి నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ గేమ్ ఎస్సే రైటింగ్ కాంపిటీషన్స్ లో గెలుపొందిన వారికి ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం సూపరింటెండెంట్ హరిచంద్ర రెడ్డి, హనుమకొండ డిఎం హెచ్ఓ అప్పయ్య, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యారాణి, సైకియాట్రిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ అశ్విన్ , హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మద్దతు ధర కల్పించేందుకు
# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు

రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/వేలేరు :** జులై 2026 నాటికి మల్లన్న గండి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి వేలేరు మండల రైతులకు సాగు నీరు అందిస్తానని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు.వేలేరు మండల కేంద్రంలో పిఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం మరియు ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి మక్కల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి గారు వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగిందని ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే 3లక్షల 50వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేస్తున్నారని అన్నారు. మన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 20వేల ఎకరాలలో మక్కల సాగు చేస్తున్నారని తెలిపారు. మొక్కజొన్నలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 2400గా ఉన్నప్పటికీ మక్కల వ్యాపారాలు మాత్రం క్వింటాకు 1600 నుండి 1700 లకే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దింతో మక్క రైతులు ఎకరానికి 20వేల వరకు నష్టపోతున్నారని అన్నారు. రైతులు ఆర్థికంగా నష్టపోకూడదనే ఉదేశ్యంతో ప్రభుత్వమే మద్దతు ఇచ్చి దాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, ధాన్యం కొనుగోలు తో సీజన్ కు ప్రభుత్వానికి 5వేల కోట్ల నష్టం వస్తుందని అయినప్పటికీ రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలని సద్వినియోగం చేసుకొని మద్దతు ధరకు దాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అత్యధిక కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకే కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఎందుకంటే మహిళా బాధ్యతగా పని చేస్తారని అలాగే ఉపాధి తో పాటు ఆదాయం వచ్చి మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడుతాయని వెల్లడించారు. హన్మకొండ జిల్లాలో మొట్ట మొదటి ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈ రోజు ప్రారంభించుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ అవసరాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణి, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలతో ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వెల్లడించారు. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో ఎదో ఒక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఏ గ్రామానికి వెళ్లిన ఇందిరమ్మ ఇండ్లు, సిసి రోడ్లు, కమ్యూనిటీ హాల్లు, అంగన్వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నానని అన్నారు. దానికి మీ అందరి సహకారం, ఆశీర్వాదం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బిల్లా యాదగిరి, పీడీ డిఆర్ డిఏ శ్రీనివాస్, సివిల్ సప్లై డిఎం, వ్యవసాయ శాఖ, మార్క్ ఫెడ్ శాఖ అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు బిల్ల యాదగిరి, కూరపాటి అశోల్, హనుమకొండ మనోజ్, బత్తుల శ్రీనివాస్ సాంబయ్య, రాజు,జిల్లా డి సి ఒ సంజీవరెడ్డి, సివిల్ సప్లై అధికారి మహేందర్,తహసీల్దార్ కోమి, ఎంపిడివో లక్ష్మి ప్రసన్న మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంలోని సాకారం: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పేదల సొంతింటి కల కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం లోనే సాధ్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని భూపాలపల్లి రూరల్ మండలంలోని గొర్లవేడు గ్రామములో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న ఎడ్ల స్వప్న గృహ ప్రవేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్లతో పేదల కళ్ళల్లో ఆనందం కనిపిస్తుందని అన్నారు. పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంలో సహకారం అవుతుందన్నారు. అర్హులందరికీ రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి

ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ :** మహాత్మా జ్యోతి రావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. పూలే 200వ జయంతి సందర్భంగా ములుగు క్రాస్ రోడ్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ జ్యోతి రావు పూలే మహిళల అభివృద్ధి కోసం విశేష కృషి చేశారని గుర్తు చేశారు. విద్యకు ప్రాధాన్యతనిస్తూ సమాజంలో కొత్త మార్గాలను చూపించిన మహనీయుడిగా ఆయనను కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మక కులగణనను విజయవంతంగా నిర్వహించిందని ఎంపీ తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ అంశాలను సమగ్రంగా పరిగణలోకి తీసుకుంటూ సర్వే చేపట్టినట్లు చెప్పారు. సేకరించిన డేటాను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం ద్వారా "తెలంగాణ మోడల్" దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని దేశవ్యాప్తంగా కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్ పాయి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ తదితరులు పాల్గొని మహాత్మా పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## సామిల్ కార్మికుల ఒప్పంద వేతనాలను
# వెంటనే చెల్లించాలి: ఎఐటియుసి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** సామిల్ కార్మికులను కార్మికుల ఒప్పందం ప్రకారం రెండు సంవత్సరాలకు ఒక సారి పెంచాల్సిన కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటియూసి వరంగల్ జిల్లా అధ్యక్షులు చెన్న కేశవులు అన్నారు. వరంగల్‌లో సామిల్ కార్మికులు నిర్వహిస్తున్న నాలుగవ రోజు సమ్మెను ప్రారంభించి కార్మికులను ఉద్దేశించి కందిక చెన్న కేశవులు మాట్లాడుతూ కార్మికులు తమ రక్తంతో చెమటను చిందించి యాజమాన్యానికి సేవ చేస్తుంటే కనీసం కార్మికుల మౌళిక వసతులు కల్పించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కార్మికుల పొట్ట కొడుతూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని తక్షణమే కార్మికులకు రెండు సంవత్సరాలకు ఒకసారి పెంచాల్సిన కార్మికుల వేతనాలు ప్రకారం ఒప్పందం కుదుర్చుకోవాల్సిన యాజమాన్యం కార్మికులపైన సవతి తల్లి ప్రేమ చూపెడుతున్నారని తక్షణమే కార్మికులతో చర్చలు నిర్వహించి కార్మికులకు తగు న్యాయం చేయాలని పలు డిమాండ్లతో కూడిన అంశాలపైన చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి సామిల్ వర్కర్స్ యూనియన్ నిర్మాణ బాధ్యులు తాళ్లపల్లి జాన్‌పాల్, ఎండి యాకూబ్, బండారి బిక్షపతి, నూనె బాబు, పిట్టల ఎ శ్రీనివాస్, ముప్పాల కుమార్, ఎండి ఇస్మాయిల్, మాణిక్యలరావు, వెంకన్న, బండి శ్రీను, బండి రవికుమార్, రంగ బాబు, తాళ్ళపల్లి కుమార్, బోనగిరి యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల హక్కుల కోసం
# పోరాడిన వ్యక్తి జ్యోతిరావు పూలే



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** ఎఐటియుసి, టియంఆర్‌పియస్ దళిత బహుజన జెఏసి, మున్సిపల్ యూనియన్స్ ఆధ్వర్యంలో రాజారపు భాస్కర్ అధ్యక్షతన హనుమకొండ మున్సిపల్ కార్యాలయం వద్ద జ్యోతి రావు పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టిఎంఆర్‌పియస్ అధ్యక్షులు బోట్ల బిక్షపతి మాదిగ, జెఏసి గౌరవ అధ్యక్షులు ఏల్పుల ధర్మరాజు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి యాదవ్ మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మున్సిపల్ కార్మికులకు స్ఫూర్తి నిచ్చే విధంగా పూలే గారి సమాజ సేవను గుర్తు చేశారు.పూలే కుల వ్యవస్థను వ్యతిరేకించి, స్త్రీల విద్య, దళితులుబహుజనులు, కార్మికులు, రైతులు, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం కృషి చేశారు. వారు సత్యశోధక సమాజం స్థాపించి, సమానత్వం, సామాజిక న్యాయం, విద్య ద్వారా సమాజాన్ని మార్చాలని స్ఫూర్తి నిచ్చారు. ప్రస్తుతం మున్సిపల్ కార్మికులు, సఫాయి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులు, మెరుగైన జీవన పరిస్థితుల కోసం పోరాడాలంటే పూలే ఆదర్శాలు, సమాజ సేవా దృక్పథం నుంచి చైతన్యం పొందాలని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బొట్ల రమేష్, దళిత బహుజన జేఏసీ అధ్యక్షులు వక్కల రాణాసాగర్, బొక్క ఏలియా, దామెర రాజు, స్వామి, దామోదర్, సుధాకర్, ప్రకాష్, లక్ష్మి , వెంకటమ్మ, రాణి, సుమలత, రజిత, మున్సిపల్ జవాన్లు, సఫాయి కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య రక్షణకు ఔషధ నియంత్రణ కీలకం

మత్తు ఔషధాల దుర్వినియోగంపై చైతన్య ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రజల ఆరోగ్య రక్షణకు ఔషధ నియంత్రణ కీలకమని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, శనివారం హనుమకొండ కలెక్టరేట్లోని ఐడిఓసీ సమావేశ మందిరంలో ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో ఔషధ నియంత్రణ అవగాహన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఔషధ పరిశీలకుడు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి హాజరయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య, ఈగల్ బృందం పరిశీలకుడు రవీందర్ పాల్గొన్నారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఔషధ విక్రేతలు, ఔషధ నిపుణులు పాల్గొని ప్రజల్లో ఔషధాల వినియోగంపై చైతన్యం కల్పించారు. సరైన డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీ బయోటిక్స్ వాడకూడదని, దీనివల్ల యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ ఏర్పడి భవిష్యత్తులో మందులు పనిచేయని స్థితి వస్తుందని, నకిలీ మందుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మందుల నాణ్యతను తనిఖీ చేయడానికి ప్యాకింగ్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని సూచించారు. ఏదైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్: 18005996969కు సమాచారం ఇవ్వాలని కోరారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. వీటి సరఫరా విక్రయాలపై సమాచారం ఉంటే 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు పిర్యాదు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో వక్తలు మాట్లాడుతూ అలవాటు కలిగించే ఔషధాల దుర్వినియోగం, షెడ్యూల్ హెచ్, హెచ్1 ఔషధాల నియంత్రణ, క్యూ ఆర్ కోడ్ ద్వారా ఔషధాల ధృవీకరణ, యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ నివారణ, లైసెన్స్ ధృవీకరణ వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెడికల్ అసోసియేషన్ సభ్యులు, మెడికల్ షాపు యజమానులు, ఫార్మసిస్టులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య రక్షణలో ఫార్మసీల బాధ్యత కీలకం



**ప్రజాపక్షం/జనగామ :** ప్రజల ఆరోగ్య రక్షణలో ఫార్మసీల బాధ్యత కీలకమని జనగామ జిల్లా కలెక్టర్ సందీఫ్‌కుమార్ ఝా అన్నారు. ఔషద దుఖానాలను నిబంధనల మేరకు నడపాలని, డ్రగ్స్, కాస్మొటిక్స్ చట్టం అమలు తప్పనిసరి అని ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రహించరాదన్నారు. 99 ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా ఔషద నియంత్రణ పరిపాలన శఖూఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెనెథనింగ్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వయించారు. ఈ సందర్భంగా డిసిపి రాజమహేంద్రనాయక్, ఎసిపి పండరీ చేతన్, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి కలెక్టర్ మాట్లాడారు. ఔషద దుఖానాలు చట్టబద్ధంగా నియమావళి ప్రకారం నడవాలని స్పష్టం చేశారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం ప్రకారం ప్రతి మెడికల్ షాప్ తప్పనిసరిగా రిజిస్టేషన్, లైసెన్స్ కలిగి ఉండాలని, రిజిస్టర్‌ల నిర్వాహణలో లోపాలు లేకుండా రికార్డులను సక్రమంగా నిర్వయించాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం మెడికల్ షాపులు నివాస భవనల్లో కాకుండా వాణిజ్య భవనాల్లోనే నడపాలని, దుకాణం ప్రారంభించిన తర్వాత ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డ్రగ్ లైసెన్స్, ట్రేడ్ లైసెన్‌స వేర్వేరు అని, అక్యుపెన్సీ సర్టిఫికెట్ ఫైర్ సేఫ్టీ లైసెన్స్ వంటి అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఔషదాల విక్రయాల్లో జాగ్రత్తలు పాటించాలని, ఓవర్ ది డ్రగ్ మందులు, ప్రిస్కిప్షన్ మందుల మద్య తేడాను గుర్తించాలన సూచించారు. ప్రిస్కిప్షన్ మందులు వైద్యుల చీటి లేకుండా ఇవ్వకూడదని జీరాక్స్ కాపీలు వాట్సాప్ ద్వారా వచ్చిన ప్రిస్కిప్షన్స్ ఆధారంగా మందులు ఇవ్వరాదన్నారు. తప్పనిసరిగా ఓరిజినల్ ప్రిస్కిప్షన్ మాత్రమే పరిగణలోకి తీసుకోవాలన ఎవైనా అనుమానాలుఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. జిల్లాలో అన్ని ఔషధ దుఖానాలు నిబంధనలు పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన మందులు విక్రయాలు చేయాలన్నారు. జ్వరం వంటి సాదారణ లక్షణాలు ఉంటే ప్రిస్కిప్షన్ లేకుండా మందులు ఇస్తున్నారని, ఇప్పటి నుండి ఇలాంటిది జరగొద్దన్నారు. తేదీ, వినియోగదారులు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, ఏసిపి పండరి చేతన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణ, తర సంబందిత అధికారులు, వైద్య సిబ్బంది, కెమిస్టు, ఫార్మసి ప్రతినిదులు పాల్గొన్నారు.

## యువత చదువులతో పాటు క్రీడలపై దృష్టి సారించాలి

కలెక్టర్ రాహుల్ శర్మ




**ప్రజాపక్షం/భూపాలపల్లి:** యువత చదువు, క్రీడలపై దృష్టి సారించి చెడు ఉజ్వలన భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని, వ్యసనాలకు బానిసలై భవిష్యత్ నాశనం చేసుకోవద్దని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించేందుకు శనివారం జిల్లా కేంద్రం లోని రాజీవ్ చౌక్ నుండి డా|| బిఆర్ అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ బానిసల కోసం ప్రభుత్వం ప్రత్యేక డీఅడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. మన జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయబడుతుందని వెల్లడించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్‌లో ఆరో రోజు మాదకద్రవ్యాల నివారణపై ఈ ర్యాలీ నిర్వహించబడిందన్నారు. డ్రగ్స్ రవాణా, విక్రయం, వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిసినా వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రత్యేకంగా ఈగల్ టీం ఏర్పాటు చేసిందని, ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.మధుసూదన్, డ్రగ్ ఇన్స్పెక్టర్ పావని, కౌన్సిలర్లు, అధికారులు, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నరసింహ్మ



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నరసింహ ఆద్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి పట్టణంలో మహాత్మజ్యోతిరావు పూలే విగ్రహానికి ఈటీ నరసింహ ,సిపిఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ నివాళులర్పించారు. ఈటీ నరసింహ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక విప్లవ కారుడు ,స్త్రీ విద్యకై హర్నిశలు కృషి చేసినారని కొనియడారు. సిపిఐ జిల్లా నాయకులు రెహమాన్, మహాబుబూ , లింగం, రూబీ నా బేగం, కళావతి ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గాయపడ్డ కార్మికునికి వైద్య సహకారం అందించాలి

ఎఐటియుసి జిల్లా ప్రదాన కార్యదర్శి ఓమయ్య



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** విధులు నిర్వహిస్తూ గాయపడ్డ మునిసిపల్ కార్మికుడు నిమ్మ గంగాదర్‌కు నిజామాబాద్ మునిసిపల్ నుండి వైద్య సహాయం అందించాలని, మునిసిపల్ కమిషనర్ బాధితున్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించాల్సిన అవసరముందని ఏఐటియుసి జిల్లా ప్రదాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. శనివారం నిజామాబాద్ నగరంలోని మనోరమ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మునిసిపల్ అలీసాగర్ పిల్టర్ బెడ్ కార్మికుడు నిమ్మ గంగాధర్‌ను ఏఐటియుసి జిల్లా ప్రదాన కార్యదర్శి వై.ఓమయ్య పరామర్శించారు. లేబర్‌గా ఉన్న నిమ్మ గంగాధర్‌ను విద్యుత్ టెక్నిషియన్‌గా పనిచేయిస్తున్నారని, వీరికి ఎలాంటి రక్షణ పరికరాలు గాని, వసతులు కల్పించకపోవడం వల్ల అపాయం జరిగినా పట్టించుకునే నాథుడు లేకపోవడం బాధాకరమన్నారు. కమిషనర్ ఆ కార్మికుడికి పరామర్శించాలని ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించడంతోపాటు వైద్య ఖర్చులు మొత్తం మునిసిపల్ భరించాలని, కార్మికుడితో టెక్నికల్ పని చేయించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె. సహదేవ్, హరీష్, కండ్లకోయ గంగాధర్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## రైతులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పాలకుల విధానాలకు నిరసనగా ఐక్య ఉద్యమాలకు సిద్ధంగా రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య అన్నారు. శనివారం ఎఐకెఎస్ ఆధ్వర్యంలో మోపాల్ మండల పరిధిలోని ఠాణాకూర్ద్ గ్రామ చౌరస్తాలో రాష్ట్ర రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించి 90 సంవత్సరాల క్రితం ఏర్పడ్డ సంఘం స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం వచ్చిన వ్యవసాయరంగం పట్ల ప్రభుత్వాలు చూస్తున్న చిన్నచూపుకు నిరసనగా అనేక ఉద్యమాలను నిర్మించి పోరాటాలు నిర్వహించామన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే పుట్టిన రోజు సందర్భంగా ఈ సంఘాన్ని ఏర్పాటు చేయటం ఆనాటి సాంఘీక అసమానతలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమ నేపథ్యంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కుట్రలకు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటమన్నారు. రాబోయే రోజుల్లోరైతాంగం పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించాలన్నారు. రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ఎస్ఐ వెంకటకృష్ణ

**ప్రజాపక్షం / రెబ్బెన :** రైతులకు నకిలీ పత్తి విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రెబ్బెన సబ్ ఇన్స్పెక్టర్ వెంకటకృష్ణ హెచ్చరించారు. వానకాలం సీజన్ సమీపిస్తుండటంతో కొందరు కేటుగాళ్లు రైతులకు మాయమాటలు చెప్పి నకిలీ విత్తనాలు అంటగట్టే అవకాశం ఉందని, అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి, ఇక్కడ రైతులకు రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు అమ్ముతూ నిలువునా దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విత్తనాల వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నమ్మకమైన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొన్నప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మే వారి సమాచారం పోలీసులకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## ఘనంగా జ్యోతి బాపూలే జయంతి

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** గొప్ప సంఘసంస్కర్త, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహనీయుడు జ్యోతి బా మహాత్మ పూలే అని అప్పాజీ పల్లి సర్పంచ్ గంధాలి రవి కొనియాడారు. మహాత్మ పూలే జయంతి సందర్భంగా శనివారం మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు పోరాడిన వీరుడన్నారు. దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులు ఉండాలని , మహిళలకు విద్య అందించేందుకు కృషి చేయడంతో పాటు, మొదటి పాఠశాలను ప్రారంభించిన గొప్ప మహానుభావుడు అని పేర్కొన్నారు. జ్యోతిబాపూలే ఆశయాలను కొనసాగిస్తూ ఆయన చూపిన బాటలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ ,ప్రసాద్, దుర్గ ప్రసాద్, సాయిబాబా, జ్ఞానేశ్వర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. గడి పెద్దాపూర్‌లోజ్యోతిబాపూలే జయంతి వేడుకలను గడి పెద్దాపూర్ గ్రామంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దినజనుల జీవితాల్లో వెలుగు రేఖ నింపిన మహనీయుడు జ్యోతిబాపూలే అని, కుల వివక్షకు వ్యతిరేకంగా కోట్లాదిమంది ప్రజానీకం కోసం పోరాడిన దీరుడన్నారు. అంటరానితనం నిర్మూలనకు కృషి చేయడంతో పాటు స్త్రీ, విద్య హక్కులు సాధికారత కోసం కృషి చేశారన్నారు.

# విద్యా విప్లవానికి నాంది పలికిన మహనీయుడు పూలే

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**ప్రజాపక్షం/మెదక్ :** విద్యా విప్లవానికి నాంది పలికిన మహానియుడు మహాత్మ జ్యోతిబా పూలే అని ఆయన ఆశయాలను ఆలోచనలను ఆచరించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మ జ్యోతిబా పూలే 200 జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ నరేష్, వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ మాసం అంటేనే మహానీయుల మాసం అని అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే విద్యా విప్లవానికి నాంది పలికిన ఆయన మహిళల విద్యకు ప్రాధాన్యతనిస్తూ తొలి బాలికల పాఠశాలను స్థాపించారని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమానతలను తొలగించడానికి శ్రమించి, అణగారిన వర్గాలకు సమాన హ క్కులు కల్పించాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపట్టారని తెలిపా రు. దేశంలోని అణగారిన వర్గాల కోసం మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం, విద్య, న్యాయం కోసం చేసిన కృషి ఎల్లప్పు డూ స్ఫూర్తిదాయకమని తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం ప్రస్తుత ప్ర భుత్వానికి మార్గదర్శకమని అన్నా రు. అంతకుముందు వివిధ కుల సంఘాల నాయకులు జ్యోతిబాపూలే గోప్పదనాన్ని వివరిస్తూ వక్త లు తమ సందేశాన్ని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సహయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గంగా కిషన్, ఆర్‌డీఓ రమాదేవి ,టీఎన్జీఓ అధ్యక్షులు దొంతి నరేందర్, కార్యదర్శి రాజ్ కుమార్, పద్మశాలి సంఘం అధ్యక్షులు మేకల జయరాములు, నా యని బ్రాహ్మణి సంఘం అధ్యక్షులు ఉప్పల స్వామి, మాల మహానాడు గౌరవ అధ్యక్షులు మాసాయిపేట మల్లేశం, బి సంగమేశ్వర్ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

దినేష్‌పటేల్ కులాచారి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని సవాలు విసిరాం.. స్థలానికి వచ్చామని పారిపోయింది ఎవరో ప్రజలే చూస్తున్నారని బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి అన్నారు. శనివారం ధర్పల్లి మండలం వాడీ గ్రామ శివారులోని పెద్దమ్మ దేవాలయం వద్ద రైతులకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని పెద్దమ ఆలయం వద్దకు బిజెపి శ్రేణులు చేరుకున్నారు. వాడీ పెద్దమ్మ ఆలయం వద్ద ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకోవటంతో పోలీసులకు బిజెపి కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం దినేష్ పటేల్ కులాచారిని అరెస్ట్ చేసి పిఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాత్రం ప్రజల ముందుకు రావడానికి భయపడ్డాడన్నారు. రైతులకు నష్టపరిహారం ఇచ్చామని గొప్పలు చెప్పడం సులువని ఎవరికి ఇచ్చారో ఆధారాలు చూపడం ఎందుకు కష్టమన్నారు. ఎంతమందికి ఇచ్చావు . ఏ గ్రామాలకు ఇచ్చావు ? ఎవరికి ఒక్క రూపాయైనా చేరిందా ? అని ప్రశ్నించారు. నిజం చెప్పే ధైర్యం లేక రాత్రి చీకటిలో మా కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయించటం ఇది నీ బలహీనతకు నిదర్శనమన్నారు. ప్రశ్నిస్తే కేసులు ఎదిరిస్తే అరెస్ట్‌లా ఇదేనా నీ ప్రజా పాలన ? ఇదేనా ప్రజాస్వామ్యం ? రైతన్నల కష్టాలను రాజకీయ లాభాల కోసం వాడుకోవటం ఆపాలని, అబద్ధాలతో ఎంతకాలం ప్రజలను మోసం చేస్తావన్నారు. నేను ఇక్కడికి వచ్చాను, నువ్వెక్కడ ఉన్నావు ? ప్రజల ముందు నిలబడే ధైర్యం ఉందా ? రైతుల డబ్బు ఎక్కడికి పోయిందో లెక్క చెప్పే వరకు బీజేపీ పోరాటం ఆగదన్నారు. రైతన్నకు న్యాయం జరిగే వరకు యుద్ధం కొనసాగుతుందన్నారు. అబద్ధాల పాలనకు ముగింపు దగ్గరలోనే ఉందన్నారు.

## మొక్కజొన్న రైతులకు మద్దతుగా ప్రభుత్వం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రబీ సీజన్ లో రైతులు పండించిన మొక్కజొన్న ను ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలని నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి అన్నారు.శనివారం మార్కెట్ యార్డులో రైతులకు టోకెన్లను జారీ చేశారు.కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇచ్చార్జి కూచాడి శ్రీహరి రావు వ్యవసాయ శాఖ మంత్రికి విన్నవించగా నిర్మల్,సారంగాపూర్ మార్కెట్ చేసిందని అన్నారు.రైతులు కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్నలు విక్రయించి క్వింటాలుకు రూ.2400 మద్దతు ధర పోందాలన్నారు.ప్రజా ప్రభుత్వంలో సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు.

# 'ప్రిస్క్రిప్షన్' ఉంటేనే మందులు

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / మంచిర్యాల :** వైద్యులు సూచించిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం మాత్రమే మందుల దుకాణాల నిర్వాహకులు మందులు విక్రయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ప్రజలు సొంత నిర్ణయాలతో మందులు, సిరప్‌లు వాడకూడదని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. నార్కోటిక్, నిషేధిత డ్రగ్స్ విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే మందుల షాపులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలో ఏ డు పడకలతో ఏర్పాటు చేసిన డ్రగ్స్ డిఅడిక్షన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని సాధారణ స్థితికి తెచ్చేందుకు ఈ సెంటర్ కృషి చేస్తుందని వివరించారు. విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండాలని కో రుతూ వారితో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ ని యంత్రణ సమాచారం కోసం 14416, 19 08 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, డ్రగ్స్ ఇన్స్పెక్టర్ చందన, ఈగల్ ఫోర్స్ సిఐ రవికుమార్, ఆసుపత్రి పర్యవేక్షకులు వేదవ్యాస్, ఆర్ ఎంఓ భీష్మ, మాస్ మీడియా అధికా రి బుక్క వెంకటేశ్వర్లు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు చంద్రశేఖర్, సుధాకర్, వై ద్యులు సునీల్ కుమార్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# సమానత్వం, మహిళా విద్యకు మార్గదర్శి పూలే

టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలను జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ,జిల్లా కలెక్టర్ పి.పావీణ్య, శాసన సభ్యులు చింతా ప్రభాకర్ మున్సిపల్ చైర్ పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్‌పాండు తదితరులు జోతిరావు పూలే విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆద్వర్యంలో నటరాజ్ థియేటర్ సమీపంలో నిర్వహించిన జయంతి ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.మహాత్మజ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం మహిళా విద్య కోసం చేసినకృషి చిరస్మరణీయమన్నారు. ప్రతి ఒక్కరికి సమాన హక్కులు కలగాలని ఆశించిన గొప్ప సంస్కర్తగా ఆయనను కొనియాడారు. మహిళల విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవల వల్లనే నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. యువత ఆయన సూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగా అభివృద్ధికి కట్టుబడి పాఠశాలలు ,హాస్టళ్లలో అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నదని తెలిపారు. ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధి భద్రతకు ప్రత్యేక ప్రాదాన్యత ఇస్తున్నామని జిల్లాలో డిగ్రీ ,జూనియర్ కళాశాలల,భాలికలకు హాస్టల్ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ పిప్రావీణ్య మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సమానత్వం విద్యా విస్తరణ మహిళా సాదికారత కోసం ఆహర్నిశలు కృషి చేసిన మహనీయుడని అన్నారు. మహిళా విద్యకు పునాది వేసిన సావిత్రభాయి పూలే సేవలను గుర్తు చేశారు. పూలే దంపతుల స్పూర్తితో యువత సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆయన ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. జిల్లాలో బీసీ వసతి గృహాల్లోని విద్యార్థుల కోసం సిఎస్ ఆర్ నిధుల కింద రూ. 35 లక్షలతో ట్రంక్ బాక్సులు తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. అలాగే రూ. 1.52 కోట్ల వ్యయంతో హాస్టల్ భవనాల మరమ్మతుల చేపట్టినట్లు చెప్పారు. ఎస్,ఎస్సీ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్స్ అందజేసినట్లు గత సంవత్సరం పదవ తరగతిలో 99.5 శాతం ఉత్తీర్ణత సాదించారని ఈ సంవత్సరం వంద శాతం పలితాలు సాదించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని బిసి స్టడీ సర్కిల్స్ ద్వారా గ్రూప్ ,యూపీఎస్సీ పరీక్షలకు కోచింగ్‌తో పాటు అవసరమైన మెటీరియల్ అందించామని కలెక్టర్ తెలిపారు. సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ పాండు ,జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అదికారి జగదీష్, వివిధ శాఖల అధికారులు కుల సంఘాల ప్రతినిధులు ,ఉద్యోగ సంఘాల ప్రతినిదులు ,యువత, విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

## రైతు బిడ్డకు రాష్ట్ర స్థాయి పురస్కారం


జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా అవార్డు




**ప్రజాపక్షం/ఎడపల్లి:** తక్కువ చదువుకున్నా.. పట్టుదలే పెట్టుబడిగా, సేంద్రీయ వ్యవసాయమే మార్గంగా ఎంచుకున్న నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల మహిళా రైతు పుష్ప ముదిరాజ్ మరో అరుదైన మైలురాయిని చేరుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఫామ్ అండ్ రూరల్ సైన్స్ ఫౌండేషన్ రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రధానోత్సవంలో ఆమె జిల్లా ఉత్తమ మహిళా సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తిదారు పురస్కారాన్ని అందుకున్నారు. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన పుష్ప ముదిరాజ్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణతో పాటు పలువురు ప్రముఖ వ్యక్తుల చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. రసాయన రహిత సాగులో ఆమె చేస్తున్న ప్రయోగాలు, పండిస్తున్న నాణ్యమైన ఉత్పత్తులను వేదికపై ఉన్న ప్రముఖులు ప్రత్యేకంగా కొనియాడారు. ఆమె గతంలో ఆల్ ఇండియా లెవెల్ బెస్ట్ ఫిమేల్ ఫార్మర్ అవార్డును సాధించి జాతీయ స్థాయిలో జిల్లా పేరును మారుమోగించారు. వేదికపై ఉన్న ప్రముఖులు ప్రత్యేకంగా కొనియాడారు. సామాన్య రైతు కుటుంబం నుంచి దేశంలో గర్వించే స్థాయికి ఎదిగారు. ఆమె గతంలో ఆల్ ఇండియా లెవెల్ బెస్ట్ ఫీమేల్ ఫార్మర్ అవార్డును సాధించి జాతీయ స్థాయిలో జిల్లా పేరును మారుమోగించారు. అంతేకాకుండా 2025సంవత్సరానికి గాను రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా లక్ష రూపాయల నగదు పురస్కారంతో కూడిన ఉత్తమ మహిళా రైతు అవార్డును కూడా కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కేవలం ఐదవ తరగతి చదివి, ఒక్క చిన్న గ్రామం నుంచి దేశ స్థాయి ఉత్తమ రైతుగా ఎదిగిన తమ అమ్మ అందరికీ ఆదర్శంగా అని గర్వంగా చాటారు.

# నిర్మల్ మున్సిపాలిటీలో రాజకీయ రగడ..!

### అభివృద్ధి నిధులపై కాంగ్రెస్,బిజెపి నాయకుల మధ్య మాటల యుద్ధం



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ మున్సిపాలిటీ వేదికగా ప్రస్తుతం అధికార కాంగ్రెస్,ప్రతిపక్ష బీజేపి నాయకుల మధ్య రాజకీయ యుద్ధం తారస్థాయికి చేరుకుంది.పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు,చేపడుతున్న పనుల ఘనత ఎవరికి దక్కుతుందనే అంశంపై ఇరు పార్టీల మధ్య హోరా హోరీ సాగుతోంది.పట్టణంలోని ప్రధాన రహదారుల ధుస్థితి,తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న తీవ్ర అంతరాయాలు ఒకవైపు సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండగా,మరోవైపు ఈ సమస్యలపై రాజకీయ పక్షాలు పరస్పర విమర్శలు గుప్పించుకోవడం జిల్లా కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది.ముఖ్యంగా పట్టణంలోని బ్రహ్మపురి రామాలయం నుండి బంగ్లాపేట్ వరకు ఉన్న ప్రధాన రహదారి గత కొంతకాలంగా పూర్తిగా ధ్వంసమై ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తోంది.ఈ రహదారి గుంతలమయంగా మారడం వల్ల వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారని, మున్సిపల్ యంత్రాంగం ఈ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరానగర్ పోస్ట్ ఆఫీస్ నుండి డీమార్ట్ వరకు,అలాగే నిత్యం రద్దీగా ఉండే కూరగాయల మార్కెట్ పరిధిలోని రహదారుల పునరుద్ధరణ పనులు కూడా నత్తనడకన సాగుతుండటంతో ప్రతిపక్షాలు అధికార పక్షాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి.మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తూ కాలయాపన చేయడం వల్ల ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### అవగాహన లోపంతోనే బిజెపి విమర్శలు

బీజేపీ కౌన్సిలర్లకు నిధులు ఇవ్వడం లేదంటూ చేస్తున్న ప్రచారం కేవలం అవగాహన లోపమేనని కాంగ్రెస్ కౌన్సిలర్లు కొట్టిపారేశారు.మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఏజెండాను ఆమోదించిన కనీస అవగాహన కూడా లేకుండా బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం తగదని వారు హితవు పలికారు.మాడెగాం నుం డి పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే 600 ఎంఎం ప్రధాన పైపులైన్ గత రెండున్నర ఏళ్లుగా లీకేజీ సమస్యలతో సతమతమవుతున్నా,ప్రత్యామ్నాయ ర్గాల ద్వారా అరకోర నీటిని సరఫరా చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. అమృత్ 2.0 పథకంలో చేర్చడం ద్వారా లభించిన సు మారు 62 కోట్ల రూపాయల నిధులపై రాజకీయ చదరంగం మొదలైంది.ఇది జనాభా ప్రాతిపదికన జరిగిన సాంకేతిక ప్రక్రియ అని,ఏ ఒక్కరి వ్యక్తిగత ఘనత కాదని కాంగ్రెస్ కౌన్సిలర్లు కత్తి నరేందర్,గోపు గోపి,ఎస్పి రాజు స్పష్టం చేశా రు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు 15 కోట్ల రూపాయల ప్రత్యేక నిధులను మంజూరు చేశారని,ఆ నిధులకు కూడా తమవల్లనే వచ్చాయని చెప్పకోవడం బీజేపీ నాయకుల అజ్ఞానానికి నిదర్శనమని వారు ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో వార్డుల వారీగా ఉన్న క్షేత్రస్థా యి సమస్యలను విస్మరించి,కేవలం తమకు అనుకూలమైన ప్రాంతాలకే నిధులు పొగుపడేలా చేశారని,ఆ అన్యాయాన్ని సరిదిద్దడానికే తాము పాత టెండర్లను రద్దు చేసి పారదర్శకమైన పద్ధతిలో సాగుతున్నామని వెల్లడించారు.

## యువతను మత్తు పదార్థాలకు దూరం

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** యువత మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు చీకటి మార్గం వైపు పయనిస్తాయని, అలాంటి చెడు దారిని ఎన్నుకోకుండా యువత సన్మార్గం వైపు ప్రయాణించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. యువతను మత్తు పదార్థాలకు యువతను దూరంగా ఉంచాలన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెంట్ సునీతా దేవి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్, డిసిహెచ్ డాక్టర్ శివ దయాల్ తో కలిసి మత్తు పదార్థాల చికిత్స కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రం పని విధానాన్ని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ వైద్యాధికారులతో సమీక్షించారు. మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్మహించాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల భాగంగా మత్తు పదార్థాల నియంత్రణపై వైద్య విద్యార్థులకు నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రం, షీల్డ్ ను బహుకరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సిఐ మహేష్, వైద్యాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మందలించిందని తల్లినే హతమార్చాడు

ప్రజాపక్షం/మల్లాపూర్:భార్యతో తరచూ గొడవ పడుతుంటే తల్లి పదే పదే తనను మందలించడంతో, ఆక్రోషంతో కన్నతల్లిని కడతేర్చాడు ప్రబుద్ధుడు. వివరాల్లోకి వెళితే మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన కుదుదుల నంబయ్య (73) అనే వ్యక్తి తరచూ తన భార్య లక్ష్మి తో గొడవ పడుతుండేవాడని, శుక్రవారం రోజున తన భార్యతో గొడవపడే క్రమంలో నానా బూతులు తిట్టడంతో మృతురాలు వెంకు(90) తన కొడుకు నంబయ్యను మందలించేసరికి ఆవేశంతో తన తల్లి వెంకు నుదుటిపై బలంగా గుద్ది మంచం పై నుండి కింద పడి వేయడంతో గాయాలై ముక్కు నుండి రక్తస్రావమై అక్కడికక్కడే మరణించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి రెవెన్యూ ఇన్స్పెక్టర్ రేగేలా అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనిల్ తెలిపారు. కాగా కన్నకొడుకే కాలయముడై కన్నతల్లిని కడతేర్చడం మండల వ్యాప్తంగా కలకలం రేపింది.

## హౌస్ లిస్టింగ్ బ్లాక్‌ల జనగణన కార్యక్రమాన్ని పూర్తి చేయాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి : హౌస్ లిస్టింగ్ బ్లాక్‌ల జనగణన కార్యక్రమాన్ని కచ్చితత్వంతో, సమగ్రంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం పెద్దపల్లి పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయాన్ని సుల్తానాబాద్ పురపాలక సంఘం లో జరుగుతున్న జనగణన ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూహౌస్ లిస్టింగ్ బ్లాక్‌లకు సంబంధించి ఫిజికల్ వెరిఫికేషన్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. పట్టణంలోని ల్యాండ్‌మార్క్‌లు, పాఠశాలలు, దేవాలయాలు, కార్యాలయాలు తదితర గుర్తులను బ్లాక్ వారీగా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.హౌస్ లిస్టింగ్ బ్లాక్‌కు సంబంధించిన వివరాలు ఖచ్చితమైన సమాచారంతో సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి డిప్యూటీ తహసిల్దార్ విజయ్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## సమష్టి కృషితోనే మత్తు పదార్థాల నిర్మూలన



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : సమష్టి కృషితోనే మత్తు పదార్థాలను నిర్మూలించవచ్చునని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో మత్తు పదార్థాల వినియోగాన్ని నిర్మూలించేందుకు, వ్యసనానికి గురైన వ్యక్తులను తిరిగి సాధారణ జీవన విధానంలోకి తీసుకురావడానికి హెల్త్, పోలీస్ శాఖలు సంయుక్తంగా చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ , జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డిఅడిక్షన్ సెంటర్‌ను సందర్శించారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ సమస్య ఒక పెద్ద సవాలుగా మారిందని, దీన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా "ఈగల్ టీం"ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందం ద్వారా డ్రగ్స్ నియంత్రణ, అవగాహన కార్యక్రమాలు, పర్యవేక్షణ చర్యలు మరింత బలోపేతం చేయబడుతున్నాయని వివరించారు.అదేవిధంగా జిల్లాలో మత్తు పదార్థాల సరఫరా, రవాణా, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని, ఎవరైనా ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలు ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగం లేదా విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల నిర్మూలన, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎస్పీ , ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైద్యులు,పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు పోలీసుల కౌన్సిలింగ్



ప్రజాపక్షం/వీణవంక:మండల పరిధిలో పండించిన ధాన్యాన్ని రోడ్డు మార్గంలో ఉంచరాదంటూ వీణవంక సిఐ ఆదేశాల మేరకు పోలీసులు రైతులకు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. మండలంలోని వల్బాపూర్, నర్సింగాపూర్ గ్రామంలోని రైతులకు రోడ్డు మార్గంలో ధాన్యాన్ని ఉంచరాదని పేర్కొంటూ వారికి నోటీసులు జారీ చేశారు. మండలంలోని రైతులందరూ పండించిన ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టుకోవాలని జమ్మికుంట సిఐ విజ్ఞప్తి చేశారు.

## నేడు హిందూ సమ్మేళన ర్యాలీ




ప్రజాపక్షం /పెగడపల్లి : మండల కేంద్రంలో ఏప్రిల్ 12 (ఆదివారం) భారీ ఎత్తున హిందూ సమ్మేళనం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు కార్యక్రమ అధ్యక్షులు కాటం నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీ ఉదయం 9 గంటలకు స్థానిక శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం నుండి ఘనంగా ప్రారంభం కానుంది. ఈ ఆధ్యాత్మిక యాత్ర పెగడపల్లి నుండి బయలుదేరి ఏడుమోటలపల్లి, నామాపూర్, మ్యాక వెంకయ్యపల్లి, నరసింహునిపేట మీదుగా నందగిరి మరియు ఐతుపెల్లి గ్రామాల వరకు కొనసాగుతుందని ఆయన వివరించారు. హిందూ బంధువులందరూ కులమతాలకు అతీతంగా, అధిక సంఖ్యలో తమ బైక్‌లతో తరలివచ్చి ఈ హిందూ సమ్మేళన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.మన ధర్మ రక్షణకు,ఐక్యతకు చిహ్నంగా సాగే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిరిపురం రవి,కట్ల రమేష్, నేదరి లక్ష్మణ్, ఉల్లెందుల రాజశేఖర్,జడల రాజేశం,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడిన ప్రతీ కార్యకర్తకూ అండగా నిలుస్తాం

### రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




ప్రజాపక్షం/జగిత్యాల: పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియామకం అయిన సంగనభట్ల దినేష్ పదవి ప్రమాణ స్వీకారం, అభినందన సభ జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమానికి మంత్రి అడ్లూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ గెలిచిన, ఓడిన ప్రజల మధ్యనే ఉంటూ ముందుకు సాగానని అన్నారు. అనేక అవమానాలు ఎదుర్కొంటూ ఎన్నికల్లో ఓటమి చెందినా అధైర్య పడకుండా కాంగ్రెస్ పార్టీ జెండాను నమ్ముకొని ముందుకు సాగినట్లు మంత్రి తెలిపారు. పార్టీలో కమిట్‌మెంట్‌గా పని చేశాను కనుక నేడు క్యాబినెట్‌లో పని చేసే అవకాశం దక్కిందని మంత్రి అడ్లూరి అన్నారు.బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తనకు అనేక ఆఫర్లు ఇచ్చిందని అయినప్పటికీ ఎలాంటి ఆఫర్లను లొంగకుండా కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని మంత్రి అడ్లూరి అన్నారు. జగిత్యాల జిల్లాలో పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు సరైన సమయంలో గుర్తింపు లభిస్తుందని ఎవరు నిరాశ పడవద్దని మంత్రి అన్నారు.రాష్ట్రంలో రేవంత్ పాలన పోవాలి.. మార్పు రావాలి అని జీవన్ రెడ్డి నినాదం ఎత్తుకున్నారని ఎందుకు మార్పు రావాలి అని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో సన్నబియ్యం పథకం అమలు చేస్తున్నందుకు మార్పు రావాలా.. ? అర్హులకు రేషన్ కార్డులు అందించినందుకు మార్పు రావాలా..? నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినందుకు మార్పు రావాలా.. ? మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకు మార్పు రావాలా ..? అని జీవన్ రెడ్డిని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని రానున్న రోజుల్లో నిత్యం ప్రజల మధ్య ఉంటూ రాష్ట్రంలో మరో మారు అధికారంలోకి వస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. 2029లో సైతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి మరో సారి సీఎం అవుతారని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. కొత్తగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా నియామకం అయిన సంగనభట్ల దినేష్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, మంథని కాంగ్రెస్ నాయకుడు దుద్దిళ్ల శ్రీను బాబుతో పాటు జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ,పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

## ఫూలే ఆశయాలను కొనసాగించాలి: కలెక్టర్




ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్: మహాత్మా జ్యోతిబా ఫూలే ఆశయాలను, ఆలోచనలను మనమందరం ఆచరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహాత్మ జ్యోతిబా ఫూలే 200వ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,అదనపు కలెక్టర్ డి.వేణు లతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, జ్యోతిబా ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతూ మన దేశం అభివృద్ధి చెందాలంటే మహాత్మ జ్యోతిబా ఫూలే ఆశయాలను ,ఆ లోచనలు మనమందరం ఆచరిస్తూ అమలు చేస్తూ దేశ అభివృద్ధిని సాధించవచ్చు అని, సమాజంలోని అసమాన తలను తొలగించవచ్చని కలెక్టర్ అన్నారు.సామాజిక సమానత్వం సాధన కోసం జ్యోతి బా ఫూలే అప్పటి సమాజంలో పోరాటం చేశారని, ఆ స్ఫూర్తి మనమంతా తీసుకోవాలని, సామాజిక అసమానతలు దూరమయ్యేందుకు మన వంతు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. బాలికల విద్యపై ఫూలే దంపతులు చిత్తశుద్ధితో పనిచేశారని, స్త్రీలు విద్యా వంతులు కావాలని ఆకాంక్షించారని తెలిపారు. అంతకంటే ముందు పెద్దపల్లి లోని మహాత్మా జ్యోతిబా ఫూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని లు కూచిపూడి నృత్యం ప్రదర్శన చేసి అలరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిసి అభివృద్ధి శాఖ అధికారి జే.రంగా రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ ప్రకాశ్, వివిధ బిసి సంఘాల నాయకులు,ప్రజా ప్రతినిధులు,జిల్లా అధికారులు,ఉద్యోగులు,తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల సభతో ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తాం

### సభా స్థలి ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రులు, నాయకులు



ప్రజాపక్షం/జగిత్యాల: జగిత్యాల సభతో కాంగ్రె స్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తామని మాజీ మ ంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. జగిత్యాల జి ల్లా కేంద్రంలో ఈ నెల 20న నిర్వహించనున్న మా జీ ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభకు సంబంధించి మోతె రోడ్డు పక్కన గల స్థలాన్ని మాజీ మ ంత్రులు కొప్పుల ఈశ్వర్,జీవన్ రెడ్డి, జిల్లా పార్టీ అ ధ్యక్షుడు విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ రమణ పరిశీలించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి కొ ప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ రెండేళ్లలోనే రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇ చ్చిన హామీలలో ఒక్కటిని కూడా నెరవేర్చలేదన్నా రు. జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. జగిత్యాల సభను భారీగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు, ఈ సభకు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ హాజరవుతారని,లక్ష మందితో సభ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ , మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్ , మాజీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పి చైర్‌పర్సన్ తుల ఉమ, మాజీ డిసి ఎమ్ ఎస్‌చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కుఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి తదితరులు ఉన్నారు.

## ఫూలేను ఆదర్శంగా తీసుకొని పోరాడాలి



ప్రజాపక్షం/పెద్దపల్లి : అల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఎఐటియుసిరామ గుండం నగర సమితి ఆధ్వర్యంలో ఈరోజు స్థానిక మహాత్మ జ్యోతి రావ్ ఫూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా ఎఐటియుసినగర అధ్యక్ష,ప్రధానకార్యదర్శి అబ్దుల్ కరీం,శనిగరపు చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ సామాజిక విప్లవ కారుడు సంఘ సంస్కర్త, మహిళా విద్యా ఉద్యమ పితామహుడు, కుల వివక్ష వ్యతిరేకి తన జీవితాంతం పోరాటం చేసిన మహా మనిషి, మహాత్మలకే మహాత్మ అని వారు కొనియాడారు.ఫూలే , 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలో జన్మించారు. ఆయన సమానత్వం, విద్య,సామాజిక న్యాయం కోసం చేసిన కృషిని నేటిసామజికనికి తెలియ జేయవలిసిన అవసరం ప్రభుత్వం పై ఉందన్నారు.సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాన్ని గుర్తించి, ప్రజలు ఆయనకు మహాత్మా అని గౌరవించారు. ఆయన రచనలు, అంటరానితనం నిర్మూలనకు, మహిళా సాధికారతకు మార్గదర్శకం అని వారు గుర్తు చేశారు.ఫూలే జయంతి సందర్భంగా అసమానత లేని సమాజం కోసం యువత, ప్రజలందరూ పోరాడాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మద్యం శాఖకుమంత్రి ఉండగా విద్యాశాఖకు ఎందుకు లేడు?

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్:తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 28నెలల పాలనలో హానికర మద్యం శాఖకు మంత్రిని కేటాయించి భవిష్యత్తు విద్యార్థుల చదువులకు ప్రత్యేక మంత్రిని కేటాయించకపోవడం సిగ్గు చేటని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ లక్షలాది మంది విద్యార్థులతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యను వ్యాపారరంగంగా మార్చారని,రేవంత్ రెడ్డి కి విద్యారంగం బలోపేతం కావాలని ఆతృత చిత్తశుద్ధి ఉంటే రేవంత్ రెడ్డి విద్యారంగానికి ప్రత్యేక మంత్రిని అయిన కేటాయించాలి లేక రేవంత్ రెడ్డి సీఎం పదవి వదులుకొని విద్యాశాఖ మంత్రిగా అయిన ఉండాలని, ప్రతి ప్రైవేట్ విద్యాసంస్థ ఫీజులు వసూలు చేస్తున్నది ఎం..? సిబ్బందికి ఇచ్చే జీతాలు ఎంతో విద్యాసంస్థల నోటీస్ బోర్డ్ పై పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయడంలో హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిల విడుదల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకోకుండా వారి చదువులకు నిధులు లేవు కానీ హెలికాప్టర్ లల్లో మంత్రులు దుబారాగా తిరగడానికి,కేరళ ఎన్నికలకు నిధులు వస్తున్నాయని, రాష్ట్రంలో విద్యా రంగానికి ప్రత్యేక మంత్రి లేకపోవడం ద్వారానే సమస్యలు పేర్కొన్నాయని, ప్రభుత్వానికి మద్యం ద్వారా వచ్చే ఆదాయంపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల సంక్షేమంపై వారికి ప్రత్యేక మంత్రి నియామకంపై లేదని, సీఎం రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖ పెట్టుకొని ఎవరిని కలవకుండా సమస్యలు పరిష్కరించడం లేదని, హైకోర్టు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వసూలు చేసుకోమని ప్రైవట్ యాజమాన్యాలకు చెప్పినా ఇప్పటికీ ప్రభుత్వం మౌనంగా ఉండటం అంటే ఫీజు రీయింబర్స్మెంట్ ఎత్తివేసే కుట్ర అని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలల్లో ఫీజుల దోపిడీ అరికట్టడంలో, విద్యా హక్కు చట్టం అమలు చేయడంలో, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు వచ్చే విద్యాసంవత్సరం అడ్మిషన్లు ఇప్పుడే నిర్వహిస్తూ ప్రచారం చేస్తున్నారని వ్యాపార ప్రకటనలకు మించి పోయే విధంగా విద్యా వ్యాపార ప్రకటనలు ఉన్నాయని, ఆయా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ప్రతి సంవత్సరం ఫీజులు పెంచుకుంటూ దోపిడీ చేస్తూ అందులో పని చేసే సిబ్బందికి జీతాలు పెంచడం లేదని, టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందికి సరిపడి జీతాలు ఇవ్వడం లేదని పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా టీచింగ్ ,నాన్ టీచింగ్ సిబ్బంది జీతాలు పెంచాలని ,రేవంత్ రెడ్డి ప్రైవేట్ లో ఫీజుల దోపిడీకి చెక్ పెడతామని చెప్పి మాటలకే పరిమితం అయ్యాడని రానున్న విద్యాసంవత్సరం నుండి ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వం వారం రోజుల్లో ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే ప్రభుత్వం పై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని మణికంఠ రెడ్డి హెచ్చరించారు.

## చదువును నమ్ముకుని ఉన్నతంగా ఎదగాలి

### కలెక్టర్ చిత్రా మిశ్రా




ప్రజాపక్షం/కరీంనగర్:సమాజ సంఘసంస్కర్త, జ్ఞానమే వికాసమని చెప్పి బాలికల విద్య కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతిబాఫూలే స్ఫూర్తితో మనందరం ముందుకు సాగుదామని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిబా ఫూలే జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలో శాతవాహన యూనివర్సిటీ వద్ద జ్యోతిబాఫూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్. చిత్రా మిశ్రా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, నగరం మేయర్ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఏప్రిల్ నెలలో మహనీయులు జన్మించారన్నారు. సమాజానికి ఫూలే అసమాన సేవలు అందించారన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం సాధ్యమని, చదువును నిర్లక్ష్యం చేయవద్దని యువతకు సూచించారు. ఆ రోజుల్లోనే చదువు గొప్పతనం తెలుసుకొని, బాలికలకు విద్య అందించేందుకు పాఠశాలలు, అనాథల కోసం ఆశ్రమాలు ఏర్పాటు చేసిన మహనీయుడని పేర్కొన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ 200 ఏళ్ల కిందటే అన్ని సమస్యల కు చదువే పరిష్కారమని నమ్మి, బాలికల విద్యను ప్రోత్సహించారని గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అందరం కలిసి కృషి చేద్దామని పి లుపునిచ్చారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, చదువుతోనే జ్ఞానం లభిస్తుందని, జ్ఞానంతో మన సమస్యలు మనమే పరిష్కరి ంచుకుని శక్తి వస్తుందని పేర్కొన్నారు. తన భార్య సావిత్రిబాయికి చదువు చెప్పి ఉపాధ్యాయురాలు చేసిన ఘనత ఆ మహనీయుడి సొంతమని గుర్తు చేశారు. మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి ఫూలే ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. సామాజిక అడ్డంకులను దాటుకుని బాలికలు చదువుకు నేలా పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. డిప్యూటీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ, ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్న ఫూలే , అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేశాడని వివరించారు. ఈ సందర్భంగా పలువురు ఫూలే జీవితం గురించి వివరించారు. అనంతరం అంబేద్కర్, ఫూలే ఆలోచనలపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలి

### తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి రాజిరెడ్డి డిమాండ్

ప్రజాపక్షం/జమ్మికుంట:కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ కార్పొరేట్లకు, బహుళ జాతి సంస్థలకు ఉపయోగపడే చట్టాలు తెస్తుందని, ప్రొఫసర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఒక ప్రైవేటు విద్యాసంస్థలో తెలంగాణ రైతు సంఘం మండల నాలుగో మహాసభ కాయిత లింగారెడ్డి అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై రాజిరెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కరోనాకాలంలో రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలు తెచ్చిందని, రైతాంగ ఐక్య ఉద్యమ పోరాటాలతో ఆ చట్టాలను రద్దు చేశారని గుర్తు చేశారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ తక్షణమే పరిష్కరించాలని, మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోఆదివారం జ రిగే రైతు సంఘం జిల్లా 9వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి శీలం అశోక్, బాసిర సంపత్ రావు, కడిపికొండ రామ్ రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, రామారావు, సంజీవరెడ్డి, కిరణ్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను చిన్నచూపు చూస్తున్న కాంగ్రెస్ సర్కార్

### ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డ హరీష్‌రావు



ప్రజాపక్షం/ సిద్దిపేట : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్లక్ష్య మూలంగా అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, పంట కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై మాజీ మంత్రి హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డును మాజీ మంత్రి హరీష్‌రావు సందర్శించి పొద్దుతిరుగుడు, మొక్కజొన్న కొనుగోళ్లను పరిశీలించారు. రైతులు ధాన్యం కొనుగోలు చేయటం లేదని మాజీ మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో హరీష్‌రావు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డును సందర్శించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్, కేంద్రాలోల మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని, వెంటనే ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలన్నారు. చాల చోట్ల కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేయకపోవటం పట్ల తక్కువ ధరకు అమ్ముకొని రైతులు నష్టపోతున్నారన్నారు. సిఎం రేవంత్ రెడ్డి పంట మార్పిడి చేయమని చెపుతున్నారని కాని రైతులు పంట మార్పిడి చేస్తే వాటిటి కోనే దిక్కులేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను ఇబ్బందిపెట్టే ప్రయత్నమన్నారు. పలుజిల్లాలో వడగండ్ల వానతో పంటపొలాలను నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు సమయానికి రైతుబంధు ఇవ్వాలన్నారు. బిసి డిక్లరేషన్ పేరిట రేవంత్‌రెడ్డి బిసిలను మోసం చేశారన్నారు. కెసిఆర్ అన్ని కులవృత్తులను ప్రోత్సహించారన్నారు. బిసిలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దగా చేసిందన్నారు. బిసి విద్యార్థుల ఫీజు, రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు.

**హనుమాన్ స్వాములతోకలసి భిక్ష చేసిన మాజీ మంత్రి హరీష్‌రావు**

సిద్దిపేట రావిచెట్టు హనుమాన్ దేవాలంలో మాజీ మంత్రి హరీష్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ స్వామికి వెండి ఆభరణాలు సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ సర్వ జగత్ రక్షకుడడన్నారు.స్వాముల దీక్ష ఫలించి సంకల్పాలు నేరవేర్చాలన్నారు. హనుమాన్ స్వామి అనుగ్రహంతో అన్నింటా శుభం కలుగాలన్నారు. ఆనంతరం సిద్దిపేట ఘఅర్బన్ మండలం వెల్కటూర్ పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ వెల్కటూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు.గ్రామానికి ఇరువైపుల డబుల్ రోడ్లు చేసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో గ్రామాన్ని ఇంకా అభివృద్ధి చేసేందుకు తనవంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
ఆదివారం
12-04-2026
www.prajapaksham.in

‘ మంగ్లీపై పెట్టిన కేసుకు తనకు ఎలాంటి సంబంధం లేదని రాజు వెడ్స్ రాంబాయి సినిమా నిర్మాత వేణు ఉడుగుల పేర్కొన్నారు. ఈ వ్యవహారమంతా జరిగిన మాట తనకు కొంతవరకు తెలుసునని, అయితే ఈ విషయంలో తనపై కూడా ఆరోపణలు రావడంతో నేను వెళ్లి పోలీసులకు అసలు విషయాన్నీ చెప్పానని వేణు చెప్పారు. ’

రీల్

## ‘మాట నిలబెట్టుకున్నాం’
### హీరో శర్వానంద్



చార్మింగ్ స్టార్ శర్వానంద్ లేటెస్ట్ బంపర్ బ్లాక్ బస్టర్ బైకర్. మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రాజశేఖర్ పవర్ ఫుల్ పాత్రని పోషించారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో ప్రతిష్టాత్మక బ్యానర్ యువీ క్రియేషన్స్ నిర్మాణంలో. ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ప్రేక్షకులు నుంచి విజయాన్ని అందుకుని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ బైకర్ తెలుగు సినిమా గర్వపడేలా ఉంటుందని చెబుతున్నాను. ఆ మాట తప్పలేదు. అలాంటి మంచి ఫ్యామిలీ సినిమాను తీశాం. సినిమా అద్భుతంగా మౌత్ టాక్‌తో వెళ్తోంది. దానికి కారణం ఫ్యామిలీ ఆడియన్స్, యూత్. అభిలాష్ మంచి ఫాదర్ అండ్ సన్ స్టోరీ చెప్పాడు. ఇది చాలా ఎమోషనల్ మూవీ. నిజ జీవితంలో తండ్రి, కొడుకులు అలానే ఉంటారు. రాజశేఖర్ మాకు ఎప్పుడూ హీరోనే. ఆయన ఈ సినిమా చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. రేసింగ్ సీన్స్ ఇంత అద్భుతంగా వచ్చాయంటే, అది మొత్తం టీమ్ ఎఫర్ట్. టెక్నికల్‌గా సినిమా హాలీవుడ్ స్థాయిలో ఉందని ప్రశంసలు రావడానికి మా టీమ్ వర్క్ కారణం అన్నారు. డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ సినిమా ఇంత విజయం సాధించడానికి, నా క్యారెక్టర్‌కు మంచి పేరు రావడానికి కారణం అభిలాష్ రెడ్డి. శర్వానంద్ హీరోగా చేస్తున్న సినిమాలో నేను ఇంత మంచి క్యారెక్టర్ చేయడం చాలా ఆనందంగా ఉంది. అలాగే శర్వానంద్, మాళవిక ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. చాలా అద్భుతంగా నటించారని చెప్పారు. డైరెక్టర్ అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రీమియర్స్ నుంచే ఇండస్ట్రీలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సినిమాను అభినందించారు. చూసిన వాళ్లందరూ కూడా ఇంత అద్భుతంగా ఎలా తీశారని అడుగుతున్నారు. టెక్నికల్‌గా సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఆడియన్స్ చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నారు. సినిమాలో రేసింగ్‌తో పాటు ఎమోషనల్‌గా కూడా కనెక్ట్ అవుతున్నారు. ఫాదర్ అండ్ సన్, వైఫ్ అండ్ హస్బెండ్ ఎమోషన్స్‌కు చాలా బాగా కనెక్ట్ అవుతున్నారు. మొదటి రోజు నుంచే ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు వస్తున్నారని తెలిపారు.హీరోయిన్ మాళవిక నాయర్ మాట్లాడుతూ ఫ్యామిలీ సపోర్ట్ లేక పోతే మనం ఏమీ చేయలేం. అదే పాయింట్‌తో ఈ సినిమాను మీ ముందుకు తీసుకొచ్చాం. ఎమోషన్‌కు ఆడియన్స్ చాలా అద్భుతంగా కనెక్ట్ అవుతున్నారు. సినిమాను చూసి మరో పదిమందికి చెప్పండి అని అన్నారు.

## రవిబాబు హీరోగా ‘రేజర్’
### మే 8న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్

తెలుగు సినిమాలో యూనిక్ ఫిల్మ్ మేకర్‌గా, నటుడిగా ముద్రవేసిన రవిబాబు తన గత చిత్రాల కన్నా భిన్నమైన ఇంటెన్స్ వైలెంట్ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ ‘రేజర్’తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సురేష్ బాబు సమర్పిస్తుండగా, ఫ్లయింగ్ ఫ్రాగ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం, రవిబాబు తండ్రి దివంగత చలపతిరావు జయంతి సందర్భంగా, మే 8న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.‘ఎనుగుతోండం ఘటికాచలం’ వంటి లైట్ టోన్ చిత్రంతో అలరించిన రవిబాబు, ఇప్పుడు ‘రేజర్’తో టెన్షన్, సైకాలజికల్ వైలెంట్ యాక్షన్‌తో కూడిన డార్క్ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. దర్శకుడిగానే కాకుండా ప్రధాన పాత్రలోనూ నటిస్తూ, ఈ సినిమాకు తనదైన రా టచ్ ఇచ్చారు. టైటిల్ అనౌన్స్‌మెంట్‌తోనే మంచి హైప్ తెచ్చుకున్న ‘రేజర్’, తాజాగా విడుదలైన రిలీజ్ డేట్ గ్లింప్స్‌తోమరింత ఆసక్తి రేపుతోంది. రవిబాబు టెర్రిఫిక్‌గా కనిపించి థ్రిల్ కలిగించారు. తాజాగా విడుదలైన పోస్టర్లు సినిమాకి ఉన్న డార్క్ టోన్‌ను మరింత బలంగా చూపిస్తున్నాయి. నగర అల్లకల్లోలం, ఇండస్ట్రియల్ షాడోస్ మధ్య రవిబాబు ఇంటెన్స్ లుక్‌లో కనిపించగా, ఒక పోస్టర్‌లో చిన్నారితో కలిసి వీధిలో నడుస్తూ కనిపించడం కథలో ఎమోషనల్ యాంగిల్ కూడా ఉంటుందనే సంకేతాలు ఇస్తోంది. ఫిబ్రవరిలో షూటింగ్ పూర్తయిన ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. డబ్బింగ్ పనులు కూడా పూర్తి కాగా, ఫైనల్ ఫినిషింగ్ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ చిత్రానికి చరణ్ మాధవనేని సినిమాటోగ్రఫీ, ఎస్ఎస్ రాజేష్ సంగీతం, సతీష్ పొలొజు యాక్షన్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు.



## 17న ‘కాలగమనం’ విడుదల



పిఆర్ ఫిలిమ్స్ పతాకంపై రాజా బిరుదుల, లావణ్య రామారావు, చినబాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘కాలగమనం’. సుధాకర్ బుర్రి దర్శకత్వం వహిస్తూ, నిర్మిస్తోన్న ఈ లవ్ అండ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రం ఈనెల 17న థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ‘కాలగమనం’ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ రాజేష్ రాజ్ తేలు మాట్లాడుతూ ‘కాలగమనం’ సినిమాను మా డైరెక్టర్ సుధాకర్ బుర్రి బ్యూటిఫుల్‌గా తెరకెక్కించారు. నేను పోస్ట్ ప్రొడక్షన్ చేసే టైమ్ లో అనేక సార్లు ఈ చిత్రాన్ని చూశాను. నాకు బాగా నచ్చింది. ప్రేక్షకులు కూడా మా మూవీని ఇష్టపడతారని, సక్సెస్ చేస్తారని నమ్ముతున్నా అన్నారు. హీరోయిన్ లావణ్య రామారావు మాట్లాడుతూ మేమంతా కొత్త వాళ్లం. మాకు వచ్చే అవకాశాలు ఎంతో విలువైనవి. మా మూవీ ఈ నెల 17న థియేటర్స్‌లోకి వస్తోంది. మీరంతా సపోర్ట్ చేయాలి అని అన్నారు. దర్శక, నిర్మాత సుధాకర్ బుర్రి మాట్లాడుతూ నేను గతంలో కొన్ని షార్ట్ ఫిలింస్ చేశాను. సినిమా మేకింగ్ మీద ప్యాషన్ పెరుగుతూ వచ్చింది. మాకున్న బడ్జెట్‌లో ఒక మంచి కథను తెరకెక్కించాం. కంటెంట్ బాగుంటే చిన్న చిత్రానికైనా పెద్ద విజయాన్ని ప్రేక్షకులు అందిస్తున్నారు. ఈ మూవీ కంటెంట్ బాగుంది, అందుకే విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం. యువతను ఆకట్టుకునే అంశాలు ఉంటూనే పెద్దల్ని కూడా ఆలోచింపజేసే చిత్రమిది అన్నారు. ఈ చిత్రానికిడిఒపి మురళి కంకణాల, ఎడిటర్ శ్రీకృష్ణ ప్రసాద్, కాస్ట్యూమ్ డిజైనింగ్ శ్వేతా బొమ్మారెడ్డి, నిర్వహణ పిల్లెం రామారావు, శ్రీకర్ బుర్రి.



## యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ‘హరుడు’
### ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌లో హీరో వెంకట్

శ్రీ సీతా రాముల కల్యాణం చూతము రారండి, అన్నయ్య, ప్రేమ కోసం, శివ రామరాజు లాంటి సినిమాలతో అలరించిన హీరో వెంకట్ సినిమాల్లోకి కమ్ బ్యాక్ ఇస్తున్నారు. విఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో వెంకట్ హీరోగా రూపొందుతున్న మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ‘హరుడు’. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. సమ్మర్ స్పెషల్‌గా మే 8న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో వెంకట్ మాట్లాడుతూ ‘హరుడు’ సినిమాను పూర్తి చేయడానికి నేను యాక్టింగ్‌తో పాటు ప్రొడ్యూసర్ బాధ్యతలు కూడా తీసుకోవాల్సి వచ్చింది. చాలా మంచి నటీనటులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు. ఇందులో విలన్‌గా శ్రీహరి పైలా అనే కొత్త ఆర్టిస్ట్‌ను పరిచయం చేస్తున్నాం. ఈ సినిమాలో ప్రతీ పాత్రకూ ప్రాముఖ్య త ఉంటుంది. ఒక రొమాంటిక్ సా ంగ్‌ను గోవాలో షూట్ చేశాం ఆపాట చాలా బాగా వ చ్చింది. ఆయన ఎనర్జీని మ్యాచ్ చేయడం చాలా కష్టం. ముంబైలో ఐదు రోజుల షూటింగ్ చాలా మం చి అనుభవం.

## ‘రా రా ధీవర’ అంటున్న నిఖిల్



‘కార్తికేయ 2’తో పాన్ ఇండియా విజయాన్ని అందుకున్న నిఖిల్ సిద్ధార్థ, ఇప్పుడు తన అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం ’స్వయంభు’తో రాబోతున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో, పిక్సెల్ స్టూడియోస్ భువన్, శ్రీకర్ నిర్మాణంతో, టాగూర్ మధు సమర్పణలో రూపొందిన ఈ చిత్రాన్ని ఒక భారీ చారిత్రక యాక్షన్ చిత్రంగా తీర్చిదిద్దారు. రవి బస్రూర్ సంగీతం అందించగా, ఈ చిత్రం ఫస్ట్ సింగిల్ ‘రా రా ధీవర’ ఏప్రిల్ 16న విడుదల కానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాతలు ఒక పవర్ఫుల్ పోస్టర్ ద్వారా ప్రకటించారు. ఈ పోసర్‌లో నిఖిల్ ఒక యోధుడి అవతారంలో, దట్టమైన అడవిలో నిలబడి, ఈటెను విసరడానికి సిద్ధంగా ఉన్నట్లుగా కనిపించారు. ఈ పాట ఎంత గ్రాండ్‌గా, అద్భుతంగా, కళ్లు చెదిరేలా ఉండబోతోందో ఈ పోస్టర్ సూచిస్తుంది. ఇంతకుముందు విడుదలైన టీజర్, భారీతనం, విజువల్స్, ప్రపంచాన్ని ఆవిష్కరించిన తీరుకు అద్భుతమైన స్పందనను అందుకుని, సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పింది. పాత్రలో సహజంగా ఒదిగిపోవడానికి నిఖిల్ ఈ ప్రాజెక్ట్స్ దాదాపు రెండు సంవత్సరాలు వెచ్చించి, ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. ఈ చిత్రంలో సంయుక్త, నభా నటేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. సినిమాటోగ్రఫీ కెకె సెంథిల్ కుమార్ అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: తమ్మిరాజు,మాటలు : విజయ్ కామిశెట్టి, యాక్షన్: కింగ్ సోలమన్, స్టంట్ సిల్వా, సాహిత్యం: రామజోగయ్య శాస్త్రి.

## అవాస్తవిక కథనాలతో అమిత్‌షా..
# న్యాయవ్యవస్థ నిర్వీర్యానికి యత్నం

ఇందుకు పార్లమెంట్‌ను వేదికగా వినియోగించుకోవడం తీవ్ర ఆక్షేపణీయం
స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయ్యవ్యవస్థపై కేంద్ర హోంమంత్రి దాడి చేశారు
‘భారత రాజ్యాంగం- న్యాయ వ్యవస్థ పాత్ర’ అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు ప్రముఖుల ఆగ్రహం





ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అవాస్తవిక కథనాలతో పథకం ప్రకారం న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తున్నారని పలువురు ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు ఆయన పార్లమెంట్‌ను వేదికగా వినియోగించుకోవడం తీవ్ర ఆక్షేపణీయమని వారు పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 121 ఆర్టికల్ ప్రకారం న్యాయవ్యవస్థ ఇచ్చిన తీర్పులను విమర్శించరాదని, చర్చించరాదని పొందుపర్చారని, దానిని కూడా హోంమంత్రి అమిత్‌షా ఉల్లంఘించి స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయ్యవ్యవస్థపై దాడి చేశారని విమర్శించారు. ‘భారత రాజ్యాంగం న్యాయ వ్యవస్థ పాత్ర’ అనే అంశంపై రౌండ్ టేండ్ సమావేశం శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. న్యాయవాద, పౌర సంఘాలు సిపిసిఆర్, ఐపిఎల్, సిఎల్‌సి, హెచ్‌ఆర్‌ఎఫ్, ఒపిడిఆర్, ఎఐఎల్‌యు, ఐఎఎల్, ఎపిసిఆర్, ఐఎల్‌వి, సిఎల్‌ఎంసి సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ అధ్యక్షత వహించారు. సమావేశంలో హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ టి.రజని మాట్లాడుతూ పార్లమెంట్ వేదికగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై ఓ పథకం ప్రకారమే వ్యాఖ్యలు చేశారన్నారు. ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం సడలితే తప్ప ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయలేమని, అది జరిగితే తప్ప వన్ నేషన్ సాధ్యం కాదనే తలంపుతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. భారతదేశంలో వన్ నేషన్ అనే దానికి తావులేదని, భారత్ గుర్తింపే విభిన్న జాతుల సహజీవన విధానమన్నారు. ఈ డైవర్సిటీని ఛేధించి వన్ నేషన్ సాధించేందుకే అమిత్‌షా అనేక అవాస్తవిక కథనాలు అల్లుతున్నారన్నారు. సల్వా జూడుం కేసుల్లో జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అద్భుతమైన తీర్పును ఇచ్చారన్నారు. అయితే జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎన్‌డిఎ కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థికి వ్యతిరేకంగా పోటీ చేయడంతో ఏదో ఒక ముద్ర వేయాలనే తలంపుతోనే 2010లో ఇచ్చిన తీర్పును ఇప్పుడు కేంద్ర హోంమంత్రి ప్రస్తావించడం ద్వారా న్యాయవ్యవస్థపై బెదిరింపులకు పాల్పడే ప్రయత్నం చేశారన్నారు. ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాలన్నారు. కేంద్ర హోంమంత్రి కేవలం జస్టిస్ సుదర్శన్‌రెడ్డినో, ఆ తీర్పును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు మాత్రమే కాదని, ఒక ప్రజాస్వామిక స్రవంతి ఆలోచనపై చేసిన దాడిగా ఆయన పేర్కొన్నారు. బలప్రయోగ అధికారం కేవలం ప్రభుత్వాలకు మాత్రమే ఉంటుందని, దానిని ప్రైవేటీకరించడానికి వీలు లేదన్నదే జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీర్పు సారాంశమని స్పష్టం చేశారు. అందులో ఆక్షేపణీయమైన అంశం ఏమీ లేదని, కానీ దానిని పదే పదే ప్రస్తావిస్తూ ఆ తీర్పు వల్లే సల్వా జూడంపై దాడులు జరిగాయని, దానితో అది దెబ్బతిన్నదని ప్రచారం చేస్తూ కేంద్ర మంత్రి చేస్తున్న వ్యాఖ్యలు చాలా అన్యాయమన్నారు. దేశంలో ఇలాంటి ఆలోచనను సహించలేని స్థితికి చేరుకున్నామని, దీని పర్యావసానం తీవ్రంగా ఉంటుందని, అందుకు అందరూ స్పందించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. అమిత్‌షా చత్తీస్‌ఘడ్‌ను దృష్టిలో పెట్టుకుని చేసిన వ్యాఖ్యలు కావని, మొత్తం దేశంలో ఎక్కడ ఎవరు ప్రజాస్వామిక దృష్టి కోణం నుంచి ఆలోచించి చర్చిస్తున్నా వారందరిపై అర్బన్ నక్సలైట్ అనే ముద్ర వేస్తు దాడులకు తెగబడుతూ రాష్ట్రాలకు సంబంధం లేకుండా నేరుగా కేంద్ర ప్రభుత్వమే కేసులను పెడుతున్నరన్నారు. అసలు అర్బన్ నక్సలైట్ అనే సిద్ధాంతానికి గట్టిగా జవాబు చెప్పాల్సిన అవసరముందని అసలు కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో నిలదీయాలన్నారు. నిజానికి అర్బన్, నక్సలైట్ అనేవి పొత్తు కుదరని పదాలని ప్రొఫెసర్ కోదండరామ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అమిత్‌షా శాసన వ్యవస్థకు ఉన్న అధికారాలను దుర్వినియోగం చేశారన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు, విమర్శలు పార్లమెంట్‌లో కాకుండా బహిరంగంగా చేసి ఉంటే ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఆయనపై వివిధ కోర్టులలో అనేక కేసులు ఉండేవన్నారు. అందులో భాగంగా ప్రజల భావాలకు, మత విశ్వాసాలకు వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చిన న్యాయమూర్తులు అప్పటికప్పుడే పార్లమెంట్ సభ్యులుగా, వివిధ కార్పొరేషన్లకు చైర్మన్‌గా నియమించబడుతున్నారని, ఆ కారణంగా కూడా న్యాయవ్యవస్థ తనకు ఉన్న ప్రాముఖ్యతను కొల్పోతున్నదన్నారు. మీడియాకు సంబంధించి చివరికి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను కూడా కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించకుండా నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వంలో కాషాయం, మతం తప్ప ఇంకా ఏమి మిగిలే ప్రసక్తేలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ సమాజం చైతన్యవంతంగా లేకపోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. నేరాలను నియంత్రించాల్సిన రాజ్యమే ప్రైవేట్ గ్యాంగ్‌ను ఏర్పాటు చేసి బలప్రయోగ అధికారం ఇవ్వవచ్చా, అప్పుడు పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగంలో ఒక భాగమైన న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా కేంద్ర మంత్రి అమిత్‌షా మాట్లాడడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. రాజ్యాంగం పరిరక్షణే లక్ష్యంగా ముందుకు వెళ్ళాలన్నారు. సామాజిక వేత్త నర్సింహ్మారెడ్డి, పౌర హక్కుల నేత జీవన్ కుమార్, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, న్యాయవాదులు ఎన్.కృష్ణారావు, శ్రీకాంత్, మహాదేవన్, నల్సార్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మురళి, ప్రజా సంఘాల నాయకులు సుమిత్ర, సిపిఐ(ఎం) నాయకులు రాములు, అన్వర్ ఖాన్‌లు మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి తీర్పుపై అప్పట్లోనే చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసే అవకాశం ఉన్నా, ఇప్పుడు కావాలనే కేంద్ర హోంమంత్రి ఆ తీర్పును ఉటంకిస్తూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై బురద జల్లే ప్రయత్నం చేశారని, అమిత్‌షా వ్యాఖ్యలు ముమ్మాటికీ న్యాయవ్యవస్థపై దాడేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జిసిసిల గమ్యస్థానంగా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రపంచంలోని దిగ్గజ ఫైనాన్స్ సంస్థలన్నీ తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల (జిసిసి) ఏర్పాటుకు హైదరాబాద్ నగరాన్ని గమ్యస్థానంగా ఎంచుకున్నాయని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. నైపుణ్యాల తో కూడిన ్ధిన పూల్, అంతర్జాతీయ స్థాయి మౌ లిక సదుపాయాలు, ట్రాఫిక్ సమస్య లేని రోడ్లు, అ ందుబాటులో ఉండే అద్దెలు ప్ర ముఖ కంపెనీలని ఆకర్షిస్తున్నాయని ఆయన తెలిపారు. న్యూయార్క్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే పికో టెక్నాలజి సంస్థప్రతినిధులు శనివారం సచివాలయంలో శ్రీధర్ బాబుతో భేటీ అయ్యారు. రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా సమావేశం లో పాల్గొన్నారు. ఫైనాన్సియల్ మార్కెట్ కు సం బంధించిన సేవలు అందించే పికో టెక్నోలజీ సంస్థ పికో టెక్నాలజీ ఇండియా అనే అనుబంధ కంపెనీ ద్వారా ఇక్కడ జిసిసి ఏర్పాటు చేయడానికి ముం దుకొచ్చింది. ఈ సంసర్భంగా శ్రీధర్ బాబు వారికి ఇక్కడి అవకాశాలు, మౌలిక వసతుల గురించి వివరించారు. రానున్న 510 సంవత్సరాలు, తర్వాత 20 సంవత్సరాల అవసరాలకు తగిన విధంగా మౌ లిక సదుపాయాలు మెరుగు పర్చేందుకు ప్రణాళిక లు అమలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. బెంగళూరు, ముంబాయి నగరాలతో పోలిస్తే ఇక్కడ ఆఫీసు స్థలాల ఆక్యుపెన్సీ 73 శాతం ఉందని చె ప్పారు. ముంబాయిలో అది 52 శాతం మాత్రమేనని తెలిపారు.బెంగళూరు, ముంబాయి మెట్రో న గరాల్లో ట్రాఫిక్, వాయు కాలుష్యం ప్రధాన సమస్యలుగా మారినందున ఐటి సంస్థలు, జిసిసిలు హైదరాబాద్ కు తరలి వస్తున్నాయని తెలిపారు.

**రహదారుల అభివృద్ధికి భారీగా నిధులు: కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

ఇప్పుడున్న నెహ్రూ రింగ్ రోడ్డుకు 30 కిలో మీటర్ల వెలుపల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నట్టు ఆ మ ంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి వెల్లడించారు. దానికి అనుబంధంగా రేడియల్ రోడ్లు ఏర్పాటవుతున్నాయిని వివరించారు.రింగ్ రోడ్ల పక్కన రైలు మార్గాన్ని కూడా ఏర్పాటు చేసి రవాణా సదుపాయాలను ప్రపంచంలోని పెద్ద నగరాలను తలదన్నేలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హయత్ నగర్ ఎల్‌బినగర్ ల మధ్య డబుల్ డెక్కర్ రోడ్డు నిర్మిస్తున్నాట్టు వివరించారు. కింది రోడ్డు స్థానిక ట్రాఫిక్ అవసరాలకు వినియోగిస్తామని పైన ఉండే రెండు అందు అంతస్థుల రోడ్లు నగరం నుంచి వెలుపలకు, లోపలకి వచ్చే వాహనాల కోసం ప్రత్యేకిస్తామని చెప్పారు. నాగపూర్ తర్వాత డబుల్ డెక్కరో రోడ్లు నిర్మిస్తున్న నగరం ఇదేనని అన్నారు. రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సమావేశంలో పికో టెక్నాలజి వ్యవస్థాపక సిఇఓ జారొడ్‌యుస్టర్, పికో ఇండియా సిఇఓ హరి కోదండరామన్, డైరెక్టర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్స్ తయారీలో ‘గ్లోబల్ హబ్’గా తెలంగాణ

- ఆ దిశగా రాష్ట్రంలో ‘ఎకో సిస్టం’ అభివృద్ధి
- కోటి టీవీలను ఉత్పత్తి చేసిన హైదరాబాద్ కంపెనీ ‘రేడియంట్’
- అభినందించిన మంత్రి శ్రీధర్ బాబు




ప్రజాపక్షం/హైదరాబాద్: ఎలక్ట్రానిక్స్ తయారీలో ప్రపంచ స్థాయి కేంద్రం (గ్లోబల్ హబ్)గా తె లంగాణను తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమ ని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధ ర్ బాబు పునరుద్ఘాటించారు. కేవలం ఉత్పత్తుల అసెంబ్లింగ్‌కు మాత్రమే పరిమితం కాకుండా, వి డిభాగాల తయారీ నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు అవసరమైన పూర్తిస్థాయి ‘ఎకో సిస్టం’ను అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. సచివాలయంలో కోటి (10 మిలియన్లు) టెలివిజన్ యూనిట్ల ఉత్పత్తి మైలురాయిని చేరుకున్న హైదరాబాద్‌కు చెందిన ‘రేడియ ంట్ అప్లయన్సెస్, ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్ర తినిధులను శనివారం ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బా బు మాట్లాడుతూ రేడియంట్ సంస్థ సాధించిన ఈ ఘనత తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి నిదర్శనమన్నారు. దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిని 2 030 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఈ లక్ష్య సా ధనలో ‘తెలంగాణ’ కీలక పాత్ర పోషించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఆ దిశగానే గతంలో ఎ న్నడూ లేని విధంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. ఓవై పు ఎలక్ట్రానిక్స్ తయారీలో టాప్ గ్లోబల్ ప్లేయర్స్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహిస్తూనే మరోవైపు వారికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, రెడీ టూ వర్క్ ఫోర్స్ తయారీపై దృష్టి సారి ంచామన్నారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి ఇక్కడి యువతకు ఉపాధి కల్పించాలన్నదే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన కు, విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అం డగా ఉంటుందన్నారు. సరళతర వాణిజ్య విధానాలతో పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం అందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెజల్యూట్ గ్రూప్ ఛైర్మన్ రమీందర్ సింగ్ సోయిన్, డైరెక్టర్ మణికందన్, లీగల్, ఐపిఆర్ హెడ్ శుభజిత్ సాహా, అడ్మినిస్ట్రేషన్ హెడ్ నోయెల్ రాబిన్ సన్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com